# ప్రాథమిక విద్యలో డిప్లమా (D.El. Ed)

కోర్సు - 503

# ప్రాథమిక స్థాయిలో భాషాధ్యయనం

ఖండం-2

## భాషాభ్యసనం - అనుబంధ నైపుణ్యాలు


**జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ**

A-24/25, ఇన్‌స్టిట్యూషన్ ఏరియా, సెక్టార్-62, నోయిడా

గౌతమ బుద్ధ నగర్, ఉత్తరప్రదేశ్- 201309,

వెబ్‌సైట్ : www.nios.ac.in

## ఖండం-2

# భాషాభ్యసనం - అనుబంధ నైపుణ్యాలు

**ఖండము - భాగాలు**

భాగం - 4 : శ్రవణం, భాషణం

భాగం - 5 : పఠనం

భాగం - 6 : లేఖనం

# విషయాలు


| క్రమ సంఖ్య | భాగం పేరు | | పేజీ నెంబరు |
|---|---|---|---|
| 1. | భాగం - 4 : | శ్రవణం, భాషణం | 1 |
| 2. | భాగం - 5 : | పఠనం | 27 |
| 3. | భాగం - 6 : | లేఖనం | 49 |



నోట్స్

# భాగం - 4 : శ్రవణం, భాషణం

**నిర్మాణం**


4.0 పరిచయం

4.1 అభ్యసన లక్ష్యాలు

4.2 శ్రవణం - భాషణం

4.2.1 శ్రవణం అంటే ఏమిటి?

4.2.2 భాషణం అంటే ఏమిటి?

4.3 తరగతిలో సంభాషణ - ఆవశ్యకత

4.4 తరగతిగదిలో శ్రవణ, భాషణ నైపుణ్యాభివృద్ధికి తీసుకోదగిన చర్యలు

4.4.1 బాలగేయాలు పాడటం, వినటం

4.4.2 చిత్రాల ద్వారా చర్చించటం (వర్ణించటం)

4.4.3 కథ చెప్పటం / వినటం

4.4.4 నాటకం / రంగస్థలం / ప్రదర్శనల ద్వారా భాషాభివృద్ధి

4.4.5 సహపాఠ్య కార్యక్రమాలు

4.5 ధారాళత - నిర్దుష్టత

4.6 సారాంశం

4.7 సంప్రదింపు గ్రంథాలు

4.8 భాగాంత అభ్యాసం


## 4.0 పరిచయం

ఇంట్లో మాట్లాడే భాషతో పాటు ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ ఇతర భాషలను మాట్లాడే సామర్థ్యం పిల్లలకు ఉంటుందని గత అధ్యాయంలో మనం తెలుసుకున్నాం. ఇంటిలోను, బయట మాట్లాడటానికి, వినటానికి ఉన్న విస్తృతమైన అవకాశాలు పిల్లలకు ఈ సామర్థ్యాన్ని కలుగజేస్తాయి. ఒక్కోసారి పాఠశాలల్లో ఉపయోగించే భాషకు, ఇంటి భాషకు తేడా ఉన్నప్పుడు పాఠశాలలో ఉపయోగించే భాషను కూడా ఇంటి భాషతో పాటు ఎంతో తేలికగా నేర్చుకుంటారు. అయితే, ఇందుకు వారికి విస్తృతమైన అవకాశాలు కల్పించాల్సి ఉంటుంది.

ఈ అధ్యాయంలో శ్రవణం, భాషణ నైపుణ్యాల గురించి మరికొంత విస్తృతంగా అధ్యయనం చేద్దాం. శ్రవణం, భాషణం అంటే ఏమిటి? భాషను నేర్చుకోవటంలో ఈ రెండు నైపుణ్యాలు ఏవిధంగా సహాయపడతాయి? అనే విషయాలను ఈ అధ్యాయంలో పరిశీలిద్దాం. వీటితోపాటు భాషను బోధించే సందర్భంలో ఈ రెండు నైపుణ్యాల గురించి, ఉపాధ్యాయుల దృష్టి కోణాన్ని కూడా పరిశీలిద్దాం.

## 4.1 అభ్యసన లక్ష్యాలు

ఈ అధ్యాయాన్ని చదివిన తర్వాత

- శ్రవణం, భాషణ నైపుణ్యాల అర్థం, భావనను అవగాహన చేసుకుంటారు.
- భాష బోధనాభ్యసన ప్రక్రియలో శ్రవణం, భాషణ నైపుణ్యాల పాత్రను అవగాహన చేసుకుంటారు.
- ఈ రెండు నైపుణ్యాలను బోధించే విషయంలో ఉపాధ్యాయుడి పాత్ర, బాధ్యతలను గుర్తిస్తారు.
- భాషణం విషయంలో స్పష్టత, ధారాళతల అవసరాన్ని అవగాహన చేసుకుంటారు.

## 4.2 శ్రవణం - భాషణం

పాఠశాలకు వెళ్ళటం ప్రారంభించిన మొదటి రెండు, మూడు నెలల కాలంలో పిల్లలకు శ్రవణ నైపుణ్యానికి సంబంధించిన అభ్యాసాలను ఎక్కువగా ఇస్తారు. పద్యాలు చదవటం, గేయాలు ఆలపించటం, సంఖ్యలు లెక్కించటం, అక్షరాలను గుర్తించి పలకటం మొదలైన విభిన్న కృత్యాల ద్వారా ఉపాధ్యాయుడు విద్యార్థులకు శ్రవణ సంబంధిత కృత్యాలు ఇస్తాడు. ఒక్కోసారి ఉపాధ్యాయుడే స్వయంగా కృత్యాలను విద్యార్థులతో చేయిస్తాడు. మరికొన్ని సందర్భాల్లో ఉపాధ్యాయుడు ఆయా పద్యాలు, గీతాల్లోని పంక్తులను చదివిన తర్వాత విద్యార్థులు ఉపాధ్యాయుడిని అనుసరిస్తూ, వాటిని తిరిగి చదువుతారు.

ఎందుకు వీటిని పలుకుతున్నామో? ఆ పదాలకు అర్థం ఏమిటో తెలియకపోయినా వాటిని ఎక్కువసార్లు పలకటం ద్వారా శాశ్వత స్మృతిలోకి తీసుకురావటం పైన పేర్కొన్న కృత్యాల లక్ష్యంగా ఉంటుంది. పూర్తిగా స్మృతిలోకి వచ్చేవరకు విద్యార్థులు ఉపాధ్యాయులు ఇచ్చిన మౌఖిక కృత్యాలను తరచు / నిరంతరం తప్పకుండా చేయాల్సి ఉంటుంది.

ఏదిఏమైనప్పటికీ, శ్రవణం - భాషణం అనే రెండు సమాంతరంగా సాగే నైపుణ్యాలని చెప్పుకోవచ్చు. ఏదైనా ఒక విషయాన్ని మనం మాట్లాడుతున్నప్పుడు ఇతరుల కన్నా ముందుగానే మనమే ఆ మాటల్ని వింటాం. మరికొన్ని సందర్భాల్లో మనం కేవలం శ్రోతలుగానే ఉండిపోతాం. రేడియోలో వార్తలు వినటాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అయితే, ఈ దృగ్విషయానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. వచ్చిన ప్రతి శబ్దాన్ని నిక్షిప్తం చేసుకుని, అవసరమైనప్పుడు ఒక్క పదం కూడా పొల్లుపోకుండా తిరిగి చెప్పే టేప్‌రికార్డర్‌కి, మనిషి వినటానికి తేడా ఉంటుంది. మనిషి శబ్దాన్ని విని అవగాహన చేసుకుంటాడు. యంత్రం కేవలం ధ్వనిని నిక్షిప్తం చేసుకుని అవసరమైనప్పుడు తిరిగి

ప్రకటిస్తుంది. కానీ, యంత్రం (టేప్ రికార్డర్) అవగాహన చేసుకోదు. ఇలా, అవగాహన చేసుకోవటమే మానవుడి శ్రవణ నైపుణ్యం యొక్క ప్రత్యేక లక్షణం / సామర్థ్యంగా గుర్తించవచ్చు. అవగాహన చేసుకోకుండా మనిషి ఏ ఒక్క వాక్యాన్ని తిరిగి చెప్పలేడు. టెలిఫోన్‌లో మాట్లాడటాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఫోన్‌లో అవతలి వ్యక్తి మాట్లాడిన మాటను మొదటగా మనం విని, అవగాహన చేసుకున్న తర్వాతనే మన ప్రతిస్పందనను తెలియజేస్తాం. అవగాహన చేసకోకుండా ఈ సంభాషణను కొనసాగించలేము.

కాబట్టి, భాషను నేర్చుకునే క్రమంలో శ్రవణం / భాషణ సామర్థ్యాలను (నైపుణ్యాలను) వేర్వేరుగా చూడటం సాధ్యపడదు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆలోచనా ప్రక్రియ, అవగాహన చేసుకోవటం మరియు పరిపృచ్ఛ (ఇంటర్వ్యూ) నిర్వహించే సందర్భాల్లో ఈ రెండు నైపుణ్యాలను పరస్పరాధారితాలుగా చెప్పవచ్చు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 1**

1. శ్రవణం - భాషణ నైపుణ్యాల్లో ప్రధానమైంది.

   ఎ) శ్రవణం    బి) భాషణం    సి) అవగాహన    డి) సమాచారాన్ని సేకరించటం

2. శ్రవణం - భాషణ ప్రక్రియలకు, సమాచారాన్ని సేకరించే ప్రక్రియకు మధ్యగల తేడా ఏమిటి?

   ----------------------------------------------------------------

   ----------------------------------------------------------------

   ----------------------------------------------------------------

3. ప్రాథమిక తరగతుల్లో శ్రవణం, భాషణ నైపుణ్యాలను వృద్ధి చేయటానికి విద్యార్థులకు ఎటువంటి అవకాశాలను / కృత్యాలను ఇస్తారు? ఈ కృత్యాలు తగిన స్థాయిలో ఉంటున్నాయా? నీ అభిప్రాయం ఏమిటి?

   ----------------------------------------------------------------

   ----------------------------------------------------------------

   ----------------------------------------------------------------

4. నీ మిత్రుడు ఈ రోజు ఉదయం ఆకాశవాణి వార్తలు వినటం తనకు కుదరదని, నిన్ను విని తనకు ఆ వివరాలు చెప్పమని అడిగాడు. ఈ పని పూర్తి చెయ్యటానికి నీకు అవసరమయ్యే సామర్థ్యాలు ఏమిటి? నీవు నీ మిత్రునికి ఆ వివరాలు ఎలా తెలియజేస్తావు?

   ----------------------------------------------------------------

   ----------------------------------------------------------------

   ----------------------------------------------------------------

నోట్స్

### 4.2.1 శ్రవణం అంటే ఏమిటి?

మన పరిసరాల నుంచి వచ్చే అనేకరకాలైన ధ్వనులను మనం నిత్యం వింటూ ఉంటాం. సాటి మనుషులు, యంత్రాలు, పశుపక్ష్యాదులు చేసే ధ్వనులన్నీ ఇందులో ఉంటాయి. అయితే మనం విన్న ప్రతి ధ్వనీ ఏదో ఒక అర్థాన్ని అందించదు. ఉదాహరణకు పక్షులు చేసే కిచకిచ ధ్వనులు, యంత్రాలు చేసే రణగొణ ధ్వనులు మనకు ఏ అర్థాన్నీ ఇవ్వవు. పక్షలు చేసే కిలకిల ధ్వనులతో మనకు ఆనందం కలుగుతుంది. కానీ, ఆ ధ్వనుల భావం అర్థం కాదు.

విన్న ధ్వనిలోని అర్థాన్ని తెలుసుకోవటం 'శ్రవణం'లో ముఖ్యమైన అంశంగా ఉంటుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య ఒక సంభాషణ జరుగుతున్నప్పుడు వక్త ప్రకటించే భావాన్ని శ్రోత తక్షణమే అవగాహన చేసుకుంటాడు. ఇది రెండు రకాలుగా జరుగుతుంది. ఆ విధానాలేమిటంటే...

1) వక్త పలుకుతున్నప్పుడు పదాల అర్థం ఆధారంగా శ్రోత భావాన్ని తెలుసుకుంటాడు. పదాలు, వాక్యాలు మొదలైన వాటిని విసంకేతీకరణం చేయటం ద్వారా ఇది సాధ్యపడుతుంది. ఇదంతా జరగటానికి శ్రోతకు, వక్త పలుకుతున్న పదాల అర్థాలు, వాక్య నిర్మాణంలో ఆ పదాల వరుసక్రమం తెలిసి ఉండాలి. ఒక ఉదాహరణ ద్వారా దీని గురించి మరింత తెలుసుకుందాం.

మీ మిత్రుడు నిన్ను తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. ఇప్పటిదాకా నువ్వు అతని ఇంటికి వెళ్ళలేదు. నిన్ను పిలిచిన రోజున నువ్వు అతనికి ఇంటి చిరునామా కోసం ఫోన్ చేశావు. అతను ఇలా చెబుతున్నాడు.

'సిటీ సెంటర్ నుంచి కుడివైపు మూడో సందులోకి తిరుగు. కొద్ది దూరం వచ్చాక ఎడమ వైపునకు తిరుగు. ఆ సందు ప్రారంభంలో బావర్చీ హోటల్ ఉంటుంది. ఆ సందులో మూడో ఇల్లే మాది.'

మిత్రుడు చెప్పిన మాటల్ని తరచుగా గుర్తుచేసుకుంటూ అతని ఇంటిని గుర్తుపట్టటానికి నువ్వు బయలుదేరతావు. ఈ ప్రక్రియలో అతడు ఇచ్చిన సూచనల వరుస మీద నీ దృష్టి ఎక్కువగా కేంద్రీకృతమై ఉంటుంది. అందుకోసం నువ్వు మిత్రుడు ఇచ్చిన సూచనల్ని చిన్న చిన్న భాగాలుగా విభజించుకుంటావు. (సిటీ సెంటర్ నుంచి మూడో వీధి, కుడిచేతి వైపునకు తిరగటం, కొంతదూరం నేరుగా ప్రయాణించటం, ఎడమ వైపునకు తిరగటం, బావర్చీ హోటల్, మూడో ఇల్లు). ఈవిధంగా మిత్రుడు ఇచ్చిన సూచనల్ని విసంకేతికరణ చేసుకుని, వాటి అర్థాన్ని పూర్తిగా అవగాహన చేసుకునేందుకు ప్రయత్నం జరుగుతుంది. ఈ మొత్తం ప్రక్రియలో మొత్తం వాక్యంలోని ప్రధాన భాగాలను గుర్తించటం, విభజించటం వాటిలోని సహసంబంధాన్ని గుర్తించటం ప్రధానాంశాలుగా ఉంటాయి.

ఈ పద్ధతే అన్ని రకాల వాక్యాలను అర్థం చేసుకునే ప్రక్రియలో అంతర్లీనంగా సాగుతుంది. ఇదంతా జరగటానికి శ్రోతకి అనంతమైన పదసంపద, వాక్యనిర్మాణం పట్ల అవగాహన ఉండి తీరాలి. నిరంతరం ఈ ప్రక్రియను కొనసాగించటం వల్ల ఈ క్రింది నైపుణ్యాలు అలవడతాయి.

- వక్త పలికిన వాక్యాన్ని శ్రద్ధగా వినటం.

- ప్రధానమైన, కీలకమైన పదాలను గుర్తించటం
- కీలక పదాలు మరియు వాక్యానికి ఉన్న వ్యాకరణ సంబంధమైన సమన్వయాన్ని అవగాహన చేసుకోవటం
- వ్యక్తి పలికిన పదాల్లోని విరుపు, ఉచ్చారణ ధ్వనిభేదాలను గ్రహించటం

2) రెండో విధానంలో మన పూర్వజ్ఞానం ఆధారంగా వాక్యాల్ని అర్థం చేసుకోవటం జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో వక్త మాట్లాడుతున్న పదాలకు అర్థాన్ని తెలుసుకుంటూ అతడు పలికిన భావాన్ని అర్థం చేసుకునే క్రమంలో ఆ సంఘటన తాలూకు శ్రోతకు ఉన్న పూర్వజ్ఞానం ప్రభావం చూపిస్తుంది. ఏదైనా సంభాషణ, చదవటం, సంఘటన తాలూకు మనకు ఉన్న పూర్వజ్ఞానం ప్రస్తుత సంభాషణ గురించి మనకు అవగాహన కలగటంలో సహకరిస్తుంది.

ఉదాహరణకు నేను రేడియోలో వార్తలు వింటున్నప్పుడు 'చైనాలో గత రాత్రి తీవ్రమైన భూకంపం సంభవించింది' అని వినటం జరిగిందనుకుందాం. వెంటనే నా మనసులో కొన్ని ప్రశ్నలు ఉదయిస్తాయి.

- భూకంపం ఎంత తీవ్రస్థాయిలో ఏర్పడింది?
- ఎంతమంది ఈ ఘటనలో చనిపోయి ఉండవచ్చు? లేదా గాయపడి ఉండవచ్చు?
- ఏ మేరకు ఆస్తినష్టం జరిగి ఉంటుంది?
- సహాయకచర్యలు ఏవిధంగా జరుగుతున్నాయి?

ఈ ప్రశ్నలన్నీ పైన చెప్పిన వాక్యాన్ని అర్థం చేసుకునేందుకు దోహదం చేస్తాయి. నేను విన్న వాక్యంలోని భావాన్ని గ్రహించేందుకు ఆ సంఘటన తాలూకు పూర్వజ్ఞానం సహాయపడుతుంది. చైనాలో వచ్చిన భూకంపం తాలూకు పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవటానికి, పరిస్థితిని అవగాహన చేసుకోవటానికి పూర్వజ్ఞానమే ఆధారమవుతుంది. చైనాలో భూకంపం ఇప్పుడు సంభవించవచ్చు. కానీ భూకంపం గురించి ఇంతకుముందు మనం విన్న / చదువుకున్న / చర్చించిన విషయం ప్రస్తుత ఘటన తాలూకు విషయాన్ని అవగాహన చేసుకునేందుకు సహకరిస్తుంది. ఒక్కోసారి వక్త మాట్లాడే సందర్భంలో వచ్చిన అవరోధాల కారణంగా భూకంపం అనే పదం శ్రోతకు వినపడకపోయినా, భూకంపం అనే పదం గురించి అవగాహన లేకపోయినా వార్తలో విన్న వాక్యానికి అర్థం బోధపడదు. ఈవిధానంలో (పూర్వజ్ఞానం ఆధారంగా) శ్రవణం చేసేటప్పుడు శ్రోతలో ఈ క్రింది సామర్థ్యాలు / నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి.

- సందర్భానికి తగిన ప్రశ్నలు సంధించటం
- కార్యకారణ సంబంధాన్ని అంచనా వేయటంం
- సందర్భంలో చెప్పబడని అంశాలను ఊహించటం

నోట్స్

పైన వివరించిన రెండు ప్రక్రియలు శ్రవణం జరిగేటప్పుడు సమాంతరంగా జరుగుతాయి. శ్రోతకు వక్త పలికిన పదాల గురించి ఉన్న జ్ఞానం, సమాచార స్థాయి, సమాచార విధానం, శ్రోతకు ఉన్న అవసరం మొదలైన కారణాలు ఈ రెండు ప్రక్రియల్లో ఏది ఎక్కువ ప్రభావవంతంగా జరుగుతుందనే విషయాన్ని నిర్ధారిస్తాయి.

**మీ ప్రగతి పరీక్షించుకోండి – 2**

1. శ్రవణం జరిగేటప్పుడు ఎన్ని విధాలుగా మనం అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంది?

   ఎ) ఒకటి బి) రెండు సి) మూడు డి) నాలుగు

2. ఒక వాక్యాన్ని పదాల ఆధారంగా అర్థం చేసుకునేటప్పుడు మనం అర్థాన్ని ఎలా తయారుచేసుకుంటాం? ఉదాహరణలతో వివరించండి.

3. 'పదాల ఆధారంగా అవగాహన చేసుకోవటం'; 'పూర్వజ్ఞానం ఆధారంగా పదాన్ని అర్థం చేసుకోవటం' – ఈ రెండు విధానాల మధ్య ఉన్న భేదం ఏమిటి?

4. 'నేను దంతవైద్యుడిని కలవటానికి వెళ్తున్నాను' అని మీ మిత్రుడు చెప్పగానే మీ మదిలో ఎలాంటి / ఏయే ప్రశ్నలు ఉద్భవిస్తాయి?

## 4.2.2 భాషణం అంటే ఏమిటి?

ఏవో కొన్ని శబ్దాలు, పదాలు, వాక్యాలు పలకటం మాత్రమే భాషణం కాదు. Jean Aitchison తన పుస్తకం 'The Articulate Manmmal'లో, మానవులు ఏవిధంగా సంభాషించుకుంటారో వివరణాత్మకంగా రాశారు. ఆమె ప్రకారం, మాట్లాడేటప్పుడు (భాషణం) వక్త మాట్లాడటంతో పాటు మరికొన్ని ప్రక్రియలు కూడా చేస్తాడు. మనం ఏం మాట్లాడితే, ఎలా మాట్లాడితే, ఏ స్థాయిలో మాట్లాడితే

శ్రోతకు అర్థమవుతుందో అని మాట్లాడటానికి పూర్వమే ఆలోచన చేస్తాం. సందర్భానికి తగినట్లు ఎలా మాట్లాడాలి? ఏం మాట్లాడాలి? అనే ఒక ఆలోచన కూడా మన మెదడులో కలుగుతుంది. ఉదాహరణకు 'రేపు కాలేజీకి శెలవు' అనే విషయాన్ని మన మిత్రుడికి, తాతయ్యకి చెప్పాలనుకుందాం. చెప్పే విషయం ఒక్కటే అయినా చెప్పేవిధానం,, ఉపయోగించే పదాలు వేర్వేరుగా ఉంటాయి.

ఏదిఏమైనప్పటికీ, రెండు సందర్భాల్లోనూ మనం ఏం మాట్లాడాలో ముందుగానే నిర్ణయించుకుంటాం. ముందుగా ఏం మాట్లాడాలి? తర్వాత ఏం చెప్పాలి? అనే ఆలోచన వస్తుంది. ఒక్కోసారి, ఒక మాట మాట్లాడుతున్నప్పుడే తర్వాత ఏం మాట్లాడాలన్న ఆలోచన మనసులో మెదులుతుంది. ఈకింది ఉదాహరణ ద్వారా ఈ విషయాన్ని అర్థం చేసుకుందాం.

'నేను ఈరోజు ఇంటికి రావటం ఆలస్యం అవుతుంది'

'అమ్మకు కోపం వస్తుంది'

'నేను ఇంటి బయటే ఉండిపోవలసి వస్తుంది'

పైన పేర్కొన్న మూడు వాక్యాల నిర్మాణం చాలా సరళంగా ఉంటుంది. ఈ మూడు వాక్యాలను కలిపి పైవిధంగా చెప్పినట్లయితే వాటిని అర్థం చేసుకోవటం, మాట్లాడటం చాలా తేలికగా ఉంటుంది. అలాకాకుండా, ఈ మూడు వాక్యాలు ఒకదాని మీద మరొకటి ఆధారపడి ఉండేలా చెబితే (రాస్తే), వాటిని అర్థం చేసుకోవటం ఇంతకుముందు కన్నా కష్టం అవుతుంది.

'ఇవాళ నేను ఇంటికి ఆలస్యంగా వచ్చినట్లయితే, అప్పుడు అమ్మకు కోపం రావటంతోపాటు నేను ఇంటి బయటే ఉండిపోవలసి వస్తుంది లేదా ఎవరైనా మిత్రుడి ఇంటికి వెళ్ళాల్సి వస్తుంది'.

పైవాక్యంలో 'అయితే' అనే పదం మీద 'అప్పుడు' అనే పదం ఆధారపడి ఉంటుంది. అదేవిధంగా 'లేదా' అనే పదం కూడా 'వెళ్ళాల్సివస్తుంది' అనే పదం మీద ఆధారపడుతుంఇ. ఈ మొత్తం వాక్యాన్ని ఉచ్చరించటానికి పూర్వమే ఈ వాక్యంలోని భావానికి తగిన పదాల ఎంపిక మన మనసులో జరుగుతుంది. ఈ ఉదాహరణ ద్వారా ఒక విషయం స్పష్టమవుతుంది. మాట్లాడటానికి పూర్వమే అందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవటం తప్పనిసరి. ఒక్కోసారి మాట్లాడటానికి ముందుగా ప్రణాళిక చేసుకోకపోయినా, మాట్లాడటం ప్రారంభించాక అత్యంత వేగంగా మన మనసులో తర్వాతి మాటలకు సంబంధించిన ఆలోచన జరుగుతుంది. మాతృభాష విషయంలో ఇలా తరచుగా / అత్యంత సహజంగా ఇది జరుగుతుంది. ద్వితీయ భాష నేర్చుకునే విషయంలో ఈ ప్రక్రియ జరగటాన్ని మనం గమనించవచ్చు.

మాట్లాడేటప్పుడు లేదా మాట్లాడాలి అని నిశ్చయించుకున్నప్పుడు మన భావాలకు తగిన పదాలను, వాటి వ్యాకరణ నియమాలకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే మన భావాన్ని పూర్తిగా వ్యక్తీకరించటం సాధ్యమవుతుంది.

గాత్ర వైవిధ్యం, విరామం, లయ – ఈ మూడు ధర్మాలు కూడా భాషణాన్ని ప్రభావితం చేస్తాయి. వక్త తన భావాన్ని పూర్తిగా ప్రకటించటానికి కేవలం పదాలు పలికితే సరిపోదు. వాటికి పైన

నోట్స్

పేర్కొన్న మూడు ధర్మాలు ఉండి తీరాలి. ఒక ఉదాహరణ ద్వారా ఈ విషయాన్ని అర్థం చేసుకుందాం. 'రాయిలా కూర్చో' - ఈ వాక్యం పలికేటప్పుడు 'రా' తర్వాత కొంత విరామం ఇచ్చి 'యిలా కూర్చో' అంటే 'ఇక్కడకు వచ్చి కూర్చో' అనే అర్థం వస్తుంది. అలాకాకుండా, 'రాయిలా' అన్న తర్వాత విరామం ఇచ్చి 'కూర్చో అని పలికితే 'అటు ఇటు కదలకుండా బండరాయిలా కూర్చో' అనే అర్థం వస్తుంది. రెండు సందర్భాల్లోనూ ఉపయోగించిన పదాలు ఒకటే. వాటిని పలికే తీరులో (ఉచ్చారణలో) చూపించిన భేదం వల్ల వాటి అర్థాల్లో మార్పు వచ్చింది. కాబట్టి, పదాల ఊనిక, విరామం, లయ, గాత్ర వైవిధ్యం అనేవి భాషణాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 3**

1. హిందీ భాషలో వాక్యనిర్మాణ క్రమం

   ఎ) కర్త, క్రియ, కర్మ  బి) కర్త, కర్మ, క్రియ  సి) క్రియ, కర్మ, కర్త  డి) ఏదీకాదు

2. 3-4 సంవత్సరాల వయస్సు కలిగిన బాలలు మాట్లాడిన 10 వాక్యాలు రాయండి. వ్యాకరణ నియమాలతో వాటిని పోల్చండి. మీ పరిశీలనలను రాయండి.

   -----------------------------------------------

   -----------------------------------------------

   -----------------------------------------------

3. ఆంగ్లేతరుడైన వ్యక్తి మాట్లాడిన ఏవైనా ఐదు వాక్యాలు నమోదు చెయ్యండి. అతడు ఏయే సందర్భాల్లో ఉచ్చారణకు ఇబ్బంది పడ్డాడో విశ్లేషించండి. మీ పరిశీలనలను నమోదు చెయ్యండి.

   -----------------------------------------------

   -----------------------------------------------

   -----------------------------------------------

## 4.3 తరగతిలో సంభాషణ - ఆవశ్యకత

భాషను నేర్చుకునే క్రమంలో భాషణం, శ్రవణం మొదటి సోపానాలుగా ఉంటాయి. సంభాషణలో ఈ రెండు అంశాలు ఒకదానితో మరొకటి అనుసంధానమై ఒకే కాలంలో జరుగుతాయి.

సాధారణంగా భాషా తరగతుల్లో ఉపాధ్యాయుడు ఉపన్యాసం చెప్పటం, విద్యార్థులు శ్రద్ధగా వినటం జరుగుతుంది. లేదా, ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం చెప్పటం జరుగుతుంది. ఈ రెండు సందర్భాలను సంభాషణలుగా గుర్తించలేం. ఎందుకంటే, విద్యార్థులు వారి ఆలోచనలను, ఆశయాలను ఉపాధ్యాయుడి నుంచి ఎటువంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం ఉండదు. విద్యార్థులకు స్వేచ్ఛ ఇవ్వటం వల్ల తరగతి గది క్రమశిక్షణ గాడి తప్పుతుందని,

ఫలితంగా సంభాషణల ప్రాధాన్యత పెరిగి అభ్యసన తగ్గుతుందని ఉపాధ్యాయులు భావిస్తారు. ఈవిధమైన దృష్టికోణంతో ఉపాధ్యాయుడు ఉండటం వల్ల విద్యార్థుల అభ్యసనంలో సంభాషణల ప్రాధాన్యతను గుర్తించలేకపోతున్నారు.

ప్రాథమికస్థాయి పిల్లలు వారి ఇంటి భాషలో చాలా తేలికగా, నేర్పుగా సంభాషించే సామర్థ్యాన్ని కలిగిఉంటారు. ఇంటిభాషలోనే వారి అవగాహన కూడా ఎక్కువస్థాయిలో ఉంటుంది. అయితే, పాఠశాలలో చేరగానే ఇంటిభాషకు భిన్నమైన కొత్త భాష అక్కడ వ్యవహార భాషగా ఉండటంతో విద్యార్థులకు సంభాషణ సమస్యలు ఎదురవుతాయి.

పాఠశాలలో చేరగానే అక్కడి కొత్త భాషే వ్యవహరించాలని పిల్లల మీద ఒత్తిడి తీసుకురావటం జరుగుతుంది. ఫలితంగా రెండు భాషలను సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి విద్యార్థులకు ఎదురవుతుంది. మాట్లాడటానికి మరింత ఎక్కువ అవకాశం కల్పించటం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తుంది. పాఠశాలలో చేరిన తొలిరోజుల్లో సహజంగా ఏర్పడే భయం, బిడియం వంటి ఇబ్బందులను కూడా సంభాషణలకు ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా తొలగించవచ్చు. కొత్త వాతావరణానికి సర్దుబాటుకావటం, ఆత్మవిశ్వాసం కలగటం.. ఇవన్నీ సంభాషణల ద్వారానే సాధ్యమవుతాయి. ఈవిధమైన ప్రోత్సాహం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండటంతో పాటు కొత్త భాష నేర్చుకోవాలనే ఉత్సుకత కూడా కలిగిస్తుంది.

సాధారణంగా బాలలు లక్ష్యరహితంగా సంభాషణలు జరుపరు. ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన సంభాషణను గమనించటం ద్వారా ఈ విషయాన్ని మనం గమనించవచ్చు.




Girl – Look this lady is wearing a ring today!

Boy – You hadn't seen it before?

Girl – No…. Yes, yes I had seen it before.

Boy – Oh but this is a different ring!

Girl – The lady has bought a new ring. It is smaller than the previous one.

Boy – No this one is thinner'

సంభాషణలో పాల్గొనటం ద్వారా విద్యార్థులు అనేక అభ్యసన అవకాశాలు పొందుతారు. పైన ఇచ్చిన కార్టూన్ సంభాషణల ద్వారా ఈ విషయాన్ని పరిశీలిద్దాం. బాలుడు చెప్పిన వాక్యాన్ని వినటం ద్వారా బాలిక తాను చెప్పిన వాక్యాన్ని (విషయాన్ని) తిరిగి పరిశీలించింది. చిత్రంలోని

నోట్స్



మహిళ ఇంతకుముందే ఉంగరం ధరించిందన్న విషయం పరిశీలనకు వచ్చింది. ఉంగరాల్లో పెద్ద, చిన్న భేదాలు గుర్తించే అవకాశం ఏర్పడింది.

పిల్లల్లో సంభాషణ నైపుణ్యం పెరగాలంటే వారు చెప్పింది పెద్దలు శ్రద్ధగా వినాలి. వారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. కానీ, చాలామంది పెద్దలు ఈ విషయాన్ని పట్టించుకోరు. పిల్లలకు ఎంత ఎక్కువగా మాట్లాడేందుకు అవకాశం ఇస్తే వారు అంత ఎక్కువగా నేర్చుకుంటారు. పిల్లల సంభాషణల్ని పరిశీలిస్తే, వారు చేస్తున్న విశ్లేషణలు, పరిశీలనలు, భవిష్యత్తును అంచనా వేయటం, తర్కించటం మొదలైన ఎన్నో విశేషాలు కనిపిస్తాయి. ఈ సామర్థ్యాలన్నీ విద్యార్థుల్లో పెరగాలంటే వారికి ఎక్కువగా సంభాషించే అవకాశం ఇవ్వాలి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 4**

1. సంభాషణల్లో భాగంగా ఏకకాలంలో జరిగే ప్రక్రియలేవి?

   ఎ) వినటం, చూడటం　　　బి) చదవటం, వినటం

   సి) వినటం, మాట్లాడటం　　　డి) వినటం, నవ్వటం

2. తరగతిలో విద్యార్థుల సంభాషణ గురించి ఉపాధ్యాయుల భావన ఏమిటి?

   ------------------------------------------------------------

   ------------------------------------------------------------

   ------------------------------------------------------------

3. తరగతిలో సంభాషించేందుకు ఎక్కువ అవకాశాలు కల్పించటానికి ఉపాధ్యాయుడు పోషించవలసిన పాత్ర ఏమిటి?

   ------------------------------------------------------------

   ------------------------------------------------------------

   ------------------------------------------------------------

4. మీ ఇంటి పరిసరాల్లో ఉండే 3-6 సంవత్సరాల వయస్సు కలిగిన బాలల సంభాషణల్ని పరిశీలించండి. మీ పరిశీలనలను నమోదు చెయ్యండి. పైన పేర్కొన్న ప్రక్రియల్లో ఏవి మీ పరిశీలనలోకి వచ్చాయో రాయండి.

   ------------------------------------------------------------

   ------------------------------------------------------------

   ------------------------------------------------------------



నోట్స్

## 4.4 తరగతిగదిలో శ్రవణ, భాషణ నైపుణ్యాభివృద్ధికి తీసుకోదగిన చర్యలు

వేసవి సెలవలు పూర్తికావటంతో పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వానాకాలం కావటంతో ఓ మోస్తరు వాన కురుస్తోంది. దారులన్నీ నీటి గుంటలతో నిండిపోయాయి. పిల్లలు వాటిలోనే తడుచుకుంటూ బడికి వచ్చారు. తరగతులు మొదలయ్యాయి. ఓ తరగతిలో ఉపాధ్యాయుడు పాఠం చెబుతున్నాడు. వెనుకబెంచీలో కూర్చున్న ఇద్దరు విద్యార్థులు పాఠం వినకుండా, ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ, క్షణం తీరికలేనివారిగా ఉన్నారు. ఇది గమనించిన ఉపాధ్యాయుడు వెంటనే పాఠం చెప్పటం ఆపి, వారి దగ్గరకి వెళ్ళాడు. ఏం జరిగింది? ఇంతకీ మీరు దేని గురించి మాట్లాడుకుంటున్నారు? మీరు మాట్లాడుకుంటున్నది ఆసక్తికరమైన అంశమైతే నాకూ చెప్పండి. వింటాను. నాతో పాటు మీ మిత్రులు కూడా వింటారు అంటూ మృదువుగా అడిగాడు.

ఈ హఠాత్పరిణామానికి పిల్లలిద్దరూ బిత్తరపోయారు. మౌనం వహించారు. 'ఏం భయపడకండి. నేనేమీ అనను. మీరేం మాట్లాడుకుంటున్నారో చెప్పండి' అంటూ వారిని ప్రోత్సహించాడు ఉపాధ్యాయుడు.

వారిద్దరిలో ఓ విద్యార్థి నెమ్మదిగా ధైర్యం తెచ్చుకుని, మరే.. మేం ఇంటి నుంచి పాఠశాలకు వచ్చే దారిలో పెద్ద పెద్ద శబ్దాలు చేస్తున్న కప్పల్ని చూసాం మాస్టారు' అంటూ విషయం చెప్పాడు.

అతణ్ణి ఉపాధ్యాయుడు మరింత ప్రోత్సహిస్తూ, 'అలాగా! ఆ తర్వాత ఏం జరిగింది?' అంటూ ప్రశ్నించాడు.

మరే... ఆ కప్పలు చాలా పెద్దగా ఉన్నాయండీ... పెద్దగా శబ్దం చేస్తూ నీటి గుంటల్లోంచి బయటకు, అక్కడ నుంచి మళ్ళీ లోపలికి దూకుతున్నాయి... చెప్పాడు రెండో విద్యార్థి.

ఉపాధ్యాయుడు : అప్పుడేం జరిగింది?

విద్యార్థులు : అప్పుడు... అప్పుడేమో... మేం వాటికి దగ్గరగా వెళ్ళామండీ. అవేమో నీటి గుంటల్లోకి వెళ్ళిపోయాయి.

పిల్లలిద్దరికీ నెమ్మదిగా ధైర్యం వచ్చింది. ఇలా చెబుతున్నందుకు తమని ఉపాధ్యాయుడు కోప్పడరని అర్థమైంది. వారిలో ఒక విద్యార్థి 'మరి... వాన ఆగిపోగానే కప్పలు ఎక్కడి వెళ్ళిపోతాయి మాస్టారు?' అంటూ ప్రశ్నించాడు.

ఉపాధ్యాయుడు కూడా అప్పటిదాకా తాను చెబుతున్న పాఠాన్ని పక్కకు పెట్టి, విద్యార్థుల సందేహం తీర్చటం కోసం వివరాలు చెప్పటం ప్రారంభించాడు. 'మీరందరూ కప్పల్ని చూశారు కదా?' అంటూ మొత్తం తరగతిని ప్రశ్నించాడు ఉపాధ్యాయుడు. కప్పల్ని చూడని వాళ్ళెవరూ ఆ తరగతిలో లేకపోవటంతో, పిల్లలంతా ఒక్కసారిగా 'చూశాం సర్!' అంటూ మొత్తం తరగతి ప్రతిధ్వనించేలా అరిచారు.

ఉపాధ్యాయుడు చెబుతున్న పాఠం ఆపి మరీ కప్పల గురించి చెప్పటం మొదలుపెట్టేసరికి విద్యార్థుల్లో కొద్దిగా అసహనం కలిగింది. వారిలో ఓ తుంటరి విద్యార్థి 'వాన పడేటప్పుడు కప్పలు టుర్...టుర్... అంటూ శబ్దం చేస్తాయండీ' అన్నాడు.

నోట్స్

మరో విద్యార్థి లేచి, 'మరే.. మాస్టారండీ... మా పెరడు తవ్వుతున్నప్పుడు అందులోంచి కప్పలు బయటకు వచ్చాయండీ' అన్నాడు.

'కప్పలు పురుగుల్ని తింటున్నప్పుడు నేను చూసానండీ' మరో విద్యార్థిని చెప్పింది.

'మెట్ల అడుగునుంచి కప్పలు బయటకు రావటం నేను చాలాసార్లు చూశానండి' మరో విద్యార్థి ఉత్సాహంగా చెప్పాడు.

క్రమంగా తరగతి మొత్తం కప్పల లోకంగా మారిపోయింది. కొంతమంది విద్యార్థులు కప్పల్లాగా టుర్...టుర్... అంటూ శబ్దాలు చేయటం ప్రారంభించారు. మరికొంతమంది కప్పల్లాగా గెంతటం మొదలుపెట్టారు.

ఉపాధ్యాయుడు ఏమాత్రం సహనం కోల్పోకుండా అన్నిటినీ గమనిస్తున్నాడు. విద్యార్థులు మాట్లాడుకుంటున్న మాటలు, చేస్తున్న పనులన్నింటినీ అతడు నిశితంగా పరిశీలిస్తునే ఉన్నాడు. మధ్యమధ్యలో 'ఏయ్...! గొడవ చెయ్యద్దు' అంటూ విద్యార్థుల్ని మందలిస్తూనే ఉన్నాడు. చిన్నచిన్న ప్రశ్నలు వేస్తూ, వారితో అనేక విషయాలు చెప్పిస్తున్నాడు. సమయం గడుస్తోంది.

కొద్దిసేపు గడిచాక, 'అందరూ వినండి... మీ చుట్టుపక్కల ఉన్న కప్పల్ని జాగ్రత్తగా గమనించండి. వర్షం తగ్గాక అవి ఎక్కడికి వెళ్తాయో గమనించండి' అంటూ విద్యార్థులకు సూచన చేశాడు ఉపాధ్యాయుడు.

మరికొద్దిసేపు సంభాషణలు గడిచాక, ఉపాధ్యాయుడు 'ఇప్పుడు మీరందరూ కప్పల గురించి మీకు తెలిసిన ఐదు వాక్యాలు రాయండి' అంటూ చిన్న పరీక్ష పెట్టాడు.

పైన చెప్పిన మొత్తం సంభాషణలో ఉపాధ్యాయుడు తన విద్యార్థులతో మాట్లాడటం, విద్యార్థులకు మాట్లాడే అవకాశం కల్పించటం ద్వారా కప్పల గురించి అనేక విషయాలను విద్యార్థులతో చెప్పించాడు. కప్పల ఆకారం, అవి చేసే శబ్దాలు, వాటి పరిమాణం, ఆహారపుటలవాట్లు, రంగు, స్వభావం వంటి ఎన్నో విషయాలు చర్చించాడు.

ఈవిధంగా ఉపాధ్యాయుడు చొరవ తీసుకుని తరగతిలో విద్యార్థులు మాట్లాడేందుకు అవకాశాలు కల్పిస్తే, విద్యార్థులు తమ అనుభవాల ఆధారంగా ఎన్నో విషయాలను ఎంతో నేర్పుగా, విశ్లేషణాత్మకంగా సంభాషణ రూపంలో వివరిస్తారు. క్రమంగా వారిలో మాట్లాడే (సంభాషణ) సామర్థ్యం పెరుగుతుంది. వివిధ విషయాల గురించి మరింత ఎక్కువ అవగాహన పొందే అవకాశం కలుగుతుంది. ఇలా సంభాషణలు జరిపేందుకు ప్రత్యేక సమయం కోసం ఉపాధ్యాయులు ఎదురుచూడాల్సిన పని లేదు.

తరగతిలో లేదా పాఠశాల పరిసరాల్లో ఉండే పూలు, మొక్కలు, కాలువలు, తూనీగలు, తుమ్మెదల వంటి పక్షులు, కీటకాలు, తోటలు, మట్టి, పాఠశాల గేటు... ఇలా పాఠశాల పరిసరాల్లో ఉండే అనేక వస్తువులను దగ్గరగా చూడటం, వాటి గురించి విద్యార్థులతో మాట్లాడించటం ద్వారా ఉపాధ్యాయుడు విద్యార్థులకు మాట్లాడే అవకాశాన్ని కల్పించవచ్చు. వీటన్నిటినీ చాలా దగ్గరగా చూసే అవకాశం



నోట్స్

ఉండటం వల్ల విద్యార్థులు కూడా ఆయా వస్తువులు, పక్షులు, జంతువులు, పదార్థాల గురించి చాలా సునాయాసంగా మాట్లాడగలుగుతారు.

పైన చెప్పుకున్న ఉదాహరణలో ఉపాధ్యాయుడు విద్యార్థులు మాట్లాడేందుకు అనేక అవకాశాలు కల్పించాడు. అందుకోసం వారిని ప్రోత్సహించాడు కూడా. నిజంగా ఉపాధ్యాయుడే కనుక విద్యార్థుల్ని ప్రోత్సహించకపోతే, తరగతిలో ఉత్సాహపూరిత వాతావరణంలో సంభాషణలు జరిపే అవకాశం ఏర్పడదు. కాబట్టి, ఉపాధ్యాయుడు ఎల్లప్పుడూ విద్యార్థులకు వీలైనంత ఎక్కువగా సంభాషించే అవకాశం కల్పించారు.

విద్యార్థుల దైనందిన జీవితానుభవాలను చెప్పిస్తూ, అభ్యసనాన్ని తక్షణ కృత్యంగా, నేర్చుకుంటున్నామన్న భావన విద్యార్థులకు తెలియకుండానే అభ్యజరిగేట్లు చూడాలి. అత్యంత సహజ పరిస్థితుల్లో అభ్యసన జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయుడి మీదనే ఉంటుంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి – 5

1. సంభాషణ చేసే అవకాశం పిల్లలకు ఇవ్వటం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?

   ఎ) తమ అనుభవాలు, ఆలోచనలను వ్యక్తీకరించే సామర్థ్యం పెరుగుతుంది

   బి) పదాలు నేర్చుకుంటారు

   సి) పదాలకు క్రమబద్ధంగా, లయానుగుణంగా పలకటం నేర్చుకుంటారు

   డి) చదవటం నేర్చుకుంటారు.

2. విద్యార్థులకు మాట్లాడే అవకాశం కల్పించటం ఉపాధ్యాయుడిపరంగా ఎందుకు అవసరం?

   ____________________________________________

   ____________________________________________

   ____________________________________________

3. తరగతిలో విద్యార్థులకు సంభాషణ నైపుణ్యాలు నేర్పించే విషయంలో ఉపాధ్యాయుడిగా నీవు పోషించే పాత్ర ఏమిటి?

   ____________________________________________

   ____________________________________________

   ____________________________________________

4. తరగతిగదిలో బోధన జరుగుతున్నప్పుడు ఎలాంటి వాతావరణం ఉండాలి? ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటి?

   ____________________________________________

   ____________________________________________

   ____________________________________________

నోట్స్

## 4.4.1 బాలగేయాలు పాడటం, వినటం

నా కాళ్ళ గజ్జెలు...

నా కాళ్ళ గజ్జెలు – మోకాళ్ళ చిప్పలు
అబ్బబ్బ నడుము – అద్దాల రవికె
ముత్యాల హారం – కస్తూరి తిలకం
బింద మీద బిందె – బిందెలోన పెరుగు
పెరుగమ్మ పెరుగు – తిరుగమ్మ తిరుగు

చందమామ రావె...

చందమామ రావె – జాబిల్లి రావె
కొండెక్కి రావె – గోగుపూలు తేవె
బండెక్కి రావె – బంతిపూలు తేవె
తేరు మీద రావె – తేనెపట్టు తేవె
పల్లకిలో రావె – పాలు పెరుగు తేవె
ఆడుకుంటూ రావె – అరటిపండు తేవె
అన్నిటిని తేవె – మా అబ్బాయికియ్యవే

ఇలాంటి చిట్టిచిట్టి పాటలు పాడుకుంటూ, వారిలో వారే ఆడుకోవటం లేదా తోటి పిల్లలతో ఆడుకోవటం చేస్తుంటారు బుజ్జిపాపాయిలు. సాధారణంగా మనం ఇలాంటి సన్నివేశాలు చాలా చూస్తూనే ఉంటాం. ఇలా పాడుతున్నప్పుడు పెద్దలు తమని కోప్పడతారని గాని శిక్షిస్తారని గాని పిల్లలు ఏమాత్రం అనుకోరు. బాలగేయాల్లో ఉండే లయ, తూగు వారిని ఎంతో ఆకట్టుకుంటుంది. వాటిని ఎంతో తాదాత్మ్యం చెందుతూ, అనుభూతిని ఆస్వాదిస్తూ వాళ్ళు పాడుకుంటూ ఉంటారు. చిట్టిపొట్టి గేయాలంటే బాలలకు ఎంతో ఇష్టం.

ఒక్కోసారి పిల్లలు లయానుగుణంగా పదాలు ఉపయోగించి మాట్లాడతారు. వాక్యంలోని చివరి పదాన్ని, తర్వాతి వాక్యం మొదటిపదంగా మార్చి (అలంకారశాస్త్రంలో దీన్ని ముక్తపదగ్రస్తం అంటారు. ఈవిషయం బాలలకు తెలియదు) ఎంతో ముద్దుగొలిపేలా మాట్లాడుతుంటారు. వారికి ఇదొక ఆట. ఎంతో ఆస్వాదిస్తూ ఈ ఆటని వారు ఆడుతుంటారు. ఇలా, పదాలతో ఆడటం.. అంటే పదక్రీడల వల్ల బాలల్లో సృజనాత్మకశక్తి పెరుగుతుంది. వారిలో నూతనోత్తేజం కలుగుతుంది. ఇలాంటి గేయాలకు ఒక ఉదాహరణ చూద్దాం.

చిలుకలుగాని చిలకల్లారా...

చిలుకలుగాని చిలకల్లారా సీతాకోక చిలకల్లారా
రంగురంగులా రెక్కలతో సింగారాలు చిందేరా?
వన్నెల వన్నెల పూల మీద వాలుచున్నారా?
కన్నుల కన్నుల పండుగ చేస్తూ కదులుతున్నారా?
వనమంతా – దినమంతా వసంతశోభలతో
అందాల ఆనందాల ఆటలాడేరా
చిలుకలు గాని చిలకల్లారా సీతాకోక చిలుకల్లారా

ఈ తరహా పాటలు పాడేటప్పుడు పిల్లలు అప్పటికప్పుడు కొత్త కొత్త పదాలు గేయ పంక్తులకు కలపటం, తీసేయటం చేస్తుంటారు. అయితే, ఇలా చేయటం వల్ల గేయంలో ఉండే లయ, తూగు తగ్గకుండా చూస్తారు.

గేయం అనేది మనల్ని మనం వ్యక్తపరచుకునేందుకు, మన జీవితావసరాలను ప్రకటించేందుకు అవకాశం కల్పించే ఒక ప్రభావవంతమైన మాధ్యమం. బాలగేయాల్ని ఎక్కువగా వినటం వల్ల బాలలకు భాషకు సంబంధించిన ప్రాథమిక నిర్మాణం పట్ల అవగాహన కలుగుతుంది. ఏదైనా ఒక గేయం విన్నప్పుడు లేదా గేయంలోని లయకు అనుగుణంగా ఆడుతున్నప్పుడు ఏదైనా ఒక కొత్త పదం ఆ గేయంలో వచ్చినప్పటికీ వెంటనే పిల్లలు ఆ పదానికి సంబంధించిన అర్థాన్ని ఊహించగలుగుతారు. అదేసందర్భంలో ఆ గేయం లేదా పదం వారికొక సరికొత్త అనుభూతి కూడా కలిగిస్తుంది. ఒకే గేయాన్ని ఇద్దరు బాలలు వేర్వేరు సందర్భాల్లో విన్నప్పుడు ఇందాక చెప్పుకున్నట్లు వచ్చే కొత్తపదాలకు వారి పూర్వజ్ఞానం (అనుభవం) ఆధారంగా వారిద్దరూ వేర్వేరు అర్థాలు గ్రహిస్తారు.

ఇన్ని ప్రయోజనాలు ఉన్న బాలగేయాల్ని తరగతిలో పాడేందుకు తగిన అవకాశం కల్పించి, బాలల్లో సృజనాత్మక శక్తుల్ని వృద్ధిచెందించేందుకు ఉపాధ్యాయులు పూర్తి బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే, బాలలు తమ అనుభవాలు, ఆలోచనల్ని పంచుకునేందుకు బాలగేయాల్ని ఒక వేదికగా మలచుకునేందుకు కూడా ఉపాధ్యాయులు వీలుకల్పించాలి.

## మీ ప్రగతిని పరీక్షించుకోండి – 6

1. నిరంతరం గేయాలు వినటం వల్ల విద్యార్థులు దేని గురించిన అవగాహన పొందుతారు?

   ఎ) పదాలు    బి) ధ్వని    సి) లయ

   డి) భాషకు సంబంధించిన ప్రాథమిక నిర్మాణం

2. మూడో తరగతి పిల్లలకు 'బడాయి పిల్లి' గేయం వినిపించండి. ఏవైనా కొత్త పదాలు లేదా వాక్యాలను ఈ గేయానికి కలపమని వారికి చెప్పండి. ఆ వాక్యాల్ని పిల్లలు ఎందుకు కలిపారో అడిగి తెలుసుకోండి. మీరు స్వయంగా విశ్లేషణ చేయండి. ఫలితాలు నమోదు చేయండి.

బడాయి పిల్లి...

బడాయి పిల్లి లడాయి కెళ్ళి
మిడతను చంపి ఉడుత అన్నది
ఉడుతను చంపి ఉడుం అన్నది
ఎలుకను చంపి ఏనుగు అన్నది
సింహం తానని పొంగిన పిల్లి
కుక్కను చూసి ఒకటే పరుగు

3. గేయాల ద్వారా విద్యార్థులకు కల్పించబడే భాషాభ్యసన అవకాశాలు ఏవి?

-----------------------------------------------------

-----------------------------------------------------

-----------------------------------------------------

## 4.4.2 చిత్రాల ద్వారా చర్చించటం (వర్ణించటం)

ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థుల వరకు సంభాషణ, చర్చా నైపుణ్యాలు పెంచేందుకు 'చిత్రం' (పటం లేదా బొమ్మ) ఒక ఉత్తమమైన మార్గం. ఇందుకోసం చిత్రం ఉపాధ్యాయుడికి పుష్కలంగా అవకాశాలు కల్పిస్తుంది. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు బొమ్మలంటే మహాఇష్టంగా ఉంటుంది. బొమ్మలు గీయటం అన్నా, బొమ్మలు చూడటం అన్నా వారిలో ఆసక్తి మెండుగా ఉంటుంది. ఏ పుస్తకమైనా సరే, అందులోని విషయంతో సంబంధం లేకుండా పిల్లల్ని ఆకర్షించేవి కేవలం బొమ్మలు మాత్రమే. పిల్లలతో బొమ్మల గురించి మాట్లాడటం మహా సరదాగా ఉంటుంది. వారు కూడా బొమ్మలు (చిత్రాలు) గురించి మాట్లాడమంటే చాలా ఉత్సాహంగా మాట్లాడతారు. పిల్లలు బొమ్మల్ని అతి శ్రద్ధగా పరిశీలిస్తారు. ఇలా చూడటం వల్ల ఆయా చిత్రాల గురించి మాట్లాడటానికి చాలా విషయాలు కూడా గ్రహిస్తారు. నిజానికి ఈ విషయాలు పెద్దల ఊహలకు కూడా అందవు.

ఏదైనా ఒక చిత్రం గురించి మూడో తరగతి విద్యార్థితో చర్చిస్తున్నాం అనుకుందాం. ఆ చిత్రానికి లేదా ఆ చిత్రంలోని వస్తువులకు పేరు పెట్టటం (గుర్తించటం), దైనందిన జీవిత సన్నివేశాలు లేదా తమ పూర్వ అనుభవాలతో చిత్రంలోని సన్నివేశాన్ని పోల్చటం, చిత్రం గురించి తార్కిక వాదన చేయటం...ఇవన్నీ ఆ విద్యార్థిలో మనం గమనించవచ్చు. ఏదో ఒక విద్యార్థిలో మాత్రమే కాదు...

బాలలందరిలో ఈ నైపుణ్యం (లక్షణం) ఉంటుంది. అయితే, ప్రతి ఒక్కరిలో ఈ లక్షణం విభిన్నంగా, వైవిధ్యభరితంగా ఉంటుంది. ఇందుకు కొన్ని ఉదాహరణలు చూద్దాం.

1. ఆవుతో మనిషి మాట్లాడుతున్నాడు. / ఎద్దును మనిషి కొయ్యకు కడుతున్నాడు. / గొడ్ల సావిట్లోకి ఓ మనిషి వచ్చాడు.

2. ఒక బాలిక చెట్టు ఎక్కుతోంది. చెట్టు చాలా పెద్దగా ఉందని చెబుతూ ఓ బాలుడు ఆమె చెట్టు ఎక్కకుండా ఆపుతున్నాడు. ఇందుకామె చాలా బాధపడింది. / చెట్టు కొమ్మల మీద ఆ బాలిక నాట్యం చేస్తోంది. / ఆ చెట్టు ఊగుతోంది. / అక్కడి చెట్లలో చాలా వరకు కొండంత ఎత్తు ఎదిగాయి.

3. సూర్యుడు పొద్దున్నే ఉదయిస్తున్నాడు. పక్షులు కూడా ఉషోదయపు వేళ ఎగురుతున్నాయి. / సూర్యుడు బయటకు వస్తున్నాడు. / ఇది సాయంత్రం వేళ / సూర్యుడు అస్తమిస్తున్నాడు.

4. భార్య ఇంటికి తిరిగివస్తోంది / ఆ మహిళ నీరు తీసుకువస్తోంది.

ఈ ఉదాహరణలన్నీ పరిశీలిస్తే మనకు ఒక విషయం అర్థమవుతుంది... ఒకే చిత్రాన్ని చూసిన వేర్వేరు విద్యార్థులు ఆ చిత్రం గురించి వేర్వేరుగా సంభాషిస్తారనే విషయం పై ఉదాహరణల ద్వారా స్పష్టమవుతుంది. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచటానికి చిత్రాలు అద్భుతమైన పునాదులు వేస్తాయి. అంతేకాదు.. వారిలో విశ్లేషణ సామర్థ్యాన్ని కూడా ఇవి పెంచుతాయి. ఇక్కడ చిత్రాలంటే ఏమైనా కావచ్చు. ముద్రితమైనవి, టికెట్ల వెనకాల ఉండేవి, దినపత్రికల్లో వచ్చేవి, వ్యాపార ప్రకనటల్లో వచ్చే చిత్రాలు, కాలెండర్ వెనుక ఉండే చిత్రాలు... ఇలా చిత్రం ఏదైనప్పటికీ, ఎక్కడిదైనప్పటికీ విద్యార్థులు వాటిని ఆసక్తిగా పరిశీలిస్తారు. వాటిగురించి చక్కటి సంభాషణ చేస్తారు. ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థుల్లో కూడా చిత్రాలను ఉపయోగించి సంభాషణ నైపుణ్యాలను పెంచవచ్చు.

తరగతిలో విద్యార్థులతో పాటు కూర్చుని, వారిని చిత్రాలు చూడనివ్వాలి. చిత్రాలను పరిశీలించిన తర్వాత స్వేచ్ఛగా వారి ఆలోచనలు వ్యక్తీకరించేందుకు అవకాశం ఇవ్వాలి. దీనివల్ల వారిలో సంకోచం, అనవసర భయాందోళనలు తొలగిపోతాయి. భావ వ్యక్తీకరణ తేలికగా చేస్తారు. ఒకవేళ చిత్రంలో ఉన్న ఏదైనా వస్తువు లేదా సన్నివేశాన్ని విద్యార్థి గమనించలేకపోతే, దాన్ని గమనించేలా ఉపాధ్యాయుడు తగిన సూచనలు ఇవ్వాలి. ఈ సూచనలు ప్రశ్నల రూపంలో ఉండాలి. ఇలా చెయ్యటం వల్ల విద్యార్థుల్లో సంక్లిష్టమైన పరిశీలనాశక్తిని పెంపొందించవచ్చు. చిత్రాలు చూసి వ్యాఖ్యానించే సందర్భంలో విద్యార్థుల్ని ప్రశ్నించటం ద్వారా వారిలో నైపుణ్యాలను వృద్ధి చేసుకునే అవకాశాలు కల్పించాలి. ఈ సందర్భంలో (విద్యార్థులను ప్రశ్నించేటప్పుడు) ఉపాధ్యాయుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నలు విద్యార్థుల్లో ఆలోచనలు పెంచేవిగా, పరిశీలనాశక్తి, తార్కిక శక్తి, ఊహాత్మక సామర్థ్యం, దైనందిన అనుభవాలతో చిత్రంలోని సన్నివేశాలను సమన్వయపరిచే సామర్థ్యం మొదలైనవాటిని వృద్ధి చేసేవిగా ఉండాలి. ఉదాహరణకు కొన్ని ప్రశ్నల్ని పరిశీలిద్దాం.

నోట్స్

- చెట్టుకింద ఏమేమి ఉన్నాయి?
- బావి పక్కన నిల్చున్న బాలిక ఎందుకు ఏడుస్తోంది?
- ఊరబావి పక్కన నిల్చొన్న మహిళలు ఏం మాట్లాడుకుంటున్నారు?
- ఇంటికి వెళ్ళగానే మహిళలు ఏం చేస్తారు?
- నీవు ఎప్పుడైనా ఏదైనా గ్రామానికి వెళ్ళావా? వెళ్ళినట్లయితే, అక్కడ ఏమేమి పరిశీలించావు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 7**

1. విద్యార్థులకు చిత్రాన్ని చూపించి, చెట్టు కింద ఏమేమి ఉన్నాయని ప్రశ్నించటం విద్యార్థుల్లో ఏం కలుగజేస్తుంది?

ఎ) కారణాన్ని అన్వేషించే సామర్థ్యం　　బి) బహిర్గత పరచే సామర్థ్యం

సి) ఊహించే సామర్థ్యం　　డి) సంబంధాలను ఏర్పరచే సామర్థ్యం




2. పై చిత్రం ఆధారంగా, విద్యార్థులతో ఏమేమి చర్చించవచ్చు? ప్రశ్నలు తయారుచేయండి. మూడో తరగతి విద్యార్థులతో ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పించండి. మీ పరిశీలనలు రాయండి.

---------------------------------------------------

---------------------------------------------------

---------------------------------------------------

## 4.4.3 కథ చెప్పటం / వినటం

ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందింపజేయటానికి ఉత్తమమైన మార్గాల్లో కథలు చెప్పటం / వినటం ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. కథలు వినటానికి బాలలు ఎంతో ఆసక్తి కనబరుస్తారు. వారిలోని సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేయటానికి ఇదొక చక్కని మార్గం.

కథల విషయంలో బాలలు కొన్ని ప్రత్యేక ప్రవర్తనలు ప్రకటిస్తారు. వారు విన్న కథల్ని మరొకరికి చెప్పే సందర్భంలో తమ సృజనాత్మకతను అందుకు జోడించి, తమ అనుభవాలను మిళితం చేసి, కథకు కొత్తదనాన్ని తీసుకువస్తారు. కేవలం పదాలకు అర్థాన్ని తెలుసుకోవటం, అవసరమైన సందర్భాల్లో వాటిని ప్రకటించటం మాత్రమే కాకుండా, వారి ఊహలను వాస్తవరూపంలోకి తీసుకురావటానికి కథల్ని ఒక మార్గంగా వినియోగించుకుంటారు. పిల్లల్లో అంచనా వేయగలిగే సామర్థ్యాన్ని కూడా కథలు వృద్ధి చేస్తాయి.

సాధారణంగా బాలలు కథలు వినేటప్పుడు ఆ కథలో తర్వాత ఏం జరుగుతుందో అనే ఆసక్తి కనబరుస్తారు. వారి ఆలోచనలు, భావనలకు అనుగుణంగా తర్వాత జరిగే కథను కూడా వారు ఊహిస్తారు. ఒకవేళ నిజంగా వారు అనుకున్న మలుపులు కథలో జరిగితే, వారు మరింత ఆత్మస్థైర్యాన్ని పొంది, మరింత ఎక్కువగా ఊహాత్మక కల్పనలు చేస్తారు. బయటకు కేవలం కథను ఊహించటంగా కనిపించినప్పటికీ, పిల్లల్లో ఉన్న 'అంచనా వేయగలిగిన' సామర్థ్యం వారి భవిష్యత్తు జీవితానికి పునాది వేస్తుంది. సింహం – కుందేలు కథ విన్న బాలలు వారి భవిష్యత్తు జీవనంలో ఎదురయ్యే సమస్యలను వివేకంతో ఎదుర్కొనే నైపుణ్యాన్ని పెంచుకుంటారు. లేదా, వివేకంతో కష్టాలను ఎదుర్కోవాలనే నీతిని గ్రహిస్తారు.

పెద్దలు కూడా సాధారణంగా కథలు చెప్పేటప్పుడు తమ జీవితానుభవాలను మిళితం చేసి చెబుతుంటారు. ఒక్కోసారి, చెబుతున్న కథలోని సందర్భం ప్రధానమైనదిగా కథకుడు భావిస్తే, ఆ సందర్భాన్ని మరింత ప్రభావవంతంగా చెబుతాడు. వాస్తవ సంఘటనలు, పాత్రలను కథలో చొప్పించటం ద్వారా కథా సందర్భాన్ని శ్రోతకు మరింత ఆసక్తి కలిగేలా తీర్చిదిద్దటం జరుగుతుంది. కథకుడు ఉపయోగించే కథన నైపుణ్యం మీద శ్రోతకు కలిగే ఆసక్తి స్థాయి ఆధారపడి ఉంటుంది. ఒక్కోసారి కథలో కొత్త పదాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లో బాలలు కథకుడి ముఖకవళికలను పరిశీలించటం, జరుగుతున్న కథను అవగాహన చేసుకోవటం ద్వారా కొత్త పదాలకు అర్థాన్ని గ్రహిస్తారు. వీటన్నిటిద్వారా విద్యార్థులు పదసంపద వృద్ధి చేసుకోవటంతో పాటు శ్రవణం నైపుణ్యాన్ని కూడా పెంచుకుంటారు. వారిలో అవగాహన సామర్థ్యం కూడా వృద్ధి చెందుతుంది.

సాధారణంగా ఒక కథ విన్న తర్వాత ఆ కథ గురించి చర్చించటం కొద్దిగా కష్టంగా ఉంటుంది. కానీ, ఉపాధ్యాయుడు హృదయపూర్వకంగా కథా సన్నివేశాన్ని చర్చించాలనుకుంటే, ఆ లక్ష్యాన్ని సాధించటం తేలిక అవటంతో పాటు నిర్ణయించుకున్న విద్యాలక్ష్యాల సాధన కూడా తేలిక అవుతుంది. సాధారణంగా, తరగతిలో కథ చెప్పగానే అందుకు సంబంధించిన ప్రశ్నలు అడగటం తమ హక్కుగా, అదొక విధానంగా ఉపాధ్యాయులు భావిస్తారు. కానీ, ఇందుకు భిన్నంగా ఉపాధ్యాయులు ఆ కథ గురించి విద్యార్థులతో చర్చింపజేస్తే, మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. విద్యార్థుల్లో సంభాషణ నైపుణ్యాలను పెంచాల్సిన నేపథ్యంలో ప్రశ్నలు అడగటం సరైన పద్ధతికాదు.

విద్యార్థులకు కథ చెప్పటం ఎంత ముఖ్యమో విద్యార్థులు చెప్పే కథలు వినటం కూడా అంతే ముఖ్యం. తమను తాము ఆవిష్కరించుకునేందుకు విద్యార్థులకు లభించిన చక్కటి అవకాశంగా ఇది

నోట్స్

సహకరిస్తుంది. ఉపాధ్యాయుడు చెప్పిన కథనే తిరిగి చెప్పించటం కన్నా విద్యార్థుల ఆలోచనలు ప్రతిఫలించేలా వారితో కొత్త కథ చెప్పించటం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. తాము చెప్పే కథలోని పాత్రల్లో తమ అనుభవాలు, అనుభూతులు, ఆలోచనలతో పాటు తమ వ్యక్తిత్వాన్ని కూడా విద్యార్థులు ఆవిష్కరిస్తారు. తరగతిలోని ప్రతి విద్యార్థికీ ఈవిధంగా కథలు చెప్పే అవకాశాన్ని ఉపాధ్యాయుడు కల్పించాలి. ఇందుకోసం వారికి తగిన స్వేచ్ఛనివ్వాలి. ఊహాత్మక కథలకు సైతం ఉపాధ్యాయుడు స్థానం కల్పించాలి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 8**

1. పిల్లలకు కథలు చెప్పటంతో పాటు చెయ్యాల్సిన పని ఏమిటి?

   ఎ) పిల్లలు కథ చదివేలా చూడాలి　　బి) వారు కథను గుర్తుపెట్టుకునేలా చూడాలి

   సి) పిల్లల చేత కథను కంఠస్తం చేయించాలి　　డి) వారు చెప్పిన కథలు వినాలి

2. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులతో మాట్లాడి, వారు ఏ తరహా కథలంటే ఇష్టపడతారో అడిగి తెలుసుకోండి. ఈ పేర్లను నల్లబల్ల మీద రాయండి. వీటి ఆధారంగా కథలు తయారుచేయమని పిల్లలను ప్రోత్సహించండి. మీ పరిశీలనలు రాయండి.

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

3. తరగతిలో విద్యార్థులు ఒక్కక్కరితో ఒక్కక్క వాక్యాన్ని చెప్పిస్తూ ఓ కథను తయారుచేయండి. ఈ సందర్భంలో విద్యార్థులు చెప్పే ప్రతి వాక్యాన్ని నల్లబల్ల మీద రాయండి. కథ పూర్తయిన తర్వాత కింద ఇచ్చిన సూచనల ఆధారంగా పరిశీలన చేయండి. ఫలితాలను నమోదు చెయ్యండి.

   ఎ) కథ ఏయే పదాల మీద ఎక్కువగా ఆధారపడింది?

   బి) పిల్లలు తయారుచేయదలచుకున్న కథ ఏమిటి?

   సి) ఈ కృత్యలో ఉపాధ్యాయుడిగా మీ పాత్ర ఏమిటి?

   డి) ఈ కృత్యంలో మీరు ఎదుర్కొన్న ఇబ్బందులేవి?

## 4.4.4 నాటకం / రంగస్థలం / ప్రదర్శనల ద్వారా భాషాభివృద్ధి

నాటకం బాలలకు బాగా పరిచితమైన ప్రక్రియ. అదేమీ వారికి కొత్త విషయం కాదు. వాళ్ళు అమ్మా - నాన్న, బొమ్మలపెళ్ళి, టీచర్ స్టూడెంట్ మొదలైన ఆటలు ఆడుతూ, కార్టూన్ ధారావాహికల్లో వచ్చే పాత్రలను అనుకరించటం మనం గమనిస్తూనే ఉంటాం. అలాగే, ఆటలు

ఆడేటప్పుడు, ఇతర సందర్భాల్లో పిల్లలు ఒకరో ఒకరిని అనుకరించటం కూడా గమనించవచ్చు. ఇవన్నీ సర్వసాధారణంగా జరిగేవే. ప్రతి విద్యార్థిలో పుట్టుకతోనే సహజంగా నాటకీకరణ సామర్థ్యం ఉంటుంది. అయితే, వీటిల్ని తరగతిగదిలో ప్రదర్శించేందుకు సరైన అవకాశాలు లభించవు. నాటకాలు, ప్రదర్శనలు మొదలైనవి కేవలం పాఠశాల వార్షికోత్సవంలో లేదా ఎవరైనా ప్రముఖులు పాఠశాలను సందర్శించిన సందర్భంలో మాత్రమే చేసే ప్రదర్శనలనే భావన ఉపాధ్యాయుల్లో బలంగా నాటుకొని ఉండటమే ఇందుకు కారణం. చాలా వరకు అటువంటి సందర్భాల్లో కూడా ప్రదర్శించే నాటకానికి సంబంధించిన సంభాషణల్ని ఉపాధ్యాయులే రాసి, విద్యార్థులకు తర్ఫీదు ఇస్తారు. దీనివల్ల అసలు ప్రదర్శన సమయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతాయి.

రోజూవారీ తరగతి కృత్యంగా లేదా తరగతి కృత్యాల్లో ఒక భాగంగా 'నటన'ను తీసుకోవటం ఒక విభిన్నమైన అంశం. పైన చెప్పిన సంఘటనలేవీ ఇందులోకి చేరవు. విద్యార్థులకు భాష నేర్పించటానికి నాటకాన్ని ఉత్తమ సాధనంగా స్వీకరించవచ్చు. అయితే, స్వేచ్ఛ, ఆనందం అనే రెండు సూత్రాలు మాత్రం ఇందులో తప్పనిసరిగా ఉండితీరాలి. తరగతిలో నాటకాన్ని ప్రదర్శించటానికి ఉపాధ్యాయుడు లేదా విద్యార్థులు ప్రత్యేకంగా సాధన చెయ్యాల్సిన అవసరం ఉండదు. ఏరకమైన ఏర్పాట్లు కూడా అవసరం ఉండవు.

విద్యార్థులు వారి భావాలు, ఆలోచనల్ని స్వేచ్ఛగా ప్రకటిస్తే సరిపోతుందనే భావన, అందుకు తగిన ప్రోత్సాహాన్ని ఉపాధ్యాయుడు అందిస్తే సరిపోతుంది. విద్యార్థులు సాధారణంగా చూసే సన్నివేశం లేదా కార్టూన్ లేదా కథా సన్నివేశాన్ని ప్రాథమికస్థాయి విద్యార్థులకు నాటక ప్రదర్శనకు స్వీకరించవచ్చు. పెంపుడు జంతువుల ఆకారం, వాటి రంగు, వాటి ప్రవర్తన మొదలైన అంశాలు తీసుకుని కూడా నాటక ప్రదర్శన చెయ్యొచ్చు.

ప్రాథమికోన్నత స్థాయికి వచ్చేసరికి చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి నాటకాలు ప్రదర్శించేలా విద్యార్థుల్ని ఉపాధ్యాయుడు ప్రోత్సహించాలి. ఈ దశలో బాలలే సంభాషణలు రాసుకునేలా వారిని ప్రోత్సహించాలి. సనాతన అంశాలు మాత్రమే కాకుండా కొన్ని జానపద తరహా ఇతివృత్తాలు కూడా తీసుకుని, వాటికి తమ సృజనాత్మకతను జోడించి, రసవత్తరంగా ఉండే సన్నివేశాలను తయారుచేసేందుకు తగిన స్వేచ్ఛ, మార్గదర్శకత్వాన్ని ఉపాధ్యాయుడు పిల్లలకు ఇవ్వాలి. మొత్తంగా బాలలకు ఒక సాంస్కృతిక వాతావరణాన్ని పరిచయం చెయ్యాలి.

## 4.4.5 సహపాఠ్య కార్యక్రమాలు

విద్యార్థుల్లో శ్రవణం, భాషణ నైపుణ్యాలను పెంచేందుకు పాఠ్యకృత్యాలతో పాటు మరికొన్ని ఆదనపు కృత్యాలను కూడా ఉపాధ్యాయుడు నిర్వహించాల్సి ఉంటుంది. విద్యార్థుల్లోని ఆలోచనలు ప్రతిబింబించేలా, వారి సృజనాత్మకతకు పెద్దపీట వేసేలా, వారి భావాలను పంచుకునే అవకాశం కల్పించేలా ఉండే కృత్యాలను పాఠశాల స్థాయిలో తప్పనిసరిగా నిర్వహించాలి. ఇది చాలా అవసరం కూడా.

నోట్స్

ఏదైనా ఇచ్చిన అంశం మీద అప్పటికప్పుడు మాట్లాడే అవకాశం కల్పించే కృత్యాలను కూడా తరగతిలో తప్పనిసరిగా నిర్వహించాలి. వీటివల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. 'నాకు అల్లాఉద్దీన్ దీపం దొరికితే', 'నేను ఇంద్రజాలికుణ్ణి అయితే' వంటి ఉత్సాహం కలిగించే శీర్షికలు ఎంపికచేసుకుని, వాటిని నిర్వహించటం ద్వారా విద్యార్థులకు శ్రవణ, భాషణ నైపుణ్యాల సాధనను ఒక ఆటగా మలచవచ్చు.

రెండవ కృత్యంగా వక్తృత్వం / చర్చను ఎంపిక చేసుకోవచ్చు. వక్తృత్వం అంటే ఏదో ఒక ఎంపిక చేసిన అంశం మీద మాట్లాడటం. చర్చ ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఎంపిక చేసిన అంశానికి అనుకూలంగా, ప్రతికూలంగా – రెండు కోణాల్లోను మాట్లాడాల్సి ఉంటుంది. చర్చ చేసే సందర్భంలో వక్త తను ప్రతివాదులతో పాటు ప్రేక్షకులను కూడా ఆనందింపచేయాల్సి ఉంటుంది. 'పారిశ్రామికీకరణ : వరమా? శాపమా?'; 'ఫాస్ట్‌ఫుడ్స్ – ఆరోగ్యం' మొదలైన అంశాలను చర్చ కోసం ఎంపికచేసి, అన్ని స్థాయిల విద్యార్థులకు నిర్వహించవచ్చు. ఈ తరహా కృత్యాలు నిర్వహించవటం విద్యార్థి చాలా ఎక్కువ ప్రయోజనం పొందుతాడు. వారి ఆలోచనలు, మాటలు, ఆచరణల మధ్య సమన్వయాన్ని తీసుకురావటానికి ఈ తరహా కృత్యాలను ఉపాధ్యాయుడు తప్పనిసరిగా నిర్ణీత వ్యవధుల్లో నిర్వహించాలి. అత్యంత ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు కనుక నిర్వహించినట్లయితే విద్యార్థులు గొప్ప ఉపన్యాసకులుగా, ఉత్తమ శ్రోతలుగా తయారవుతారు.

ఈ లక్ష్యాలు / సామర్థ్యాలు సాధించటానికి ఉపాధ్యాయుడు పూనుకోవాలి. ఓపికగా వినటం, ఇతరుల అభిప్రాయాలను గౌరవించటం వంటి ఉత్తమ లక్షణాలు పిల్లల్లో ప్రాథమికస్థాయి నుంచి పెంపొందింపజేయాలి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి – 9**

1. బాల ప్రదర్శన, అనుకరణ, విశ్లేషించటం వంటి పనుల్లో విద్యార్థి నిమగ్నమై ఉంటాడు. ఆ సందర్భంలో విద్యార్థికి అవసరమైన నైపుణ్యం ఏది?

   ఎ) మాట్లాడే నైపుణ్యం　　బి) సంభాషణ నైపుణ్యం

   సి) ధారణ చేసే నైపుణ్యం　　డి) నాటకీకరణ నైపుణ్యం

2. తక్షణ నిర్వహణ విధానంలో ఏడో తరగతి విద్యార్థులకు ఏదైనా ఒక పోటీ నిర్వహించండి. మీ పరిశీలనలను నమోదు చెయ్యండి.

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

## 4.5 ధారాళత - నిర్దుష్టత

భాషా నైపుణ్యాల సాధనలో ధారాళత, నిర్దుష్టత రెండు ప్రధాన అంశీభూతాలుగా ఉంటాయి. విద్యార్థి భాషాధ్యయనం చేయటంలో ఈ అంశాల ప్రాధాన్యత ఏమిటి? బాలలకు భాషను నేర్పించే సందర్భంలో ఏయే అంశాలపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది? - ఈ రెండు అంశాల మీద అత్యధికంగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. వ్యాకరణ నియమాలకు అనుగుణంగా, సరైన పదాలు వాడుతూ, స్పష్టంగా ఉచ్చారణ చేయగలిగిన సామర్థ్యాన్ని నిర్దుష్టత అంటారు. ప్రాథమికస్థాయి విద్యార్థుల్లో ఉండే నిర్దుష్టత స్థాయి, ఉన్నతస్థాయి విద్యార్థుల్లో ఉండే నిర్దుష్టత స్థాయి వేర్వేరుగా ఉంటాయి. ప్రాథమిక నుంచి ఉన్నత దశ వరకు ప్రతి దశలోనూ విద్యార్థి అనేక తప్పులు చేస్తూ (భాషా సంబంధంగా), ఆ దోషాల ద్వారానే భాష నేర్చుకుంటాడు. ఈ విషయాన్ని మనం యూనిట్ 3లో అధ్యయనం చేశాం.

విద్యార్థి చేసే తప్పులే అతడు భాష నేర్చుకునేందుకు సహకరిస్తాయి. ఆ తప్పుల ద్వారానే విద్యార్థి భాషా నియమాలు / వ్యాకరణ నియమాలు నేర్చుకుంటాడు. ఉదాహరణకు మూడు, నాలుగేళ్ళ బాలుడు మాట్లాడే పరిశీలిద్దాం.

'అమ్మా నాకు కారు బొమ్మ కావాలి'

'నాకు మంచి నీరు కావాలి'

ఈ రెండు వాక్యాలు పరిశీలించినప్పుడు ఒక విషయం స్పష్టమవుతుంది. ఆ బాలుడికి 'కావాలి' అనే పదం ఎందుకు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా వాడాలో తెలుసు. అందుకే తన అవసరాన్ని ప్రకటించే సందర్భలో 'కావాలి' అనే పదాన్ని ఉపయోగించాడు. అంతేకానీ, 'నాకు మంచినీరు ఇవ్వాలి' అనలేదు. పైన పేర్కొన్న రెండు వాక్యాల్లోను బాలుడు తన కోరికను వెల్లడించటానికి 'కావాలి' అనే పదాన్ని ఉపయోగించాడు. ఇది అతనికి ఎవరూ నేర్పించింది. పరిశీలన ద్వారా ఈ విధమైన భాషా నైపుణ్యాలు పిల్లలకు సహజంగా అలవడతాయి.

భాషకు సంబంధించి 'ధారాళత' అంటే ఏమిటో ఇప్పుడు చర్చిద్దాం. మాట్లాడటం, చదవటం, రాయటం ద్వారా బాలుడు అప్పటికప్పుడు అత్యంత సహజంగా, ఎటువంటి ఆటంకం లేకుండా తక్షణ ప్రతిస్పందనగా మాట్లాడే సామర్థ్యాన్ని ధారాళత అంటారు. ధారాళత విషయంలో సందర్భం, పదానికి ఉన్న అర్థం మాత్రమే పరిగణలోకి వస్తాయి. వ్యాకరణ నియమాలను ధారాళత విషయంలో అతంగా పట్టించుకోవటం జరగదు. ధారాళత, నిర్దుష్టత - ఈ రెండు అంశాల్లో దేనికి ప్రాధాన్యత ఇవ్వాలి? ఏవిధంగా ఇవ్వాలి? ఎందుకు ఇవ్వాలి? అనే ప్రశ్నలు ప్రస్తుత భాషోపాధ్యాయుడిని తీవ్రంగా కలిచివేస్తున్నాయి. ఈ రెండు అంశాలు ప్రధానమైనవే. రెండిటీ అవసరం భాషాభ్యసనంలో తప్పనిసరి.

సనాతన పద్ధతి పాటించే ఉపాధ్యాయులు నిర్దుష్టతకు ప్రాధాన్యత ఇస్తారు. వ్యాకరణ నియమాలకు అనుగుణంగా మాట్లాడాలని, రాయాలని వారు విద్యార్థులకు పదే పదే సూచిస్తారు. అందుకు తగిన శిక్షణ కూడా ఇస్తారు. అనేక పరీక్షలు కూడా ఈ కోణంలో వారికి నిర్వహిస్తారు. చాలా కొద్ది సందర్భాల్లో మాత్రమే వారు చేసిన తప్పుల్ని వారే గుర్తించేందుకు విద్యార్థులకు అవకాశం

లభిస్తుంది. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఆలోచన / లక్ష్యం ఈవిధమైన 'నిర్దుష్టత కేంద్రీకృత' భాషాభ్యసనకు దారితీస్తుంది. భాష అనేది కేవలం మన ఆలోచనలు, భావాలు, ఆశయాలను ప్రకటించేందుకు ఒక మార్గం మాత్రమే అని మరికొందరు ఉపాధ్యాయులు భావిస్తారు. ఈ తరహా ఉపాధ్యాయులు కేవలం ధారాళతకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. వ్యాకరణ నియమాలకు అంత ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకుండా, కేవలం అర్థగ్రహణకే ప్రాధాన్యత ఇస్తూ భాషాబోధన చేయటానికి ఈ తరహా ఉపాధ్యాయులు ఆసక్తి చూపిస్తారు. మనం చెప్పే మాటలు అవతలి వ్యక్తికి (శ్రోతకు) మనలోని భావాన్ని పూర్తిగా అందిస్తున్నాయా? లేదా? అనే విషయానికి మాత్రమే వీరు ప్రాధాన్యత ఇస్తారు. ఈ లక్ష్యాన్ని చేరేలా విద్యార్థులు మాట్లాడే సామర్థ్యాన్ని పెంచుకుంటే సరిపోతుందని వీరు భావిస్తారు. ఎంత ఎక్కువగా మాట్లాడేందుకు అవకాశం ఇస్తే అంత ఎక్కువగా విద్యార్థులు భాషణ నైపుణ్యాన్ని, ధారాళత సాధిస్తారని ఈ తరహా ఉపాధ్యాయులు ఆలోచిస్తారు.

పైన పేర్కొన్న రెండు విషయాలను ఆలోచించి చూస్తే, ఆ యా సందర్భాల్లో రెండు వాదనలూ నిజమైనవే అనిపిస్తుంది. పూర్తిస్థాయిలో భాషా నైపుణ్యం సాధించాలంటే, విద్యార్థి ఈ రెండు నైపుణ్యాలు సాధించాల్సి ఉంటుందని ఈ వాదనల వల్ల స్పష్టమవుతుంది. పదో తరగతికి వచ్చేసరికి విద్యార్థుల్లో ధారాళత పెరుగుతుంది. అప్పుడు నిర్దుష్టతకు ప్రాధాన్యత ఇవ్వాలి. సమయానుగుణంగా ధారాళత, నిర్దుష్టత – సామర్థ్యాలను పిల్లల్లో కలగజేయటానికి ఉపాధ్యాయుడు తగిన ఆచరణాత్మక ప్రణాళికలు రూపొందించాలి. సమయానుగుణంగా వాటిని అమలుచేయాలి. అప్పుడు ఆశించిన లక్ష్యాలను చేరుకోవటం సులభమవుతుంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి – 10

1. 'నాకొక కారు కావాలి' – ఈ వాక్యంలో 'కావాలి' అనేది

   ఎ) సహాయక క్రియ  బి) విశేషణం  సి) నామవాచకం  డి) ప్రధాన క్రియ

2. 'ధారాళత', 'నిర్దుష్టత' గురించి మీ సొంత మాటల్లో రాయండి.

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

3. 'ధారాళత', 'నిర్దుష్టత' – ఈ రెండింటిలో భాషాభ్యసనం దృష్ట్యా ఏది అధిక ప్రాధాన్యత కలిగినది?

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

నోట్స్

## 4.6 సారాంశం

ఈ భాగంలో శ్రవణం, భాషణ నైపుణ్యాల భావన గురించి అధ్యయనం చేయటం జరిగింది. కేవలం వినటం, మాట్లాడటం అనేవి శ్రవణం, భాషణం కావని, ఈ నైపుణ్యాలకు ప్రత్యేక లక్షణాలు, విధానాలు ఉన్నాయని కూడా ప్రస్తుత భాగంలో వివరణాత్మకంగా తెలుసుకున్నాము. ఇంటిభాషలో బాలల వికాసం చాలా ఎక్కువగా ఉంటుందని, ఇంటి భాషలో వారు బాగా మాట్లాడతారని, పాఠశాలకు వచ్చేసరికి అక్కడ వ్యవహరించే కొత్తభాష నేర్చుకోవటానికి కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలుసుకున్నాము. అన్ని అవరోధాలను అధిగమించి ఇంటి భాషతో ఇతర భాషలు కూడా నేర్చుకునే సామర్థ్యం బాలలకు ఉందని, ఇందుకు కొంత సమయం, సాధన అవసరమవుతాయని కూడా విశ్లేషించటం జరిగింది. విద్యార్థులు తరగతిగదుల్లో సంభాషించటానికి తగినన్ని ఎక్కువ అవకాశాలు కల్పించాలి. ఈ బాధ్యత ఉపాధ్యాయుడి మీదనే ఉంటుంది. విద్యార్థుల సామాజిక ప్రవర్తన, బాధ్యతలను తీర్చిదిద్దటంలో ఈ దృగ్విషయం ఎంతో ప్రాధాన్యత కలిగిఉంటుంది. తరగతిలో జరిపే సంభాషణలే విద్యార్థుల మూర్తిమత్వాన్ని తీర్చిదిద్దుతాయి. వీటన్నిటితోపాటు భాషాభ్యసనంలో ధారాళత, నిర్దుష్టత కూడా అవసరమని, ఉపాధ్యాయుడు ఈ రెండు నైపుణ్యాలను తగినన్ని కృత్యాలు నిర్వహించటం ద్వారా విద్యార్థుల్లో పెంపొందింపజేయాల్సి ఉంటుందని ఈ భాగంలో తెలుసుకున్నాము.

## 4.7 సంప్రదింపు గ్రంథాలు


- Agnihotri, R.K. and Bagchi, Tista (2007), *Construction of Knowledge.* Udaipur: Vidya Bhawan Society.
- Agnihotri, R.K. (1999), *Bachchon ki Bhaashaa Sikhane ki Kshamataa, Bhag.1,2* (Shaikshik Sandarbh). Bhopal: Eklavya
- Kumar, Krishna (1996), *Bachchon ki Bhaashaa Or Adhyaapak.* New Delhi: National Book Trust.
- Richards, Jack C. (2008). *Teaching Listening and Speaking: From Theory to Practice.* New York: Cambridge University Press.
- Chafe, Wallace (1985). *Linguistic Differences by Differences between Speaking and Writing.* New York: Cambridge University Press.


## 4.8 భాగాంత అభ్యాసం

1. కథల ద్వారా విద్యార్థుల్లో ఏరకమైన సామర్థ్యాలను పెంపొందింపజేయవచ్చు?
2. విద్యార్థులు తరగతిలో మాట్లాడటం ప్రారంభించగానే ఉపాధ్యాయుడు వారి వైపు తీక్షణంగా చూస్తాడు. – ఈ విధానం సరైనదేవా? నీ అభిప్రాయం ఏమిటి?

నోట్స్

3. చర్చకు ఎక్కువ అవకాశం కల్పించే కథను నల్లబల్ల మీద రాయండి. దీనిద్వారా బాలల్లో ఉండే శ్రవణ, భాషణ నైపుణ్యాలు ఎలా వృద్ధి చెందుతాయో మీ పరిశీలనలు రాయండి.

4. చర్చలు జరిపేలా బాలల్ని ప్రోత్సహించేందుకు నీవు అమితంగా ఇష్టపడే విధానం ఏది? ఉదాహరణలతో వివరించండి.

5. శ్రవణంలో వాస్తవంగా ఇమిడి ఉండే నైపుణ్యాలేవి?

# భాగం - 5 : పఠనం

**నిర్మాణం**


5.0 పరిచయం

5.1 అభ్యసన లక్ష్యాలు

5.2 పఠనం అంటే ఏమిటి?

5.3 పఠన సామర్థ్యం / నైపుణ్యం - ఆవశ్యకత

5.4 పఠన నైపుణ్య బోధన : విధానం మరియు పద్ధతులు

5.4.1 పఠన బోధనలో ప్రముఖ పద్ధతులు, వాటి పరిమితులు

5.4.2 పఠన అభ్యాసానికి మార్గాలు

5.4.3 పఠన బోధన - ఉపాధ్యాయుని కర్తవ్యం

5.4.4 కృత్యాలు

5.5 పఠనం, లేఖనం మధ్య సంబంధం

5.6 సారాంశం

5.7 సంప్రదింపు గ్రంథాలు

5.8 భాగాంత అభ్యాసం


## 5.0 పరిచయం

ఈ భాగంలో పఠనం అంటే ఏమిటో తెలుసుకుందాం. పఠనం అంటే తెలిసిన వ్యక్తి ఒక పుస్తకాన్ని ఎలా చదువుతాడో, పఠనంలో ఉన్న అంశాలేమిటో అవగాహన చేసుకునే ప్రయత్నం చేద్దాం. పఠనం చేయాల్సిన అవసరం, పఠనానికి, లేఖనానికి మధ్య ఉన్న సంబంధం గురించి కూడా ఈ భాగంలో అధ్యయనం చేద్దాం. విద్యార్థుల్లో పఠన నైపుణ్యాన్ని అభివృద్ధి చెయ్యటం ప్రాథమిక పాఠశాల లక్ష్యాల్లో ఒకటి. కాబట్టి, విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలు ఎలా అభివృద్ధి చెయ్యాలో, అందుకు సంబంధించిన కృత్యాలేమిటో కూడా ఈ భాగంలో తెలుసుకుందాం.

పఠన విధానం, పఠనాన్ని ఆసక్తికరంగా తీర్చిదిద్దే విధానం, బాలల్లో పఠనం పట్ల ఆసక్తి కలిగించటంలో పుస్తకాల పాత్ర ఏమిటో కూడా ఈ భాగంలో విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేద్దాం. పఠనంలో ఉన్న దశలు, విద్యార్థికి ఏవిధంగా పఠన నైపుణ్యాన్ని పెంచుకుంటాడో ఆ విధానాలను కూడా నేర్చుకుందాం.

నోట్స్

## 5.1 అభ్యసన లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత

- పఠనం అంటే ఏమిటో, దాని విస్తృత, సామాన్య అర్థాలేమిటో వివరంగా తెలుసుకుంటారు.
- విద్యార్థులు ఎందుకు పఠనం చేయలేకపోతున్నారో కారణాలతో సహా తెలుసుకుంటారు.
- 'ఎందుకు చదవాలి' ? అనే విషయాన్ని తెలుసుకుంటారు. అందుకు తగిన పద్ధతులను కూడా అవగాహన చేసుకుంటారు.
- భాషను సమగ్రంగా నేర్చుకోవాలే గానీ చిన్న చిన్న విభాగాలుగా అధ్యయనం చేయటం సాధ్యం కాదని తెలుసుకుంటారు.
- పఠనం చేయటానికి ఉన్న అన్ని ప్రక్రియల గురించి అవగాహన పొందుతారు.
- తరగతిగదిలో పఠన నైపుణ్యాభివృద్ధి విధానాలను బోధించే పద్ధతుల గురించి తెలుసుకుంటారు.
- పఠనాభివృద్ధి సామగ్రిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుంటారు. పాఠ్యపుస్తకాలతో పాటు పఠన నైపుణ్యాన్ని అభివృద్ధి చేసే ఇతర సామగ్రి, పుస్తకాలు, విధానాల గురించి అవగాహన పొందుతారు.
- పఠనం, లేఖనం మధ్య ఉన్న అంతర్గత సంబంధాన్ని స్పష్టంగా తెలుసుకుంటారు.

## 5.2 పఠనం అంటే ఏమిటి?

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎదుర్కొనే అతిపెద్ద సమస్య – అతడి విద్యార్థుల చేత పఠనం చేయించట (చదివించటం). ఎందుకు చదవాలో, ఎలా చదవాలో కూడా ఆ స్థాయి పిల్లలకు చెప్పటం చాలా కష్టంతో కూడుకున్న పని. ప్రాథమిక తరగతుల ఉపాధ్యాయులు మథన పడే అతి పెద్ద సమస్య ఇది. మిగిలిన నైపుణ్యాల తీరులో కాకుండా పఠనం కొద్దిపాటి కష్టంతో కూడుకుని ఉంటుంది. తేలికగా ఈ నైపుణ్యం అలవడదు. అంతేకాదు, పఠనానికి ముందు నైపుణ్యాలైన శ్రవణం, భాషణం వస్తేనే విద్యార్థి పఠనం చేయగలుగుతాడు. పాఠశాలకు రాకముందే విద్యార్థి తన కుటుంబ / సహజ వాతావరణంలో భాష నేర్చుకుంటాడు. ఎలా మాట్లాడాలో కూడా తెలుసుకుని ఉంటాడు. అయితే, అతడు నేర్చుకున్న భాష అంతా పూర్తిగా వాగ్రూపంలోనే ఉంటుంది. పఠనంలో అనేక బౌద్ధిక సామర్థ్యాలతో పాటు కొన్ని ఉప నైపుణ్యాలు కూడా ఉంటాయి. వీటన్నిటినీ మించిన ప్రశ్న ఏమిటంటే, పఠనం అంటే ఏమిటి? దీనిపట్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉన్న అవగాహన ఏమిటి? విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాల్లో ఉన్న పదాలు / వాక్యాలు చదవగలిగితే వారికి పఠన సామర్థ్యం వచ్చినట్లే అని ఉపాధ్యాయులు సాధారణంగా భావిస్తారు. అంతే తప్ప, పాఠ్యపుస్తకం కానీ, మరేదైనా కానీ, చదువుతున్న అంశం ఎంతవరకు విద్యార్థుల అవగాహనకు వస్తోందనే విషయాన్ని ఉపాధ్యాయులు గమనించరు.

పఠనం అనేది ఒక సృజనాత్మక కృత్యం. ఎందుకంటే... పాఠకుడు పుస్తకంలోని విషయాన్ని ఒక్కోసారి యథాతథంగా చదవలేడు. ఆ సందర్భంలోని విషయం గురించి తనకు ఉన్న అవగాహన ప్రకారం కొన్ని పదాలు మార్చి చదువుతాడు. అయితే, సందర్భానికి అర్థం మారదు. కేవలం పదాలు మాత్రమే మారతాయి. దీనిబట్టి, గమనించాల్సిందేమిటంటే... పఠనం అంటే కేవలం అక్షరాలను నోటితో ఉచ్చరించటం మాత్రమే కాదు. ఆ అక్షరాల వెనుక దాగిఉన్న అర్థాన్ని గ్రహించటమే నిజమైన పఠనం అవుతుంది.

కొంచెం శ్రద్ధగా గమనిస్తే ఒక విషయం మనకు అవగాహనకు వస్తుంది. అది ఏమిటంటే... పిల్లలైనా, పెద్దలైనా చదివేటప్పుడు వారి మనస్సు, కళ్ళు పూర్తిగా చదువుతున్న అక్షరాలు, అక్కడి విరామచిహ్నాలతో పాటు ప్రతి అక్షరాన్ని పూర్తిగా ఉన్నవి ఉన్నట్లుగా గ్రహించవు. అలాగని, చదువుతున్న విషయంపై మనం దృష్టి కేంద్రీకరించలేదని కాదు. నిజానికి ప్రతి విరామచిహ్నంతో సహా పరిశీలన చేసి చదవటం అంత తేలికగా సాధ్యమయ్యే పని కాదు. అలా చేయాలని ప్రయత్నిస్తే, మన మనస్సు పూర్తిగా అక్షరాలు, విరామచిహ్నాల మీదే కేంద్రీకృతమై, ఏం చదువుతున్నామో ఆ విషయానికి సంబంధించిన భావాన్ని గ్రహించలేకపోతాము. ఇలా చదవటం చాలా భారంతో కూడుకుని ఉంటుంది. ఒక్కోసారి విసుగు కలుగుతుంది. చివరకు మనం ఏం చదువుతున్నామో తెలియని పరిస్థితి కూడా ఏర్పడే అవకాశం ఉంది.

కొన్ని సందర్భాల్లో పైన చెప్పినట్లుగా ప్రతి అక్షరాన్ని, విరామచిహ్నాన్ని పరిశీలిస్తూ చదవటం వల్ల పాఠకుడు ప్రశాంతత కోల్పోయే అవకాశం కూడా ఉంది. చిన్న చిన్న వార్తలు, పేరాలు కూడా ఈ విధానంలో చదవటం సాధ్యపడక పోగా విధానం సంక్లిష్టంగా మారే ప్రమాదం ఏర్పడుతుంది. ధారాళంగా చదివే నైపుణ్యం ఉన్న పాఠకుడు నిర్దుష్టంగా ఏ ఒక్క అక్షరాకృతినీ నిశితంగా పరిశీలించడు. అక్షరమనే కాదు... పదం, చివరకు వాక్యాన్ని కూడా మొత్తంగా పరిశీలించడు. అతడు విభాగాలుగా చదువుతాడు. అతడి కళ్ళు ముందు వెనుకలకు, పైకి కిందకి తిరుగుతూ ఉంటాయి. అతడి కళ్ళు లిఖిత విషయం మీద ఒక్కసారి కేంద్రీకృతమై, అతడు చూసిన విషయభాగంతో పాటు మొత్తం మిగిలిన భాగాల్లోని విషయాన్ని కూడా పూర్వజ్ఞానం ఆధారంగా అవగాహన చేసుకుంటాడు. ఒక్కోసారి తర్వాతి పదాలను, భావాన్ని ఊహిస్తాడు. పాఠకుడి అనుభవం మీద అతడు ఊహించే సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. తర్వాతి పేరాల్లో ఉండే విషయాన్ని పూర్తిగా చదవకుండానే మొత్తం అంశం తాలూకూ విషయాన్ని ఈ తరహా పాఠకుడు గ్రహిస్తాడు.

మొత్తం ఈ చర్చ ఆధారంగా పఠనం ఈ క్రింది అంశాలను కలిగిఉంటుందని చెప్పవచ్చు.

- లిఖిత రూపంలో ఉన్న భాషలోని అర్థాన్ని అవగాహన చేసుకుంటుంది.
- పఠనం ఆలోచనల్ని సమన్వయపరుస్తుంది. సంధానపరుస్తుంది కూడా.
- కొత్తవిషయాలపై అభిప్రాయాన్ని ఏర్పరుస్తుంది.

- చదివిన మొత్తం విషయాన్ని తార్కిక క్రమంలో గుర్తుపెట్టుకునే సామర్థ్యాన్ని కలిగిస్తుంది.
- అక్షరాలను గుర్తుపట్టి బిగ్గరగా చదవటం మాత్రమే పఠనం కాదు. ఇంతకన్నా ఎక్కువ అర్థం పఠనంలో దాగి ఉంది. లిఖితరూపంలో ఉన్న విషయాన్ని చదివి, అర్థం చేసుకుని, తనకంటూ ఒక ప్రత్యేక దృష్టికోణాన్ని ఏర్పరచుకోవటం, ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావటం కూడా పఠనంలో భాగంగా ఉంటుంది.
- లిఖితరూపంలో ఉన్న భాషతో పాటు సంకేతాల్లోని అర్థాన్ని కూడా విసంకేతీకరణంగా ద్వారా గ్రహించటం కూడా పఠనంలో భాగంగా ఉంటుంది.
- పఠనం అంటే కేవలం వాక్యాలు / పదాలను చదవటం మాత్రమే కాదు. అవసరమైతే చదివిన విషయాన్ని ఆధారంగా చేసుకుని సంభాషించగలగటం కూడా పఠనంలో భాగంగా ఉంటుంది.
- చదివిన విషయాన్ని జీవితానుభవాలతో అన్వయించుకోవటం కూడా పఠనంలో ఒక భాగంగా ఉంటుంది.
- పఠనం ఒక సంపూర్ణవిధానం. అక్షరాకృతులు, వాటికి సంబంధించిన ధ్వని (ఉచ్చారణ) విధానాలు, వాక్యనిర్మాణం, పదాలు / వాక్యాల అర్థం, పదాలు / వాక్యాలను ఊహించే సామర్థ్యం మొదలైనవన్నీ పఠనంలో అంశీభూతాలుగా ఉంటాయి.

ఈ మొత్తం చర్చ ఆధారంగా పఠనాన్ని కొన్ని సామర్థ్యాల సమాహారంగా చెప్పవచ్చు. లిఖిత లేదా ముద్రిత రూపంలో ఉన్న భాషను భావంతో కూడిన అవగాహన చేసుకునేందుకు ఉపయోగించే నైపుణ్యాంగా పఠనాన్ని పేర్కొనవచ్చు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి - 1

1. కిందివాటిలో పఠనానికి సంబంధించి అతి ప్రధానమైన విషయాన్ని టిక్ మార్కుతో గుర్తించండి.

   ఎ) లిఖిత భాషలో ఉన్న అర్థాన్ని గ్రహించటం

   బి) పఠన అభ్యాసంలోని ప్రతి పదాన్ని చదవటం

   సి) సముచిత వేగంగా ధారాళంగా చదవటం

   డి) విరామచిహ్నాల మీద దృష్టి కేంద్రీకరించటం

2. పఠనంలో దాగి ఉన్న వివిధ అంశాలేవి?

   ------------------------------------------------------------

   ------------------------------------------------------------

   ------------------------------------------------------------

3. 'పఠనం ఒక సృజనాత్మక కృత్యం'. ఎందుకు?

   ______________________________________________

   ______________________________________________

   ______________________________________________

## 5.3 పఠన సామర్థ్యం / నైపుణ్యం - ఆవశ్యకత

పఠనం అంటే కేవలం పుస్తకాలు చదవటమే కాదు. పుస్తకం చదవకపోయినా జ్ఞానాన్ని పొందటం సాధ్యమవుతుందని అనేక సందర్భాల్లో ఋజువు అయ్యింది కూడా. ముద్రణ యంత్రాన్ని కనిపెట్టటానికి పూర్వమే మన సమాజంలో జ్ఞానాన్ని వినిమయం చేసుకునే విధానం వాడుకలో ఉండేది. సంస్కృతి, ఆచారాలు మొదలైనవి కూడా కేవలం వారసత్వం గానే వచ్చేవి. వీటిల్ని ఎక్కడా పుస్తకాల్లో నిక్షిప్తం చెయ్యలేదు. ముద్రణ యంత్రం కనుగొన్న తర్వాత జ్ఞాన వినిమయం, అభివృద్ధి మరింత ఎక్కువగా జరగటం మొదలైంది. ప్రతి విషయాన్ని పుస్తకరూపంలో నిక్షిప్తం చెయ్యటం ఒక అలవాటుగా మారింది. వర్తమాన ప్రపంచంలో పుస్తకాలు ఒక ప్రధాన అవసరంగా మారాయి. దీంతో ప్రతి వ్యక్తికీ పఠన / లేఖన సామర్థ్యాలు తప్పనిసరి అయ్యాయి. అవగాహనతో కూడిన పఠనం వల్ల వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మన పరిసర సమాజంలో మనకి సన్నిహితత్వం కలుగుతుంది. మనం వెళ్ళలేని లేదా వెళ్ళటానికి సాధ్యం కాని ప్రదేశాల్లో జరిగిన సంఘటనల గురించి కూడా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. సాహిత్యమే ఇందుకు ఉదాహరణ. చాచా నెహ్రూ మాటల్లో చెప్పాలంటే పఠనం చేసేటప్పుడు అనేక విషయాల పట్ల మనకు అవగాహన కలుగుతుంది. ఫలితంగా మన జీవితచిత్రం కూడా మారుతుంది. సాధారణంగా మనకు జీవితతానుభవాలు చాలా తక్కువగా ఉంటాయి. కేవలం పుస్తక పఠనం ద్వారానే జ్ఞానాభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది.

సంక్షిప్తంగా చెప్పాలంటే పఠన సామర్థ్యం మన జ్ఞానాన్ని విస్తృతపరుస్తుంది. మరింత ఎక్కువ స్థాయిలో ఆలోచించే నేర్పు కలిగిస్తుంది. ఆలోచనల్లో తార్కికత పెంచుతుంది. ఆలోచనల సంఖ్య పెంచుతుంది. విస్తృతమైన సాంఘిక, సాంస్కృతిక సందర్భాలకు వ్యక్తిని పరిచయం చేస్తుంది.

## 5.4 పఠన నైపుణ్య బోధన : విధానం మరియు పద్ధతులు

పిల్లలకు పఠన నైపుణ్యాన్ని కలుగజేయటం... అంటే పిల్లల చేత చదివింపజేయటం, ఎలా చదవాలో వారికి నేర్పించటం చాలా కష్టంతో కూడుకున్న పని. సాధారణంగా ప్రతి ఉపాధ్యాయుడు ఈ సమస్యను ఎదుర్కొంటాడు. ఎందుకంటే, పిల్లలకు ఎలా చదవాలో నేర్పించటానికి ప్రత్యేకమైన పద్ధతులేవీ లేవు. ఇప్పటికే వాడుకలో ఉన్న బోధన పద్ధతులన్నీ చాలా పరిమితులతో ఉన్నాయి. కాబట్టి, వీటిలో ఏవిధానం శ్రేష్ఠమైందనే విషయాన్ని ఎవరూ నిర్ధారించి చెప్పలేకపోతున్నారు. కేవలం ఉపాధ్యాయుడు మాత్రమే తన బోధన సందర్భానికి అనుగుణంగా బోధన పద్ధతిని / వ్యూహాన్ని

ఎంచుకోగలుగుతాడు. ఈ పరిమితుల్ని అధిగమించి, పఠన సామర్థ్యం / నైపుణ్యాన్ని పొందినట్లయితే, విద్యార్థికి ఎనలేని ప్రయోజనాలు కలుగుతాయి. పఠనం విద్యార్థిలో ఉద్దీపనలు కలుగజేస్తుంది. భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తుంది. ఆలోచనల్లో వేగాన్ని, పరిణితిని సాధిస్తుంది. పుస్తక పఠనం పట్ల విద్యార్థులను ప్రోత్సహించి, పఠనం వల్ల ప్రయోజనాలను వారు అవగాహన చేసుకునేలా చేస్తే, విద్యార్థుల అభివృద్ధికి హద్దు ఉండదు.

పిల్లలకు చదవాలనే ఆలోచన / కోరికను కలుగజేయటం ఎలా? ప్రస్తుతం అందరిముందున్న సమస్య ఇది. ఇప్పటివరకు ఉన్న పరిస్థితిని / అవకాశాలను పరిశీలిస్తే ప్రయోజనం ఏమాత్రం కనిపించదు. ఇందుకు కారణం ఏమిటి? ఏటా కొన్ని బిలియన్ల సంఖ్యలో ఈ విషయంలో విఫలమవుతున్నారు. పఠనం చెయ్యాలని ప్రారంభిస్తారు. కానీ, పూర్తిస్థాయిలో పఠన నైపుణ్యాన్ని సాధించకుండానే వెనుదిరుగుతున్నారు. వీరిలో చాలామంది పరీక్షల్లో ఉత్తీర్ణులవుతున్నారు కూడా. కానీ, వారికి పఠనంలో ఏమాత్రం ఆసక్తి ఉండదు. దీనంతటికీ సరైన బోధన జరగకపోవటమే కారణమని పరిశోధనల్లో నిరూపితమైంది.

నిజానికి పఠనం అంటే ఏమిటో ఉపాధ్యాయుడు ప్రత్యేకంగా కూర్చుని వివరించాల్సిన అవసరం లేదు. విద్యార్థులకు నమూనాగా ఉండేలా తాను పఠనం చేసి చూపిస్తే సరిపోతుంది. వాస్తవానికి, చాలా సందర్భాల్లో ఉపాధ్యాయులు పఠనం అంటే ఏమిటో, పఠనం వల్ల కలిగే లాభాలేమిటో, పఠనంలో ఉండే అంశాలేమిటో వివరించటంలో విఫలమవుతున్నారు. మరికొంతమంది, ఉపాధ్యాయులు నోటితో పాఠ్యపుస్తకాన్ని చదివితే చాలు అది పఠనమవుతుందనే భావనలో ఉన్నారు. ఈ సందర్భంలో గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. లిఖితరూపంలో ఇచ్చిన విషయాన్ని అవగాహనతో చదవటం, ఆ విధంగా చదివిన విషయానికి పూర్వ అనుభవాలను అన్వయించుకుని జ్ఞానసముపార్జన చేయగలగటం జరిగినప్పుడే విద్యార్థి పూర్తిస్థాయిలో పఠనం చేసినట్లవుతుంది. నిజానికి, ప్రతి విద్యార్థికీ పూర్తిస్థాయిలో పఠన సామర్థ్యం ఉందని చెప్పటం సాధ్యం కాదు. పై చర్చ మొత్తాన్ని క్రోడీకరిస్తే పఠనాన్ని ఈ కిందివిధంగా నిర్వచించవచ్చు.

ముద్రిత లేదా లిఖిత రూపంలో ఉన్న భాషను విసంకేతీకరణం చేయటం ద్వారా ఆ పదాల అర్థాన్ని, ఆ వాక్యాల భావాన్ని అవగాహన చేసుకోవటమే పఠనం అవుతుంది.

పై నిర్వచనాన్ని ఒప్పుకున్నట్లయితే ప్రాథమికస్థాయిలో ఉన్న బోధన విధానాలు అర్థం లేనివి అవుతాయి. ఉదాహరణకు ఇప్పటిదాకా మనం చర్చించిన విషయాల ప్రకారం అక్షరాలను బిగ్గరగా చదవటం, వర్ణక్రమాన్ని గుర్తుపెట్టుకోవటం, అవగాహన లేకుండా (చేసుకోకుండా) విన్న కథను తిరిగిచెప్పటం, అవగాహన చేసుకోకుండా లిఖిత భాషను గట్టిగా చదవటం మొదలైనవన్నీ సరైన పఠన కృత్యాలు కావు. అర్థం చేసుకోకపోవటం కారణంగా వీటన్నిటినీ పఠనంగా భావించలేము. చాలా పఠనాల్లో ఇప్పటికి ఇంగ్లీషు బోధనలో 'ఎ' అంటే 'యాపిల్'; 'సి' అంటే 'కాట్' అని ఉదాహరణ చెబుతూ బోధిస్తారు. ఇలా చేయటం వల్ల విద్యార్థులు 'ఎ' బదులు 'యాపిల్' అని; 'సి' బదులు 'క్యాట్'

అని చదువుతారు. అదేవిధంగా కథ చెప్పేటప్పుడు అందులోని ఒక్కోపదాన్ని ఒక్కోసారి పలికితే అందుకు ఏవిధమైన భావాన్ని చెప్పుకోలేము. అలాగే, ప్రాథమికస్థాయిలో పిల్లల చేత పలకల మీద అక్షరాలు దిద్దిస్తారు. ఎందుకు రాస్తున్నామో, దాని అర్థం ఏమిటో తెలియకుండా కేవలం బట్టీవిధానంలో రాసిన దానిమీదే రాస్తూ, గట్టిగా చదువుతూ అక్షరాలు దిద్దటం వల్ల విద్యార్థులకు విసుగు కలుగుతుంది. ఈవిధానం పూర్తిగా నిష్ప్రయోజనమైందనే విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తించాలి. ఇటువంటి విధానాల కారణంగా కొందరు విద్యార్థులు కనీసం ప్రాథమిక విద్య కూడా పూర్తి చేయకుండా పాఠశాలను విడిచిపెడుతున్నారు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 2**

1. విద్యార్థిలో పఠనాసక్తిని ఎలా పెంచవచ్చు?

   ఎ) పాఠ్యపుస్తకాల ద్వారా

   బి) వర్ణమాలలోని అక్షరాలను గుర్తుపెట్టుకునేలా చేయటం ద్వారా

   సి) ఆసక్తికరమైన పఠన బోధన విధానాలను ఉపయోగించటం ద్వారా

   డి) బట్టీపట్టటం ద్వారా

2. ఉత్తమ పఠన సామర్థ్యం కలగటానికి నీవు తీసుకునే చర్యలేమిటి?

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

3. ప్రాథమిక విద్య పూర్తిచేయకుండానే ఎందుకు అనేకమంది విద్యార్థులు పాఠశాల విడిచిపెడుతున్నారు?

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

## 5.4.1 పఠన బోధనలో ప్రముఖ పద్ధతులు, వాటి పరిమితులు

పాఠశాలల్లో ప్రస్తుతం అనుసరిస్తున్న పఠన బోధన విధానాలు పఠన నియామలకు అనుగుణంగా లేవు. ఈ లోపాన్ని సవరించేలా ఉన్న కొన్ని బోధన పద్ధతులను ఈ కింద వివరించటం జరిగింది. పఠనం విషయంలో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల్ని కూడా ఈ విధానాలు పరిష్కరిస్తాయి. అయితే, ఈ విధానాలన్నీ నూరుశాతం ఫలితాలను ఇస్తాయని చెప్పలేం. సందర్భానికి తగిన విధానాన్ని ఎంపిక చేసుకోవటం, పూర్తిస్థాయిలో అమలుచేయటం మీద ఆయా విధానాల ఫలితాలు అధారపడి ఉంటాయి.

నోట్స్

- **పఠన నియమాలు తెలుసుకోవటం**

ప్రస్తుత విద్యావ్యవస్థలో ఉన్న పెద్దలోపం ఏమిటంటే, పఠన బోధనకు సంబంధించి ఏవిధమైన నియమాలు లేకపోవటం. కనీసం, ఏ ఒక్కరూ పఠనానికి సంబంధించి నియమాలను సరళీకృతం చేసి చెప్పలేదు. ప్రస్తుతం బాగా చదువుతున్న వారు (పఠన నైపుణ్యం కలిగినవారు) కేవలం పఠనానికి సంబంధించిన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారే తప్ప పఠన నియమాలను చిన్నతనంలో బోధించటం ద్వారా వారికి ఈ సామర్థ్యం వచ్చి ఉండలేదు. బాలలు మౌఖిక భాషను నేర్చుకునే నియమాలను పైవిధానం పోలి ఉంది. బాలలు కూడా సహజంగానే భాషకు సంబంధించిన నియమాలు నేర్చుకుంటారే గానీ వారికి ఎవరూ భాషా నియమాలు బోధించరు. వ్యాకరణ నియమాలు నేర్చుకోవటం వల్లనే బాలలు మాట్లాడగలుగుతున్నారని అనటానికి ఏవిధమైన ఆధారాలు లేవు. ఉచ్చారణను సాధన చెయ్యటం లేదా పఠనేతర కృత్యాల వల్ల బాలలకు ఈ సామర్థ్యాలు వచ్చాయనటానికి కూడా ఆధారాలు లేవు.

కేవలం సూచనలు చెయ్యటం ఒక్కటే పఠనానికి లేదా పఠన బోధనకు సంబంధించిన నియమం అనేది మాత్రమే మనకు తెలుసు. పఠనం నేర్చుకోవటం అంటే నియమాలను గుర్తుపెట్టుకోవటం కాదు. పఠన కృత్యాల వల్లనే బాలలు పఠనం చెయ్యటం ఎలాగో నేర్చుకుంటారు.

- **ఉచ్చారణ నియమాలు తెలుసుకుని పాటించటం**

లిఖిత రూపంలో ఉన్న అక్షరానికి, పలికే ధ్వనికి సారూప్యత సాధించినప్పుడే పఠన సామర్థ్యం పూర్తిగా వచ్చినట్లవుతుంది. ప్రపంచవ్యాప్తంగా అందరి అంగీకారం పొందిన భావన ఇది. కేవలం అక్షరాలను చదవటం, ఉచ్చరించటంతోనే పఠనం ప్రారంభం కాదని మనకు తెలుసు. ఉచ్చారణ చెయ్యటానికి పూర్వమే ఆ పదం యొక్క భావాన్ని మనం తెలుసుకుని ఉండాలి. ఉంటాము కూడా. అలాచెయ్యకపోతే అక్షరాలను ధ్వనులుగా మార్చటం పూర్తిగా వృథా తప్ప మరొకటి కాదు. కాబట్టి, ప్రాథమిక దశలో బాలలు పదాలు చదివే సందర్భంలో అక్షరాలు ఎలా ఉచ్చరించాలో ఆ నియమాలు పూర్తిగా తెలుసుకొని ఉండాలి. వీటిపట్ల సామర్థ్యాన్ని కూడా పెంచుకోవాలి. ఒక్కొక్కటిగా పదాన్ని చదువుతూ అర్థాన్ని గ్రహించాలి. ఇలా చెయ్యటం వల్ల అంతకుముందు పరిచయం లేని పదాలను కూడా సరిగ్గా ఉచ్చరించి, వాటి అర్థాన్ని విద్యార్థులు గ్రహించగలుగుతారు.

- **ఒకేసారి ఒకే పదం లేదా అక్షరాన్ని బోధించటం**

కొన్ని వస్తువుల పేర్లు, కొన్ని అక్షరాలు, పదాలను పలకటం, గుర్తుపెట్టుకోవటం, పిల్లలకు చాలా కష్టమైన పని అని ఎక్కువమంది భావిస్తారు. మరింత ఎక్కువ సమయం లేదా ఎక్కువసార్లు సాధన చెయ్యటమే ఇందుకు పరిష్కారం అని ఆలోచిస్తారు. అయితే, ఇది అత్యంత దోషభూయిష్టమైన ఆలోచన / విధానం. ఎందుకంటే, ఐదారు సంవత్సరాల వయస్సులో

బాలలు రోజుకు కనీసం 1000 పదాలు నేర్చుకుంటారు. వీటిలో చాలావరకు నామవాచకాలు అయి ఉంటాయి. వీటన్నింటినీ ఒక్కసారి వినటంతోనే బాలలు నేర్చుకుంటారు. గుర్తుపెట్టుకుంటారు.

వర్గీకరణం చెయ్యటం లేదా సమూహాలుగా విభజించే ప్రక్రియను బాలలు నేర్చుకునే విధానం చాలా నిర్మాణాత్మకంగా ఉంటుంది. సందర్భాన్ని బట్టి ఒక పేరు ఎలా పలుకబడిందో, ఆ లక్షణాలు ఏమిటో వారు పరిశీలిస్తారు. భవిష్యత్తులో తిరిగి జ్ఞప్తికి తెచ్చుకునేందుకు ఈ గుర్తులు పెట్టుకుంటారు. ఒక విషయాన్ని అర్థం చేసుకునేందుకు వారు అనేక ఊహాత్మక కల్పనలు చేసుకుని, వాటిని అనేకసార్లు పరీక్షించి, అంతిమంగా నిర్ధారణకు వస్తారు. ఈక్రమంలో బాలలు చేసే తప్పులు పెద్దలకు పిల్లలు ఏవిధంగా భాష నేర్చుకుంటున్నారనే విషయం పట్ల అవగాహన కలుగజేస్తాయి. ఉదాహరణకు ఒక పిల్లవాడు నాలుగు కాళ్ళున్న జంతువును 'కుక్క' అని పిలిచాడనుకుందాం. దీనిబట్టి, ఆ పిల్లవాని దృష్టిలో కుక్క అంటే నాలుగు కాళ్ళ జంతువు అనే భావన ఉందని గ్రహించవచ్చు. ఒకవేళ ఆ పిల్లవాడు నాలుగు కాళ్ళున్న మేజాబల్లను కూడా కుక్క అని పిలిస్తే అతడికి సజీవులు, నిర్జీవులనే భావన పట్ల అవగాహన లేదని తెలుస్తుంది. ఇదే పిల్లవాడు తన ఇంట్లోని (స్వంత) కుక్కను మాత్రమే కుక్క! అని పిలిచి, మిగిలినవాటిని పిలవలేదు అనుకుందాం. అప్పుడా పిల్లవాడికి సాధారణీకరణ సామర్థ్యం లేదని తెలుస్తుంది.

ఈ రకమైన సాధారణీకరణ సామర్థ్యం పిల్లవానికి రావాలంటే, సజీవ – నిర్జీవ, మానవ – మానవేతర భావనల పట్ల అవగాహన ఉండితీరాలి. నాలుగు కాళ్ళు ఉన్న ప్రతి జంతువూ కుక్క కాదనే విషయాన్ని వారి చేత గ్రహింపజేయాలి. పరిశీలన చెయ్యటం ద్వారా విద్యార్థులు తమ ప్రాక్కల్పనల్లోని దోషాలను గుర్తించి, సరిచేసుకుంటారు. ఒక్కోసారి పెద్దల అభిప్రాయాలను గ్రహించటం ద్వారా తమ దోషాలను సరిచేసుకుంటారు.

ఆంగ్లభాషలోని అక్షరాలు నేర్చుకునే సందర్భంలో ఈ పరిస్థితి ఎదురవుతుంది. 'ఎ' అనే అక్షరాన్ని చూపిస్తూ పిల్లల చేత గట్టిగా 'ఎ' అని ఉచ్చారణ చేయిస్తారు. దీనివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఇదే క్రమంలో 'బి', 'డి' అక్షరాలు నేర్పిస్తారు. ఇక్కడే పిల్లవాడికి సందేహం వస్తుంది. 'బి', 'డి' అక్షర నిర్మాణాల్లో ఉండే తేడాను గుర్తించలేక చాలాసార్లు పిల్లలు పొరపాటు చేస్తారు. దీనికి బదులు 'బి', 'డి'లను వేర్వేరు సందర్భాల్లో చూపించి, నేర్పించే బదులు వాటిని ఒకేసారి చూపించి, వాటి నిర్మాణంలో, లక్షణాల్లో, ఉచ్చారణలో ఉన్న తేడాలను పిల్లలు గుర్తించేలా చెయ్యాలి. ఇలా చెయ్యటం వల్ల మాత్రమే వారు అక్షరభేదాలు గుర్తించగలుగుతారు.

- **ఊహించటం, అంచనావెయ్యటం తగదని పిల్లలకు చెప్పటం**

ఏ కొద్దిగా కనబడే అవకాశం ఉన్నా, ధారాళంగా చదివే సామర్థ్యం ఉన్న పాఠకుడు ఆ

నోట్స్

విషయాన్ని తేలికగా చదువుతాడు. అందులో ఉన్న ప్రతిపదాన్ని అర్థం చేసుకుంటూ కూడా చదవగలుగుతాడు. నిజానికి నెమ్మదిగా చదవటం కన్నా వేగంగా చదవటమే తేలిక.

ఇప్పటివరకు చర్చించుకున్న విషయాన్ని ఆధారంగా చేసుకుని పరిశీలించినట్లయితే జాగ్రత్తగా చదవటం వల్ల ధారాళత సాధ్యపడదని తెలుస్తుంది. అవగాహన చేసుకోకుండా చదవటం ఏమాత్రం పఠనం అనిపించుకోదు. ఈ భావనలన్నిటినీ దృష్టిలో ఉంచుకుని గుడ్‌మాన్ అనే భాషావేత్త 'మానసిక – భాషాపరమైన ఊహాత్మక కల్పన'గా పఠనాన్ని నిర్వచించాడు. పఠనం వచ్చిన తర్వాత చదువుతున్న ప్రతి పదానికి అర్థాన్ని ఊహించగలగాలి. అంటే, చీకట్లో బాణం వేసినట్లు ఊహించమని కాదు. అప్పటికే మన దగ్గర ఉన్న సమాచారం, విషయజ్ఞానం, ఇతర వివరాల ప్రకారం అర్థాన్ని అంచనా వెయ్యాలి. పఠనం చేస్తున్నంత సేపు ఈవిధంగా మనం ఊహాత్మకంగా అర్థాలు వెతుకుతూ ఉండాలి. అయితే, క్రమంగా ఊహాత్మక స్థాయి తగ్గుతూ పూర్తి అవగాహన పెంచుకోవాలి.

ఒక్కోసారి మనకు తెలియని విషయం గురించి చదువుతాం. లేదా కష్టమైన ఇతివృత్తం ఉన్న విషయం, సంక్లిష్టమైన భాష ఉపయోగించిన నవల, సాంకేతిక పదజాలంతో కూడిన వ్యాసం లేదా విదేశీభాషలో ఉన్న విషయాన్ని చదివాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సందర్భంలో ప్రతి వాక్యాన్ని అర్థం చేసుకుంటూ చదవటం చాలా కష్టమని మనకు తెలుసు. అయినా, నిఘంటువును ఆధారం చేసుకుని, కష్టమైనప్పటికీ చదవటానికే ప్రయత్నిస్తాం. కొంచెం తక్కువ వేగంతో చదవటానికి నిశ్చయించుకుంటాం. కానీ, భాషావేత్తలు మాత్రం ఇటువంటి సందర్భంలో పూర్తివేగంతో చదవటం, ఎక్కువసార్లు చదవటం ఫలితాన్నిస్తుందని చెబుతున్నారు.

ఇప్పటిదాకా మనం చర్చించుకున్న విషయాలన్నిటినీ సంగ్రహంగా చూస్తే, పఠనాన్ని నిరంతరం కొనసాగించటం ద్వారానే అర్థం బోధపడుతుందని తెలుస్తుంది. ఒక అంశాన్ని / లిఖిత విషయాన్ని చదువుతున్నప్పుడు ఏదైనా పదానికి అర్థం తెలియని సందర్భం ఎదురైతే, ఆ అంశంలో అర్థమైన ఇతర భాగం ద్వారా నూతన పదానికి అర్థాన్ని అవగాహన చేసుకోవాలి. ఇదొక మేలైన పద్ధతి అని భాషావేత్తలు సూచిస్తున్నారు. నిరంతరం చదవటమే అన్ని కొత్త పదాలకు అర్థాన్ని అవగాహన కలిగిస్తుంది. ఇదే మేలైన పద్ధతి.

- **ప్రతి పదం చదవటానికి ప్రాధాన్యత**

విభిన్నమైన పదాలను గుర్తుపట్టి, వాటిని అవగాహన చేసుకుని చదవటం పఠన ప్రక్రియలో విద్యార్థులు అతి కష్టంగా భావిస్తారు. ఈ కారణం వల్లనే వారు పదాలను వెంటనే గుర్తించలేకపోతారు. ధారాళంగా చదివే సామర్థ్యం ఉన్న పాఠకుడు కొన్ని ఆధారాల ద్వారా పదాలకు అర్థాన్ని తెలుసుకుంటాడు. వాక్యంలో వచ్చిన నూతన పదాల సందర్భాన్ని బట్టి ఈ అవగాహనకు వస్తాడు. వాస్తవానికి పదాలను గుర్తించటం అనేది పఠనంలో ప్రధానమైన అంశం కాదు. వాక్యంలోని ఇతర పదాల నుంచి వేరుచేయబడిన ఒక పదాన్ని గుర్తించి,

అర్థం గ్రహించాలంటే విద్యార్థికి కష్టమవుతుంది. సాధారణంగా మనిషికి దృగ్గోచరమైన సంకేతాలను వెంటనే అవగాహన చేసుకుని జ్ఞప్తి యందు ఉంచుకునే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. కాబట్టి, సంకేతాలతో కూడిన విషయాన్ని చదవటం కష్టమవుతుంది. లిఖితరూపంలో ఉన్న భాషను చూడగానే, అందులోని అక్షరాలను పరిశీలించి, అవగాహన చేసుకోవటం ద్వారా పఠన ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ధారాళంగా చదివే సామర్థ్యం ఉన్న పాఠకులు ప్రతి పదాన్ని చదవరు. వారు కేవలం సారాంశాన్ని గ్రహిస్తారు. ప్రతి పదం చదవటం కన్నా ఇచ్చిన పఠన అభ్యాసాన్ని భావాన్ని గ్రహించటానికి చదవటం చాలా తేలిక. ఈ విషయం విద్యార్థులకు సహజంగానే అవగతం అవుతుంది.

- **స్పష్టంగా, కచ్చితంగా చదవటం చాలా అవసరం**

తప్పులు లేకుండా ఏ ఒక్కరూ చదవలేరు. తప్పులతో చదవటాన్ని అంగీకరించకపోతే మనం కనీసం వ్యక్తుల పేర్లు, జంతువులు, మొక్కల పేర్లను కూడా చదవలేము. తప్పులు చేస్తామనే భయంతో పిల్లలు సాధారణంగా చదవటానికి సిద్ధపడరు. ఈ తరహా భయమే విద్యార్థిలో పఠన నైపుణ్యం పెరగకపోవటానికి ప్రధాన అడ్డంకిగా ఉంటుంది. చదివేటప్పుడు విద్యార్థులు చేసే ఉచ్చారణ దోషాలే వారిలో పఠన నైపుణ్యం పెరగటానికి దోహదం చేస్తాయి.

పఠనం ప్రారంభించటానికి పూర్వమే విద్యార్థికి ఈ విషయం పట్ల అవగాహన ఉన్నట్లయితే అతడు స్వేచ్ఛగా చదవగలుగుతాడు. లేకపోతే, కొన్ని పదాలను వదిలి చదవటం జరుగుతుంది. ఫలితంగా పఠన లక్ష్యం నెరవేరదు. పఠనం చేసేటప్పుడు విద్యార్థికి ఉన్న పూర్వ అవగాహన అతడు చదువుతున్న విషయంపై ప్రభావం చూపిస్తుంది. పఠనం పూర్తికాగానే అతడు తన ఊహాత్మక పరికలపనలను చదివిన విషయంతో పోల్చి చూస్తాడు. అతని పరికల్పన, పఠించిన విషయం యొక్క అర్థం రెండూ ఒకటే అయితే అతడు పఠనాన్ని పరిశీలిస్తాడు. లేకపోతే మరింత ఎక్కువ సమాచారం కోసం ప్రయత్నిస్తాడు.

- **తప్పులను గమనించిన వెంటనే గుర్తించుట, సరిదిద్దుకొనుట**

విద్యార్థి చదువుతున్న సందర్భంలో అతను చేస్తున్న ఉచ్చారణ దోషాలను గమనించటం, గుర్తించటం ఉపాధ్యాయుడికి చాలా తేలిక అవుతుంది. అయితే, ఈ సామర్థ్యం విద్యార్థికి ఏమాత్రం ఉపయోగించదు. విద్యార్థి కేవలం అర్థం కోసం చదువుతాడే తప్ప పదాలను గుర్తించటం కోసం కాదు. ఒకవేళ విద్యార్థి పదాన్ని గుర్తించటానికి, దాని అర్థాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నట్లయితే ఉపాధ్యాయుడు చేసే ఉచ్చారణ దోషాల గుర్తింపు అతడికి సహాయపడుతుంది. అలాకాకుండా, విద్యార్థి కేవలం అర్థం కోసం మాత్రమే చదువుతున్నట్లయితే ఉపాధ్యాయుడు చేసే సూచనలు ఫలితాన్ని ఇవ్వవు.

- **విద్యార్థులు సొంతంగా, స్వేచ్ఛగా చదివేందుకు ప్రోత్సహించటం**

ఉపాధ్యాయుడు లేదా ఇతరుల సహాయం లేకుండానే విద్యార్థి పఠనానికి సంబంధించిన అనేక నైపుణ్యాలు నేర్చుకుంటాడుడ. విద్యార్థి ఈవిధంగా నైపుణ్యం నేర్చుకోవటం అతని తల్లిదండ్రులకు కూడా తెలియదు. ఒక్కోసారి ఉపాధ్యాయులకు కూడా ఈ విషయం తెలియదు. ఉదాహరణకు ఇంగ్లీషు నేర్చుకునే సందర్భంలో విద్యార్థికి ఒక పదం యొక్క వర్ణక్రమం (స్పెల్లింగ్) రాయటం తెలియకపోయినా మాతృభాషలో అతనికి ఉన్న పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ స్పెల్లింగ్ రాస్తాడు. విద్యార్థిలోని ఈ సామర్థ్యాన్ని ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించినట్లయితే అతడు మరింత ఉత్సాహంతో పఠన అభ్యాసం చేస్తాడు. ఈ క్రమంలో అతడికి స్పష్టత, స్వచ్ఛత మరియు దోషాల నివారణ సామర్థ్యాలు అలవడతాయి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 3**

1. పఠన అభ్యాసం చేసేందుకు ఉన్న సహజ మరియు అత్యంత ఆవశ్యక దశ ఏది?

   ఎ) పఠన దశలో దోషాలు చెయ్యటం　　బి) తప్పులు చెయ్యటం

   సి) అక్షరాలను బట్టీపట్టటం డి) పదాలను బట్టీ పట్టటం

2. విద్యార్థి ఒక విషయాన్ని చదవుతున్నప్పుడు అతడు చేసే ఉచ్చారణ దోషాన్ని అప్పటికప్పుడే గుర్తించి సరిచెయ్యటంం సరైన పద్ధతి కాదు. - ఎందువల్ల?

   _______________________________________________

   _______________________________________________

   _______________________________________________

3. పఠన అభ్యాసం స్మృతికి మార్గం కాదు. ఎందువల్ల?

   _______________________________________________

   _______________________________________________

   _______________________________________________

4. పఠన బోధన విధానాలేవి?

   _______________________________________________

   _______________________________________________

   _______________________________________________

5. ప్రస్తుతం వాడుకలో ఉన్న పఠన బోధన విధానాల్లోని పరిమితులేవి? ఉదాహరణలతో వివరించండి.

---------------------------------------------------

---------------------------------------------------

---------------------------------------------------

6. 'విద్యార్థులు పఠనానికి సంబంధించిన అనేక నైపుణ్యాలను సహజంగా నేర్చుకుంటారు.' – సమర్థించండి.

---------------------------------------------------

---------------------------------------------------

---------------------------------------------------

## 5.4.2 పఠన అభ్యాసానికి మార్గాలు

### వివిధ సందర్భాలు

విద్యార్థులకు పఠన నైపుణ్యాలు బోధించే సందర్భంలో అనేక విషయాలు దృష్టిలో ఉంచుకోవాలి. మొదటగా విద్యార్థులకు పఠన అభ్యాసానికి ఇచ్చే విషయం అర్థవంతంగా మరియు విద్యార్థి స్థాయికి తగినవిధంగా ఉండాలి. రెండవ అంశం – విద్యార్థికి పరిచయమైన భాషలోనే పఠన అభ్యాసం ఉండాలి. మూడవ అంశం – విద్యార్థి విభిన్నమైన అంశాలతో కూడిన పఠన అభ్యాసాలను చదివేందుకు ఉపాధ్యాయుడు సాధ్యమైనన్ని ఎక్కువ అవకాశాలు కల్పించాలి. అలాగే, ఉపాధ్యాయుడు విద్యార్థితో అర్థవంతమైన సంభాషణ చెయ్యాలి. ప్రేమతో, శ్రద్ధతో విద్యార్థులు చెబుతున్న విషయాన్ని వినాలి. ఇదే అవకాశాన్ని విద్యార్థులకు కూడా కల్పించాలి. పఠన అభ్యాసాన్ని అతి చిన్న విభాగాలుగా చెయ్యకూడదు. పఠనం ఒక సంపూర్ణకృత్యంగా ఉండాలే తప్ప చిన్న చిన్న అంశాలతో జరిగే కృత్యం కాకూడదు. మొత్తంగా పఠనం ద్వారానే పఠన నైపుణ్యం వచ్చేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు తగినన్ని అవకాశాలు కల్పించాలి.

### పఠనం ప్రయోజనకరంగా, సవాళ్ళను ఇచ్చేవిధంగా ఉండాలి

విద్యార్థులకు పఠనం కోసం ఇచ్చే అంశం అర్థవంతంగా, అతనికి ఉపయోగించే విధంగా ఉండాలి. మరియు, పఠనానికి సంబంధించి అతనికి కొన్ని సవాళ్ళను ఇచ్చేదిగా ఉండాలి. సాధారణంగా మనం ఏం చదివినా ఎంతో కొంత ప్రయోజనం కలుగుతుంది. లేదా, ఫలితాన్ని ఆశించి చదవుతాము. హాస్యం కోసం, ఉత్సుకత కోసం, అవగాహన కోసం, కథలోని పాత్రల ముగింపు తెలుసుకోవం కోసం, మన పరిసరాల్లో ఏం జరుగుతోందో తెలుసుకోవటం కోసం చదువుతాము. ఒక్కోసారి మనలో

నోట్స్

ఆలోచనలు కలిగించి, ప్రశ్నలు లేవనెత్తే పఠన అభ్యాసాల వల్ల మరింత ఎక్కువగా చదివే అవకాశం ఏర్పడుతుంది. ఏదైనా ఒక అభ్యాసాన్ని చదవటం వల్ల విద్యార్థుల్లో ఉత్సుకత రేకెత్తటం లేదా ఆ అభ్యాసం అతనికి ఏదైనా సవాలు విసరటం జరిగితే అతడు మరింత ఎక్కువ శ్రద్ధతో, శ్రమ తీసుకుని ఆ అభ్యాసాన్ని పూర్తిచేస్తాడు. తరగతిగదిలో ఈ రకమైన పఠన అభ్యాసాలు విద్యార్థికి అందుబాటులో ఉంచాలి. అప్పుడే తరగతిగది వాతావరణం అర్థవంతంగా, ఆసక్తిదాయకంగా ఉంటుంది.

## సందర్భోచిత అభ్యసన సామగ్రి

సందర్భోచితమైన కథలు, గేయాలు మొదలైన వాటిని చదవటానికి విద్యార్థులు ఆసక్తి చూపిస్తారు. ఈవిధమైన సందర్భోచిత పఠనం వల్లనే వారు భాషను నేర్చుకుంటారు. సాధారణంగా కథ చదివేటప్పుడు అందులో అంతర్భాగంగా చిన్న – పెద్ద, దూరం – దగ్గర, లావు – సన్నం మొదలైన పదాలు వస్తాయి. వీటన్నిటి అర్థాలను సందర్భానుగుణంగా విద్యార్థి అవగాహన చేసుకుంటాడు. మరికొన్ని సందర్భాల్లో విద్యార్థి తన ఊహాత్మక కల్పనా శక్తితో కథలో కొత్త పాత్రలు ప్రవేశపెడతాడు. సన్నివేశాలు సృష్టిస్తాడు. ఇలాంటి సందర్భాల్లో విద్యార్థి ఆయా పాత్రలను దృశ్యానుభూతి కలిగేలా (ఆ పాత్రలు నడిచే విధానం, వారి ప్రత్యేక లక్షణాలు, చేసే ధ్వనులు మొదలైనవి అనుకరించటం ద్వారా) వర్ణిస్తాడు. మరికొన్ని సందర్భాల్లో కుక్క, కోడి, కుందేలు వంటి పెంపుడు జంతువులు, వాటి లక్షణాలు కూడా కథలో పాత్రలుగా ప్రవేశపెడతాడు. ఈవిధంగా విద్యార్థి సందర్భోచిత పఠనం చేస్తాడు.

## బాగాపరిచయం ఉన్న వాక్య నిర్మాణాలు

విద్యార్థి పఠన సామర్థ్యం అతడికి పరిచయం ఉన్న భాష మీద ఆధారపడి ఉంటుంది. పఠన అభ్యాసం తెలిసిన భాషలో ఉంటే అతడు మరింత స్వేచ్ఛగా, ప్రభావవంతంగా చదవగలుగుతాడు. కాబట్టి, ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఇచ్చే పఠన అభ్యాసాలు పూర్తిగా వారికి తెలిసిన భాషలోనే ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. మరికొన్ని సందర్భాల్లో తాను విన్న అంశం పఠన అభ్యాసంగా ఉన్నప్పుడు విద్యార్థి మరింతబాగా చదవగలుగుతాడు.

## పఠనకేంద్రం

తరగతిగదిలో ప్రత్యేకంగా ఒక స్థానాన్ని విద్యార్థుల పఠనం కోసం కేటాయించాలి. ఆ ప్రాంతంలో బాలసాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు ఉంచాలి. ఇలా చెయ్యటం వల్ల విద్యార్థి తన విరామ సమయాన్ని పఠనం కోసం కేటాయిస్తాడు. పఠన కేంద్రంలోని పుస్తకాన్ని ఎక్కువసార్లు చదవటం వల్ల ఆయా అంశాలకు సంబంధించిన అవగాహన పెరుగుతుంది. ఆ కథలోని పాత్రలు, వాటి స్వభావాలు, వాక్య నిర్మాణం, నూతన పదాలు, అర్థాలు మొదలైనవి తెలుసుకుంటాడు. కాబట్టి, తరగతిగదిలో ఏర్పాటుచేసే పఠనకేంద్రంలో మంచి నాణ్యత కలిగిన పుస్తకాలు, పత్రికలను ఉంచాలి.




**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 4**

1. క్రిందివానిలో పఠనాన్ని ప్రోత్సహించేది ఏది? కారణాన్ని తెలపండి.

   ఎ) ఖరీదైన పుస్తకాలు      బి) సందర్భోచిత విషయం ఉన్న పుస్తకాలు

   సి) పరిచయం ఉన్న వాక్య నిర్మాణం      డి) చదవటానికి ఉండే ఎక్కువ అవకాశాలు

2. పఠన అభ్యసనంలో 'సందర్భోచిత విషయం' ప్రాధాన్యత ఏమిటి?

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

3. తరగతిగదిలో ఉండే పఠన కేంద్రం అంటే ఏమిటి? దీనిని నీవు ఏవిధంగా ఉపయోగిస్తావు?

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

## 5.4.3 పఠన బోధన - ఉపాధ్యాయుని కర్తవ్యం

పఠన బోధన నైపుణ్యాలు, వాటిలోని పరిమితుల గురించి ఇప్పటిదాకా మనం చర్చించుకున్నాం. బాగా ప్రసిద్ధి పొందిన పఠన బోధన విధానాలు ఒక్కో సందర్భానికి ఆచరణ యోగ్యం కానప్పుడు ఏం చెయ్యాలనే సందేహం ఉపాధ్యాయుడికి కలుగుతుంది. ఈ సందర్భంలో అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ బోధన పద్ధతులు, వ్యూహాలు, విధానాలు ఏమిటనే సందేహం కలుగుతుంది. ఉపాధ్యాయుని సందేహాలు తీర్చటానికి, పఠన బోధనలో అతనికి ఉపయోగించే కొన్ని కృత్యాలను ఈ క్రింద పరిశీలిద్దాం. సంప్రదాయ పద్ధతులు ఉపయోగించే ఉపాధ్యాయులకు నూనత విధానాలు ఆశ్చర్యకరంగాను, ఆచరణకు యోగ్యం కానివిగా అనిపిస్తాయి. ఏదిఏమైనప్పటికీ ఈ నూతన నైపుణ్యాలు ఆసక్తిదాయకంగా, ప్రభావవంతంగా ఉంటాయి.

### పుస్తకాలతో ప్రారంభించంటం

సాధారణంగా మెరుపు అట్టలు (ఫ్లాష్ కార్డ్స్), చార్టులు, చెక్కతో చేసిన అక్షరాల నమూనాలు మొదలైన వాటిని ఉపయోగించటం పఠన బోధన చెయ్యటం జరుగుతుంది. కానీ, వీటన్నిటి కన్నా పుస్తకాల ద్వారా బోధన చెయ్యటం ఎంతో ఉత్తమం. అయితే పఠనానికి ఎంచుకున్న పుస్తకాలు విద్యార్థుల స్థాయికి తగినవిధంగా ఉండాలి. చార్టులు మొదలైన సామగ్రిని సందర్భానుగుణంగా ఉపయోగించాలే కానీ పుస్తకాలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించకూడదు. అయితే, ఈ సందర్భంలో ఎటువంటి పుస్తకాలు మనకు అవసరమవుతాయి? వాటిని ఎలా ఉపయోగించాలి? అనే అంశాలను ఉపాధ్యాయుడు

నోట్స్

తెలుసుకుని ఉండాలి. సాధారణంగా ప్రాథమికస్థాయి విద్యార్థులకు కథల పుస్తకాలు అంటే ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. చూడచక్కని చిత్రాలు, మంచి నాణ్యత కలిగిన ముద్రణ, చక్కటి వివరణ ఉన్న పుస్తకాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలి. కథలతో పాటు గేయాలు, పాటలు, అభినయ గేయాలు మొదలైన వాటి సాహిత్యాన్ని సేకరించి వాటిల్ని కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి.

## ప్రకాశ పఠనం (బిగ్గరగా చదవటం)

తరగతిగదిలో పుస్తకాన్ని గట్టిగా (అందరికీ వినబడే స్థాయిలో) చదవాలి. ఈ సందర్భంలో తరగతిలో మరీ ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉండకూడదు. సందర్భాన్నిబట్టి పరిమిత సంఖ్యలో విద్యార్థులను ఉపాధ్యాయుడు వృత్తాకారంలో తన చుట్టూ కూర్చోపెట్టుకోవాలి. మిగిలిన విద్యార్థులకు మరొక ఆసక్తికర కృత్యం ఇవ్వాలి. ఉపాధ్యాయుని చుట్టూ కూర్చునే విద్యార్థులు ఉపాధ్యాయుడు చదువుతున్న పుస్తకంలోని పేజీని చూడగలిగేలా ఉండాలి. పుస్తకంలోని అంశానికి ఉపాధ్యాయుడు మరికొంత వివరణనను కూడా జోడించి చెప్పవచ్చు. కొన్ని పుస్తకాలు విస్తృతమైన వివరణతో ఉంటే వాటిని సంక్షిప్తం చేసి చెప్పవచ్చు. విస్తృతమైన వివరణ, ఎక్కువ నిడివి ఉన్న కథలు విద్యార్థులకు ఆసక్తి కలిగించవు. వారు ఆ కథల మీద దృష్టి కేంద్రీకరించేవిధంగా చెయ్యవు. కొన్ని పుస్తకాల్లో పేజీకి ఒకటి లేదా రెండు వాక్యాలు మాత్రమే ఉంటాయి. ఇలాంటి సందర్భంలో ఉపాధ్యాయుడు కొంత వివరణను జోడించి చెప్పాల్సి ఉంటుంది. దీంతోపాటు పుస్తకంలోని చిత్రాలను కూడా విద్యార్థులకు చూపించాలి.

## గేయాలు పాడటం

ఊహించే సామర్థ్యం పఠనంలో ఒక అంశీభూతంగా ఉంటుంది. గేయాలు / గీతాలు ఈ సామర్థ్యాన్ని అభివృద్ధి చెయ్యటంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. తరచుగా గేయాలు వినే బాలలు, వాటిని పాడేవారు ఇతరుల కన్నా ఎక్కువగా భాషా నిర్మాణాన్ని అర్థం చేసుకోగలుగుతారు. భాషా సౌందర్యాన్ని ఆస్వాదించగలుగుతారు కూడా. గేయాలను గుర్తుంచుకోవటం చాలా తేలిక. ఏమాత్రం శ్రమ లేకుండానే వీటిని అవగాహన చేసుకుని, గుర్తుపెట్టుకోవచ్చు. పిల్లలు విభిన్నమైన ఇతివృత్తాలతో కూడిన గేయాలను ఇష్టపడతారు. అత్యంత సహజంగా ఉండే ఈ తరహా గేయాలను ఉపాధ్యాయుడు ఎంపిక చెయ్యాలి. నైతిక విలువలు బోధించే గేయాలతో పాటు పదవిన్యాసాలకు, ఆసక్తి కలిగించే అంశాలు ఉండే గేయాలకు ఎంపికలో చోటివ్వాలి. ఆటలాడే సందర్భంలో కూడా పాడుకునేందుకు వీలైన గేయాలను ఎంపిక చెయ్యాలి. సంప్రదాయ గీతాలతో పాటు జానపద గేయాలను కూడా ఈ ఎంపికలో చేర్చాలి. ఇతివృత్తాన్ని సూచించే బొమ్మలతో ఉండే గేయాలను ఎంపిక చెయ్యాలి. పైన పేర్కొన్న అన్ని అంశాలు కలగలిసి ఉండేలా చిన్న చిన్న పుస్తకాలను ఉపాధ్యాయుడు తయారుచెయ్యాలి. ఇందుకు అవసరమైతే పూర్వవిద్యార్థుల సహాయాన్ని కూడా తీసుకోవాలి. పిల్లల్ని వృత్తాకారంలో కూర్చోబెట్టి వారి మధ్యలో పుస్తకాన్ని ఉంచి గేయాన్ని లయబద్ధంగా ఒకటి రెండు సార్లు పాడించాలి. ఆ తర్వాత పుస్తకం చూడకుండా పాడించాలి. మంచి ఆసక్తి కలిగించే గేయం అయితే విద్యార్థులు వెంటనే గుర్తుపెట్టుకుని అవసరమైన సందర్భంలో గేయంలోని పదాలను ఉపయోగిస్తారు. ఉదాహరణకు కొన్ని గేయాలను పరిశీలిద్దాం.

**మాబడి**

అదిగోనండీ మాబడి

నేర్పును మాకు చక్కని నడవడి

శ్రద్ధగ చదువులు చదివెదమండి

చక్కగ కలిసి ఉంటామండి

పాఠాలెన్నో చదివామండి

పంచతంత్రం విన్నామండి

అందులో నీతి తెలిసిందండి

ఎప్పుడు తప్పులు చేయంలెండి

చక్కగ బుద్ధిగ ఉంటామండి

మంచి పనులు చేస్తామండి

కలిసి అందరం ఉంటామండి

ఆనందంగా జీవిస్తామండి

తగవులు ఎప్పుడు పడమింకండి

కలికట్టుగ ఉంటామండి

కలసి మెలసి పని చేస్తామండి

కంచుకోట నిర్మిస్తామండి

కోటకు జండా కడ్తామండి

ఆకశాన ఎగరేస్తామండి

ఆ ఎగిరేజండా మాదేనండి

అదే మా భారత జండానండి

'అఆ'ల పాట

అ ఆ లు దిద్దుదాము – అమ్మమాట విందాము

ఇ ఈ లు చదువుదాము – ఈశ్వరుని కొలుద్దాము

ఉ ఊ లను దిద్దుదాము – ఉడుతలను చూద్దాము

నోట్స్

ఎ ఏ ఐ అంటూ – అందరనూ పిలుద్దాము

ఒ ఓ ఔ అంటూ – ఓనమాలు దిద్దుదాము

అం అః అంటూ – అందరమూ ఆడుదాము

గురువుగారు చెప్పినా – పాఠాలు చదువుదాము

మామగారు చెప్పిన – మంచి పనులు చేద్దాము

తాతగారు చెప్పిన – నీతి కథలు విందాము

అందరం కలుద్దాం ఆనందంగా ఉందాం

విద్యార్థులకుఉపాధ్యాయుడు నేర్పించిన గేయాలు నచ్చితే, ఆ స్ఫూర్తితో వారు కొత్త గేయాలు రాసే ప్రయత్నం చేస్తారు. ఒక్కోసారి ఒక భాష నుంచి మరొక భాషకు గేయాన్ని అనువాదం చేస్తారు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి – 5**

1. ఈ క్రిందివానిలో దేనితో పఠన బోధన ప్రారంభించితే ప్రయోజనకరంగా ఉంటుంది?

   ఎ) మెరుపు అట్టలు బి) చార్టులు

   సి) చెక్కతో చేసిన అక్షరాకృతులు డి) పుస్తకాలు

2. సంప్రదాయ బోధన పద్ధతికి భిన్నంగా పఠన బోధనకు అనుసరించదగిన నూతన విధానాలు ఏవి? అవి విద్యార్థులకు ఏవిధంగా సహాయం చేస్తాయి?

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

3. గేయాలు బోధించటానికి తేలికైన విధానం ఏది?

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

## 5.4.4 కృత్యాలు

### అక్షరాలను గుర్తించుట

ఆసక్తికరమైన బోధన సామగ్రిని ఉపయోగించటం ద్వారా పిల్లలు వారంతట వారే అక్షరాలను సొంత విధానంలో నేర్చుకుంటారనే భావన సాధారణంగా అందరిలో ఉంటుంది. బాల్యంలో పరిసరాల్లోని

శబ్దాలను వినటం ద్వారా భాషకు సంబంధించిన ధ్వని ఉచ్చారణ నేర్చుకున్నట్లే ఇది కూడా జరుగుతుందని అనుకుంటారు. అయినప్పటికీ, కొన్ని కృత్యాల ద్వారా అక్షరాలను గుర్తింపజేసేందుకు ఉపాధ్యాయుడు ప్రయత్నించాలి. ఉదాహరణకు కథలు లేదా గేయాలను ఉపయోగించి అక్షరాలను గుర్తుపట్టే క్రీడలు నిర్వహించవచ్చు. ఒక గేయానిన నాలుగైదు సార్లు పాడించిన తర్వాత అందులోని ఏదైనా ఒక అక్షరాన్ని గుర్తించమని విద్యార్థులను అడగవచ్చు. ఆ గేయంలో వచ్చిన అక్షరాలను వరుసక్రమంలో రాయించవచ్చు. ఈ అక్షరాలతో వచ్చే కొత్త పదాలను విద్యార్థులతో రాయించాలి. నల్లబల్ల మీద ఉపాధ్యాయుడు కొన్ని పదాలను రాసి, వాటిలో గేయంలో వచ్చిన అక్షరాలను గుర్తింపజేయాలి. భాషా నిర్మాణ నియమాలను బట్టి తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషలకు ఈ విధానాల్లో కొద్ది తేడాలు ఉండవచ్చు.

## ఆచరణలోకి పఠనాన్ని తీసుకురావటం

బాగా చదవటం వచ్చిన విద్యార్థుల చేత వారు చదివిన వాక్యాన్ని ఆచరణలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేయించాలి. దీనివల్ల పఠనానికి, క్రియకు ఉన్న సంబంధాన్ని వారు అవగాహన చేసుకుంటారు. ఉపాధ్యాయుడు విద్యార్థులకు నంబర్లు కేటాయించాలి. నల్లబల్ల మీద ఒక కృత్యాన్నిరాసి, అందుకు ఒక నంబరు కేటాయించాలి. ఆ నంబరు గల విద్యార్థి ఆ పని చెయ్యాలి. ఉదాహరణకు 'బయటకు వెళ్ళి, ఎదురుగా ఉన్న గోడ వద్ద ఉన్న రాయిని తీసుకురా' – నంబరు 10 అని రాయాలి. వెంటనే 10వ నెంబరు విద్యార్థి ఆ పని చేస్తాడు. ఇలా అందరు విద్యార్థులకు ఒక్కొక్క సూచన చేసి, వారితో ఆ పని చేయించాలి. దీనివల్ల పఠనం యొక్క ప్రయోజనం నెరవేరుతుంది. నల్లబల్ల మీద రాసిన కృత్యాన్ని చదవటం, చదివిన విషయాన్ని అర్థం చేసుకోవటం, తగినవిధంగా ప్రతిస్పందించటం వంటి అనేక చర్యలు ఒకేసారి జరుగుతాయి. దీంతో పఠన ప్రయోజనం నెరవేరుతుంది.

## పదానికి ముందు – పదం తర్వాత

ఈ కృత్యం నిర్వహించటానికి ఎక్కువ సంఖ్యలో పుస్తకాలు అవసరం అవుతాయి. విద్యార్థులందరికీ ఒక్కో పుస్తకాన్ని ఇవ్వాలి. ఇప్పుడు వారందరినీ పుస్తకంలో వారికి నచ్చిన పేజీ తియ్యమని చెప్పాలి. అలా తీసిన పేజీలో 'ఎడమవైపు చివరి వాక్యంలో ఫుల్‌స్టాప్ ఉందా?' అని ప్రశ్నించాలి. ఒకవేళ ఫుల్‌స్టాప్ ఉంటే, తర్వాతి పేజీ తియ్యమని చెప్పాలి. చివరివాక్యంలో ఫుల్‌స్టాప్ లేని పదం కనిపించే వరకు పేజీలు తిప్పమని అడగాలి. ఆ పేజీలు వచ్చిన తర్వాత, ఆ పేజీ మొదటి నుంచి చివరి దాకా చదవమని చెప్పాలి. చివరి వాక్యం చదివాక, తర్వాతి పేజీ తిప్పకుండా ఆగమని చెప్పాలి. తర్వాతి పదం ఏమైఉంటుందని వారు ఊహిస్తున్నారో చెప్పించాలి. ఇప్పుడు వారు ఊహించిన పదమే తర్వాతి పేజీలో ఉన్నదో లేదో సరిచూడమని చెప్పాలి. సరైన పదాన్ని ఊహించిన విద్యార్థిని ప్రశంసించాలి. మిగిలిన విద్యార్థుల చేత చప్పట్లు కొట్టించాలి. ఇలా అనేకసార్లు చెయ్యాలి.

నోట్స్

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 6**

1. పఠన బోధనకు ఏవైనా రెండు నూతన కృత్యాలను సూచించండి.

-----------------------------------------------

-----------------------------------------------

-----------------------------------------------

2. పఠన అభ్యసనకు కృత్యాలు ఏవిధంగా దోహదం చేస్తాయి.

-----------------------------------------------

-----------------------------------------------

-----------------------------------------------

## 5.5 పఠనం, లేఖనం మధ్య సంబంధం

సాధారణంగా పఠనం, లేఖనం రెండూ వేర్వేరు సామర్థ్యాలని భావిస్తారు. లిఖితరూపంలో ఉన్న భాషలోని భావాన్ని గ్రహించటమే పఠనంగా ఇంతకుముందు చెప్పుకున్నాం. అదేవిధంగా, లేఖనం కూడా ఒక సృజనాత్మక ప్రక్రియ. మనసులోని భావాల్ని అక్షరరూపంలో వ్యక్తీకరించే విధానాన్నే లేఖనం అంటారు.

ప్రాథమికస్థాయిలో ఈ రెండు అంశాలను ఒక దాని తర్వాత మరొకటిగా నిర్వహిస్తారు. కానీ, మొదటగా విద్యార్థుల చేత పఠనం చేయించి, ఆ తర్వాత లేఖనం చేయించాలి. ఇది సనాతన భావన. ఆధునిక సిద్ధాంతాల ప్రకారం పఠన, లేఖనాలు రెండూ పరస్పరాశ్రితాలు. పరస్పరాధారితాలు కూడా. ఒకదాని మీద మరొకటి అంతర్లీనంగా ఆధారపడి, ఒకదాని వెంట మరొకటి అన్నట్లు ఈ రెండు సామర్థ్యాలు జరుగుతాయి. పఠన సామర్థ్యం లేఖన సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ రెండు సామర్థ్యాలను సంపూరకాలుగా చేసే అంశాలెన్నో ఉన్నాయి. ఈ రెండు సామర్థ్యాలు పదాలు, ఆటి అర్థాల ఆధారంగానే నిర్వహింపబడతాయి. ఏదైనా ఒక అంశాన్ని చదివేటప్పుడు పాఠకుడు ఒక్కోసారి తన పూర్వజ్ఞానం లేదా అనుభవం ఆధారంగా పదాలు మార్చి చదువుతుంటాడు. కానీ, అర్థం మాత్రం మారదు. అలాగే, లేఖకుడు కూడా తన అనుభవం ప్రకారం పదాలు మార్చి రాస్తాడు. రెండు కృత్యాల్లోను పదాలను మార్చినా అసలు భావంలో మార్పు రాదు. ఇందుకోసం పాఠకుడు, లేఖకుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటారు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 7**

1. పఠనం, లేఖనాలు రెండూ వేర్వేరు నైపుణ్యాలని ఎందుకు భావిస్తారు?

-----------------------------------------------------------

-----------------------------------------------------------

-----------------------------------------------------------

2. పఠనం, లేఖనం మధ్య ఉన్న ఉమ్మడి ప్రక్రియలేవి? వివరించండి.

-----------------------------------------------------------

-----------------------------------------------------------

-----------------------------------------------------------

## 5.6 సారాంశం

పఠనం ఒక సృజనాత్మక కృత్యం. లిఖితరూపంలో ఉన్న విషయాన్ని చదవటం మాత్రమే పఠనం కాదు. చదువుతున్న విషయంలోని సారాంశాన్ని గ్రహించటం కూడా పఠనంలో అత్యంత ముఖ్యమైన విషయంగా ఉంటుంది. సాధారణంగా మనం చదివేటప్పుడు ప్రతి పదాన్ని పూర్తిగా చూడటం సాధ్యపడదు. చదువుతున్న అంశం పట్ల సంపూర్ణ అవగాహనతో పఠనం చేస్తాము. ఊహించటం, కల్పన చెయ్యటం వంటి సామర్థ్యాలు పఠనానికి సంబంధించి ముఖ్యభావనలు కలుగజేస్తాయి. ప్రస్తుతం వాడుకలో ఉన్న పఠన బోధన విధానాల్లో అక్షరం అక్షరాన్ని చదవటం, ప్రతి పదాన్ని చదవటం, వాక్య నియమాలను గుర్తుపెట్టుకోవటం, వాటికి అనుగుణంగా చదవటం జరుగుతోంది. స్పష్టత, ధారాళతలకు పఠనంలో ముఖ్యపాత్రను ఇవ్వటం జరుగుతోంది. తరగతిగదిలో ఎంత ఎక్కువగా పఠనం చేసేందుకు అవకాశాలు కల్పిస్తే విద్యార్థులు అంతఎక్కువగా పఠన నైపుణ్యాలను సాధించగలుగుతారు. ఈ సందర్భంలో విద్యార్థులకు అర్థమయ్యే భాష, అవగాహన స్థాయి మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. అప్పుడే పఠనం ఆనందదాయక కృత్యంగా జరుగుతుంది.

## 5.7 సంప్రదింపు గ్రంథాలు


- Pandey, Lata (2008), *padhne ki dehlij par*, New Delhi, NCERT.
- NCERT, (2008) *padhne ki samajh*. New Delhi, NCERT.
- Joshi, Susheel (1989), bachhe padh kyon nahin paate, *Strote*, Eklavya.

## 5.8 భాగాంత అభ్యాసం

1. ఈ ఖండంలో నేర్చుకున్న విషయాల ఆధారంగా పఠనంలో వేటిని ముఖ్యాంశాలుగా గుర్తించవచ్చు? మీ అభిప్రాయం రాయండి.
2. పఠనం అంటే ఏమిటి? నీ అభిప్రాయం ప్రకారం శిశువు ఎప్పుడు పఠనం నేర్చుకుంటాడు?
3. బాలల్లో పఠన నైపుణ్యాలు పెంచటానికి కథలు చెప్పాల్సిన అవసరం ఉందా? నిజమే అయితే, మీ అభిప్రాయాన్ని ఉదాహరణలతో వివరించండి.
4. పఠనాన్ని ఆనందదాయకంగా మార్చటానికి ఉపయోగించదగిన కృత్యాలేవి?
5. ఉపాధ్యాయుడిగా నీ విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలు పెంచటానికి పుస్తకాలు కాకుండా ఏ ఇతర సామగ్రిని ఉపయోగిస్తావు? ఎందుకు?
6. పఠన బోధనకు ప్రస్తుతం వాడుకలో ఉన్న విధానాలను విశ్లేషించండి.
7. భాషను చిన్న చిన్న విభాగాలుగా అధ్యయనం చేయటం లేదా సంపూర్ణంగా అధ్యయనం చేయటం – ఈ రెండు విధానాల్లో ఏది ఉత్తమం? మీ అభిప్రాయాన్ని ఉదాహరణలతో సమర్థించండి.

### నియోజనాలు

1. మీ తరగతిగదిలో పఠన కేంద్రాన్ని ఏర్పాటుచేసి, విద్యార్థుల్ని ఆ కేంద్రాన్ని ఉపయోగించుకునేలా ప్రోత్సహించండి.
2. బాలలు సాధారణంగా పాడుకునే గేయాలను సేకరించండి. బాలల్లో పఠన నైపుణ్యాలను పెంచటానికి వీటిని నీవు ఎలా ఉపయోగిస్తావు?

నోట్స్

# భాగం - 6 : లేఖనం

**నిర్మాణం**


6.0 పరిచయం

6.1 అభ్యసన లక్ష్యాలు

6.2 లేఖనం - అర్థం, భావన

6.3 లేఖనం - ప్రారంభ అభ్యాసం

6.3.1 ఉత్తమ చాలక నైపుణ్యాలు

6.3.2 అక్షరాలు, పదాలు, వాక్యాలను సాధన చేయించటం

6.4 ఉత్తమ దస్తూరి (చేతిరాత)లో ఇమిడి ఉండే అంశాలు

6.4.1 స్పష్టత - మంచి దస్తూరి

6.4.2 విద్యార్థులు మంచి దస్తూరి అలవాటు చేసుకునేందుకు సహకరించటం

6.4.3 మంచి దస్తూరి - మూర్తిమత్వం

6.4.4 డిస్‌లెక్సియా, ఇతర సామర్థ్యలోపాలకు సూచికగా దస్తూరి

6.5 మంచి దస్తూరి : లక్షణాలు

6.5.1 వ్యాకరణబద్ధమైన భాష

6.5.2 పాఠకుడిని దృష్టిలో ఉంచుకోవాలి

6.5.3 సరళ భాష - సాహిత్య భాష

6.6 ప్రాథమిక తరగతుల్లో లేఖన నైపుణ్యాన్ని అభివృద్ధి చేయటం

6.7 లేఖన నైపుణ్యం - ఉన్నతస్థాయి రూపాలు

6.8 సారాంశం

6.9 సంప్రదింపు గ్రంథాలు

6.10 భాగాంత అభ్యాసం


## 6.0 పరిచయం

గత విభాగంలో శ్రవణ,ం భాషణం, పఠనం అనే మూడు భాషానైపుణ్యాలు, వాటి మధ్య గల

నోట్స్

అంతర్గత సంబంధాల గురించి తెలుసుకున్నాము. భాషా నైపుణ్యాల్లో విద్యార్థి నేర్చుకునే చివరి నైపుణ్యం – లేఖనం. లేఖనం మిగిలిన మూడు భాషా నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుంది. లేఖనాన్ని అభ్యాసం చేసేటప్పుడు 'భావ ప్రసారం', 'వ్యక్తీకరణ' అనే రెండు భాషా ధర్మాలు ప్రధాన పాత్రను పోషిస్తాయి. ఈ విభాగంలో భావప్రసార సామర్థ్యాభివృద్ధి, వ్యక్తీకరణ నైపుణ్యాల అభివృద్ధి బాలల్లో ఏవిధంగా కలుగజేయాలో తెలుసుకుందాం. అంతేకాకుండా, లేఖన బోధనకు సంబంధించిన కొన్ని వ్యూహాలు, నైపుణ్యాల గురించి తెలుసుకుందాం. ఇతర భాషా నైపుణ్యాల తీరులోనే లేఖనాన్ని కూడా పరిపూర్ణ దృక్కోణంలో అధ్యయనం, అభ్యాసం చెయ్యాలి. లేఖనం చేసేటప్పుడు మనం రాస్తున్న విషయాన్ని మనమే చదువుతాము. చదివిన దాన్ని మనమే వింటాం కూడా.

లేఖన అభ్యాసానికి కేటాయించే అనుభవాలన్నీ అర్థవంతమైనవి, ప్రభావవంతమైనవి అయినప్పుడు మాత్రమే బోధన ఫలితాలను ఇస్తుంది. ప్రాథమిక తరగతుల్లో అక్షరాలు, వ్యాకరణ నియమాల బోధనకు ఈ సూత్రం బాగా ఉపకరిస్తుంది. ఉన్నతస్థాయిలో వివిధ రకాలైన లేఖన సామర్థ్యాల బోధనకు కూడా ఈ సూత్రం దిశానిర్దేశం చేస్తుంది. తరగతిగదిలో నిర్వహించే మరికొన్ని కృత్యాలైన తప్పులు దిద్దుట, దస్తూరీపై శ్రద్ధ చూపించటం, సంకేత భాషను ఉపయోగించుట మొదలైనవన్నీ లేఖన దృక్కోణంలో నిర్వహించాలి. ఈ సూచనను ఉపాధ్యాయులు తప్పక పాటించాలి.

## 6.1 అభ్యసన లక్ష్యాలు

ఈ విభాగం పూర్తయ్యేసరికి మీరు

- లేఖనం అంటే ఏమిటో అవగాహన చేసుకుంటారు.
- శ్రవణం, భాషణం, పఠన నైపుణ్యాల మధ్యగల సంబంధాన్ని అవగాహన చేసుకుంటారు.
- మంచి దస్తూరీ అంటే ఏమిటో తెలుసుకుంటారు.
- 'మంచి రచన' అనే దృగ్విషయాన్ని అవగాహన చేసుకుంటారు.
- లేఖన బోధనకు సంబంధించి ఉపాధ్యాయుల పాత్ర ఏమిటో తెలుసుకుంటారు.
- వివిధ లేఖన రూపాల గురించి నేర్చుకుంటారు.
- లేఖన నైపుణ్యాన్ని అభివృద్ధి చేయటానికి నిర్వహించదగిన వివిధ కృత్యాల గురించి తెలుసుకుంటారు.

## 6.2 లేఖనం – అర్థం, భావన

లేఖనాన్ని బోధించటం, అభ్యాసం చేయించటం అనే విషయాలను భాషోపాధ్యాయులు అతి కష్టమైన అంశంగా భావిస్తారు. ఎందుకంటే, లేఖనం అనేది కేవలం ఒకే ఒక నైపుణ్యం కాదు. ఒకే సమయంలో విభిన్న సామర్థ్యాలను ప్రకటించగల నైపుణ్యం ఉంటేనే మంచి లేఖనం చేయగలుగుతాం.

లేఖనం చేయటానికి మొట్టమొదటగా మనకు కావలసిన సామర్థ్యం పెన్ లేదా పెన్సిల్‌ను తగిన రీతిలో పట్టుకోవటం మరియు ఇతర చాలక నైపుణ్యాలను కలిగి ఉండటం. వీటితోపాటుగా వక్త మాట్లాడిన విషయాన్ని సంకేతరూపంలో రాయగల నైపుణ్యం కలిగి ఉండాలి. ఇతరులతో లేఖన పూర్వకంగా / లేఖన రూపంలో సంభాషించేందుకు అవసరమైన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి.

లేఖనం అంటే ఏమిటి? నిఘంటువు ప్రకారం లేఖనం అంటే 'సంకేతాలను ఉపయోగించి మౌఖిక భాషకు ఒక ఆకృతిని కల్పించటం'. ఈవిధంగా రాసిన విషయం మరొక వ్యక్తి చదివి అవగాహన చేసుకునేలా ఉండాలి. ఈ నిర్వచనం సూటిగా ఉన్నప్పటికీ నిత్యజీవితంలో ఉండే అనేక అసంబద్ధతలను ఇది తొలగిస్తుంది. ఉదాహరణకు ఈ నిర్వచనం భాషకు, లేఖనానికి మధ్య ఏవిధమైన సంబంధాన్ని ప్రకటించలేదు అనుకుందాం.

అదేవిధంగా, లేఖనానికి భాషకు మధ్య గల ఆంతరిక సంబంధాన్ని నిర్వచించలేదు అనుకుందాం. అటువంటి సందర్భంలోను పాఠకుడికి భావం అవగతమవుతుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఒక కాగితం మీద ఒక చిత్రాన్ని గీశాడు అనుకుందాం. అక్కడ ఏవిధమైన వివరణ రాయకపోయినప్పటికీ ఆ చిత్రాన్ని చూడగానే పాఠకుడికి కొంత విషయం అవగాహనకు వస్తుంది. అన్నంత మాత్రాన ఆ కాగితం మీద ఉన్నది లేఖనం అని పూర్తిస్థాయిలో సమర్థించలేము.

నిఘంటువులో ఇచ్చిన అర్థం కూడా భాషణానికి, లేఖనానికి మధ్య ఉన్న ప్రధాన అనుసంధానతను పరిగణలోకి తీసుకోలేదు. భాషణం, లేఖన నైపుణ్యాలు రెండూ ఒకే సందర్భం నుంచి వచ్చినవి కావు. మానవుడి భాష కూడా ఒక క్రమపద్ధతిలో అభివృద్ధి చెందిందని చెప్పటానికి తగిన ఆధారాలు లేవు. భాషణానికి మనం ఉపయోగించే ఆర్గాన్లు 1.5 మిలియన్ సంవత్సరాల క్రితం అభివృద్ధి చెందాయి. ఈ ప్రమాణాలు కూడా పూర్తిగా నమ్మదగినవి కావు. ఏదిఏమైనప్పటికీ భాషణానికి ఉపయోగించే భాష పది లక్షల సంవత్సరాల క్రితం వాడుకలోకి వచ్చిందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, లేఖనానికి ఉపయోగించే భాషారూపం ఆవిష్కరణ జరిగి ఐదువేల సంవత్సరాలు మాత్రమే అయిందని వారు చెబుతున్నారు.

భూమి మీద ఉన్న అన్ని ప్రాంతాల్లోని మానవజాతుల్లో లేఖనం కన్నా భాషణం ముందుగా అభివృద్ధి చెందింది. ఇప్పటికీ ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోనూ లిఖిత రూపం లేకుండా కేవలం మౌఖికరూపం మాత్రమే వాడుకలో ఉన్న భాషలు ఎన్నో ఉన్నాయి. ఆదిమ మానవజాతులన్నీ సమూహాలుగా ఏర్పడి, ఆ సమూహాలు సంఖ్యాపరంగా మరింత పెద్దగా మారిన సందర్భంలో లేఖనానికి సంబంధించిన భాషారూపం క్రమంగా ఏర్పడింది. సమూహంలోని సభ్యుల సంఖ్య పెద్దదైనప్పుడు సమూహంలోని ఒకరితో మరొకరు, అలాగే, ఒక సమూహం నుంచి వేరొక సమూహంలోని సభ్యులతో భావాలను పంచుకోవటం, ఆవిధంగా పంచుకున్న భావాలను జాగ్రత్తగా భద్రపరచటం తప్పనిసరైనవి. ప్రధానంగా భూములు, ఆదాయం, వర్తకం వంటి విషయాలకు సంబంధించిన దస్త్రాలను తయారుచేయాల్సిన అవసరం ఏర్పడింది.

ఈ క్రమంలోనే మౌఖిక భాషకు లేఖనరూపాన్ని తీసుకువచ్చే ప్రయత్నాలు విజయవంతమై, భాష లేఖన రూపంలోకి ఆవిష్కృతమైంది. మౌఖికంగా ప్రకటించిన భావాలను తిరిగి మరొకరూపంలో ప్రకటించేందుకు అనువైన మార్గం లేఖనం. కాబట్టి, లేఖనం కొత్త భాషను లేదా భావాన్ని ప్రకటించలేదని స్పష్టమవుతోంది. ఒకే భాషను ప్రకటించేందుకు యోగ్యమైన మరొక రూపం మాత్రమే అయినప్పటికీ లేఖనం, భాషణాలకు మధ్య కొన్ని భేదాలు ఉన్నాయి. అవేమిటంటే...

1. లిఖితరూపంలో ఉన్న భాష శాశ్వతంగా ఉంటుంది. మౌఖికభాషకు ఈ అవకాశం లేదు. భాష పలకగానే అందులోని చివరి ధ్వని పలకటం పూర్తికావటంతోనే మౌఖికభాష అంతరించిపోతుంది. కానీ, లేఖన భాష ఆ భాష రాయటానికి ఉపయోగించిన ఉద్యమం ఉన్నంతవరకు నిలుస్తుంది. కాబట్టి, మౌఖిక పదాలు కంటికి కనిపించవు, మరియు తాత్కాలికమైవి మాత్రమే. లేఖన పదాలు కంటికి కనిపిస్తాయి. మరియు శాశ్వతంగా ఉంటాయి కూడా.

2. భాషణం జరిగే సందర్భంలో శ్రోత చాలావరకు వక్త ఎదురుగానే ఉంటాడు. ఈ సందర్భంలో వక్త మాట్లాడిన విషయం శ్రోతకు అర్థం కావటంపై అనేక అంశాలు ప్రభావం చూపిస్తాయి. చెప్పదలచుకున్న విషయంలోని వైవిధ్యం, సరళత, వక్త మాట్లాడేవిధానం, అతను ఉపయోగించే భాషారూపం మీద ప్రభావం చూపిస్తాయి. భావప్రసారం జరుగుతున్న సందర్భం, స్థానం రెండూ వక్తకు, శ్రోతకు ఇద్దరికీ అనుకూలంగా ఉండాలి. వీటన్నిటి దృష్ట్యా భాషణంలో ఉపయోగించే వాక్యాలు లేదా భాషారూపం లేఖనంలో ఉండే భాషారూపానికి భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది.

3. భాషణం చేసేటప్పుడు ఏవైనా తప్పులు దొర్లితే వాటిని అక్కడికక్కడే సరిదిద్దుకునే సౌలభ్యం ఉంది. ఇలాచెయ్యటం వల్ల శ్రోతకు అపోహ ఏర్పడకుండా నివారించవచ్చు. కానీ, ఈ సౌకర్యం లేఖనంలో ఉండదు. లేఖనం చేసేందుకు తగినంత సమయం మనకు లభిస్తుంది. కానీ, భాషణానికి ఈ అవకాశం లేదు. వీటన్నిటి దృష్ట్యా భాషణం కన్నా లేఖనాన్ని సంక్లిష్ట ప్రక్రియగా చెప్పవచ్చు.

4. మౌఖిక భాషలో తరచూ అనేకమార్పులు సంభవిస్తుంటాయి. కానీ, లిఖితభాషలో ఈ అవకాశం లేదు. లిఖితరూపంపై అనేక సాంఘిక ఒత్తిడులు ప్రభావం చూపిస్తుంటాయి. ఉదాహరణకు ఆంగ్లభాషా ప్రభావం వల్ల ఇటీవల కాలంలో తెలుగులో అనేక నూతన పదాలు వచ్చి చేరాయి. వీటన్నిటి ఉచ్చారణ అచ్చు తెలుగు కంటే కొంచెం భిన్నంగా ఉండటంతో పాటు కొన్నిసార్లు మిశ్రమభాషా పదాలుగా రూపుదిద్దుకుంటాయి. అలాగే, రోడ్, బస్ వంటి పదాలు ఆంగ్లం నుంచి తెలుగులోకి రావటంతో తెలుగు అచ్చు ఆ పదాల చివర వచ్చి చేరి, అవి ఇప్పుడు 'బస్సు', 'రోడ్డు'గా మారాయి. బాలలకు లేఖనాన్ని బోధించే సందర్భంలో ఇప్పుడు చెప్పుకున్న విషయం అతిముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ప్రారంభంలో లేఖనాన్ని అభ్యాసం చేసే విద్యార్థి

అతడు విన్న పదాల మీద ఆధారపడతాడు. అలా విన్న పదాలు లేఖనానికి అనుకూలంగా లేకపోతే విద్యార్థి సొంతంగా రాయటానికి ప్రయత్నిస్తాడు. దీంతోపాటు దోషాలు దొర్లుతాయి.

నోట్స్

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 1**

1. లేఖనం అనేది

ఎ) కొత్త భాషను ప్రాతినిధ్య పరచే మార్గం

బి) అదే భాషను మరొక రూపంలో ప్రకటిస్తుంది.

సి) ఉపాధ్యాయుల లేఖనంతో కలసి ఉంటుంది

డి) ఉపాధ్యాయుల పఠనం మీద ఆధారపడి ఉంటుంది

2. రాయటానికి ఒక వ్యక్తికి కావలసిన నైపుణ్యాలేవి?

-------------------------------------------------------

-------------------------------------------------------

-------------------------------------------------------

3. లిఖిత భాషకు, మౌఖిక భాషకు చాలా తేడా ఉంటుంది. ఎందుకు? ఈ తేడాలు రావటానికి గల కారణాలేవి?

-------------------------------------------------------

-------------------------------------------------------

-------------------------------------------------------

4. మీ తరగతిలోని ఒక విద్యార్థిని పిలిచి అతనితో పాఠ్యపుస్తకంలోని ఏదైనా ఒక పేరాని చదివించండి. చదవటం పూర్తయ్యాక అతను చదివిన విషయాన్ని రాయమని అడగండి. ఈ సందర్భంలో అతడు ఎదుర్కొనే ఇబ్బందులేమిటో గుర్తించండి. వాటిని విశ్లేషిస్తూ ఒక వ్యాసం రాయండి.

-------------------------------------------------------

-------------------------------------------------------

-------------------------------------------------------

## 6.3 లేఖనం - ప్రారంభ అభ్యాసం

### 6.3.1 ఉత్తమ చాలక నైపుణ్యాలు

లేఖనాన్ని అభ్యాసం చెయ్యటానికన్నా ముందుగా విద్యార్థి చలన నైపుణ్యాలను సాధన చెయ్యాల్సి ఉంటుంది. చలన నైపుణ్యాలు విద్యార్థులకు బాగా అలవాటు కావటానికి వారికి తగిన ప్రోత్సాహం ఇవ్వాలి. ఇంట్లో ఉండే చిన్నచిన్న వస్తువులను ఉపయోగించే నైపుణ్యం వారికి వచ్చేలా సూచనలు ఇవ్వాలి. వాటితో ఆడుకోనివ్వాలి. ఆయా వస్తువులను పట్టుకోవటం, అటు ఇటు తిప్పటం, వంచటం, గాలిలోకి ఎగురవేసి పట్టుకోవటం వంటి కృత్యాలు చెయ్యటం ద్వారా బాలలకు శారీరక కండరాలకు తగిన వ్యాయామం జరిగి, భవిష్యత్తులో లేఖన నైపుణ్య సాధనకు తగిన సన్నాహం జరుగుతుంది. విషయాన్ని వెంటనే గ్రహించే సామర్థ్యం కూడా వారిలో పెరుగుతుంది. వీటితోపాటు విద్యార్థుల్లో లేఖన నైపుణ్యాలను పెంచటానికి లేదా లేఖన నైపుణ్యాన్ని అభ్యాసం చెయ్యటానికి కన్నా ముందుగా మరొక నైపుణ్యాన్ని / అభ్యాసాన్ని విద్యార్థులతో చేయించాల్సి ఉంటుంది. అదే చిత్రకళ (బొమ్మలు వేయించటం). విద్యార్థులను బొమ్మలు గీయటానికి సన్నద్ధులను చెయ్యాలి. చిన్న చిన్న బొమ్మలు వారే స్వయంగా గీసేలా ప్రోత్సహించాలి. ప్రారంభంలో పిల్లలు గీసే బొమ్మలు అర్థం లేని గీతలుగా అనిపించవచ్చు. కానీ, అవే భవిష్యత్తులో ఆ విద్యార్థి వివిధ ఆకృతులు గీయటానికి ప్రాతిపదికలుగా నిలుస్తాయి. ఘనకారపు వస్తువులతో ఆడటం, బొమ్మలు గీయటంతో పాటు బాలల చేత మరికొన్ని నైపుణ్యాలను కూడా సాధనచేయించాల్సి ఉంటుంది. ఏదైనా గిన్నె లేదా సీసాలోకి నీరు పోయించటం, మొక్కల నుండి పువ్వులు కోయించటం, మట్టితో వివిధ ఆకృతులు తయారుచేయించటం వంటి కృత్యాలు కూడా బాలలతో చేయించాలి. ఇవన్నీ విద్యార్థుల్లో కండర / చలన నైపుణ్యాలను పెంచుతాయి. కండరాలకు తగిన వ్యాయామం లభించి, వివిధ పనులు చెయ్యటానికి తగిన శక్తి / నైపుణ్యాన్ని అవి పొందుతాయి. ఈ కృత్యాలన్నీ విద్యార్థి ఇంట్లోనే చేసుకోవచ్చు. ఇంట్లో ఉండే సాధారణ వస్తువులతోనే ఈ తరహా కృత్యాలు మరిన్ని చెయ్యవచ్చు. అయితే, అన్ని కుటుంబాల్లోనూ ఈ తరహా అవకాశాలు ఉంటాయని చెప్పలేము. అలాగే, పరిస్థితులు కూడా ఒక్కోసారి బాలలకు అనుకూలంగా లేకపోవచ్చు. వీటన్నిటిదృష్ట్యా ఉపాధ్యాయుడు లేఖనానికి పూర్వమే విద్యార్థిలో చాలక నైపుణ్యాలు కలిగేలా కొన్ని కృత్యాలు వారి చేత చేయించాలి.

### 6.3.2 అక్షరాలు, పదాలు, వాక్యాలను సాధన చేయించటం

ముందుగా అక్షరాలు, ఆ తర్వాత క్రమంగా పదాలు పదే పదే రాయించటం ద్వారా విద్యార్థులు వాక్యాలను రాసే నైపుణ్యాన్ని పొందుతారనేది సనాతన భావన. కొన్ని సందర్భాల్లో ఈ భావన నిజం కూడా. కానీ, ఒకే అక్షరాన్ని లేదా పదాన్ని అనేకసార్లు దిద్దించటం లేదా రాయించటం వల్ల విద్యార్థికి విసుగు కలుగుతుంది. దీనివల్ల వారిలో 'రాయటం' అంటేనే విముఖత / విరక్తి ఏర్పడుతుంది. కాబట్టి, విద్యార్థులకు ఏం దిద్దుతున్నామో / రాస్తున్నామో, ఆ పదాల అర్థం ఏమిటో తెలయకుండా రాయటం వల్ల ఏవిధమైన ప్రయోజనం నెరవేరదు. రాస్తున్న పదాలు, వాక్యంలో ఉన్న ఆ పదాల మధ్య సంబంధం

ఏమిటో తెలియకుండా పిల్లల చేత అక్షరాలు, పదాలు దిద్దించటం వల్ల ఏవిధమైన ప్రయోజనం ఉండదు.

విద్యార్థులకు లేఖన నైపుణ్యాన్ని బోధించే సందర్భంలో ఉపాధ్యాయుడు ప్రధానంగా రెండు విషయాలు గుర్తుంచుకోవాలి. అవి 1. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించటం, అభినందించటం 2. అభ్యసన చెయ్యటానికి అర్థవంతమైన సందర్భాన్ని / వాతావరణాన్ని ఏర్పాటుచెయ్యటం. విద్యార్థులకు భాష నేర్చుకునే సామర్థ్యం సహజాతంగా వస్తుంది. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తించి, వారిని అభినందించాలి. అర్థవంతమైన సాంఘిక అనుభవాల ద్వారా, సహజాతంగా వచ్చిన శ్రవణ, భాషణ నైపుణ్యాల ద్వారా బాలలు భాషను నేర్చుకుంటారు. అదేవిధంగా, బోధనకు ఉపాధ్యాయుడు ఉపయోగించే ముద్రిత భాషను గమనించటం ద్వారా, ఇతర అర్థవంతమైన సామాజిక అనుభవాల ద్వారా లేఖనానికి సంబంధించిన నియమాలను కూడా వారు సహజంగా నేర్చుకుంటారు. ఈ సామర్థ్యం కూడా వారికి సహజాతంగా వస్తుంది. సర్వసాధారణంగా ఉపాధ్యాయుల్లో ఒక ఆపోహ ఉంటుంది. అదేమిటంటే – విద్యార్థులకు ప్రతి చిన్న విషయం కూడా వివరించాలి లేదా నేర్పించాలి. లేకపోతే వారు ఏ విషయమూ నేర్చుకోలేరు. ఇది పూర్తిగా నిజం కాదు. ఉపాధ్యాయులు ఈవిధమైన అసంబద్ధ దృష్టికోణాన్ని విడిచిపెట్టి, విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి, వారిని ప్రశంసించే గుణాన్ని పెంపొందించుకోవాలి. బడికి రావటానికి పూర్వమే రాసే (లేఖన) నైపుణ్యం విద్యార్థులకు ఉంటుంది. బాలల్ని నిశితంగా గమనించండి – ఆటలాడుకునే సందర్భంలో వారు ఇసుకలో (తో) రకరకాల బొమ్మలు గీస్తారు (తయారుచేస్తారు కూడా). అలాగే, కాగితాల మీద ఏవో బొమ్మలు గీసి, వాటితో కథలు కూడా అల్లుతారు. నేల మీద కూడా సుద్దముక్కతో రకరకాల గీతలు, గుర్తులు వేస్తారు. వారికి వచ్చిన రీతలో ఏవో బొమ్మలు కూడా గీస్తారు. మనకు ఆ చిత్రాలు, గీతలు అర్థంలేనివిగా అనిపించవచ్చు. కానీ, విద్యార్థులు వారిలోని భావాలను వ్యక్తం చెయ్యటానికి అవి ఉత్తమ వేదికగా నిలుస్తాయి. అదొక విచిత్ర లిపి. పిల్లలకు మాత్రమే లేదా వారు మాత్రమే రాయగలిగిన లిపి అది. దాని ద్వారానే బాలలు తమ మనోభావాలు వ్యక్తీకరిస్తారు. ఈవిధంగా బాలలకు వారిలోని ఆలోచనలు, నైపుణ్యాలను వ్యక్తీకరించేందుకు, వారి సామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకునేందుకు తగినన్ని అవకాశాలు కల్పించాలి. బాలల చర్యల్ని పరిశీలించినప్పుడు చిన్నచిన్న భావనలను సంయోజనం చెయ్యటం ద్వారా వారిలో జ్ఞానం నిర్మాణం జరుగుతుందని అనిపిస్తుంది. కానీ, అది వాస్తవం కాదు. నిజానికి, ఇందుకు వ్యతిరేక ప్రక్రియ జరుగుతుంది. ఎలాగంటే, బాలల్లో మొదట పూర్తి భావన ఏర్పడుతుంది. ఈ భావనను స్పష్టపరచటానికి చిన్న చిన్న అంశాల ద్వారా అవగాహన చేసుకోవటం, వ్యక్తీకరించటం జరుగుతుంది. ఉదాహరణకు ఒక వాక్యం తీసుకుందాం. ఆ వాక్యం, దాని అర్థం పట్ల అవగాహన లేకపోతే విద్యార్థులు రాసే ఒక్కొక్క అక్షరం లేదా పదం ఏవిధమైన ప్రయోజనాన్ని ఇవ్వవు. కాబట్టి, విద్యార్థులకు లేఖన నైపుణ్య బోధన / సాధన విషయంలో తగినంత అర్థవంతమైన కృత్యాలు ఇవ్వకపోతే, లేఖనం విసుగుపుట్టించే ప్రక్రియగా మిగిలిపోతుంది.

నోట్స్

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 2**

1. అభ్యసన ప్రక్రియ ఏవిధంగా ఏర్పడుతుంది?

   ఎ) చిన్న చిన్న భావనలను కలుపుకుని అంతిమంగా పూర్తి భావన పొందటం ద్వారా

   బి) పూర్తిభావనను ఒకేసారి కలిగి ఉండి, చిన్నచిన్న భాగాల ద్వారా దానిని స్పష్టపరచటం ద్వారా

   సి) గుర్తుపెట్టుకోవటం ద్వారా డి) చిత్రాలు గీయటం ద్వారా

2. పాఠశాలకు వెళ్ళటానికి పూర్వం బాలలు ఇంట్లో గీసే చిత్రాలు, గుర్తులు మనకు ఏం తెలియజేస్తాయి?

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

3. 'ఉత్తమ చాలక నైపుణ్యాలు' అంటే ఏమిటి? విద్యార్థుల్లో ఈ నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చెయ్యవచ్చు?

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

4. అక్షరాలను దిద్దించే విధానం ద్వారా లేఖనాన్ని బోధించే విధానంలో ఉన్న సమస్యలేవి?

   ---------------------------------------------------

   ---------------------------------------------------

   ---------------------------------------------------

## 6.4 ఉత్తమ దస్తూరి (చేతిరాత)లో ఇమిడి ఉండే అంశాలు

విద్యార్థులు రాయటం ప్రారంభించినప్పటి నుంచి మనం (ఉపాధ్యాయులు) వారి చేతరాత అందంగా ఉండాలని కోరుకుంటాం. అందుకు అనుగుణంగానే వారికి అనేక సూచనలు కూడా చేస్తుంటాం. లేఖనం విషయంలో స్పష్టత చాలా అవసరం. అలాగే, విద్యార్థి రాసిన పదం లేదా వాక్యానికి సరైన అర్థం ఉండటం కూడా అంతే అవసరం. నిజానికి స్పష్టతను మించి అర్థానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. పై గడిలో ఉన్న అక్షరం లేదా పదాన్ని చూసి విద్యార్థి చాలా అందంగా ఆ పదాన్ని లేదా అక్షరాన్ని తిరిగి రాయవచ్చు. అయితే, రాసిన విషయం అతడికి ఎంతవరకు అర్థమైందనేదే అసలు ప్రశ్న.

### 6.4.1 స్పష్టత – మంచి దస్తూరి

ప్రాథమిక తరగతుల్లో ఉపాధ్యాయులు 'మంచి దస్తూరి'తో పాటు అందంగా తీర్చిదిద్దినట్లు ఉండే అక్షరాల పొందిక మీద ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తారు. నిజానికి, ఎంత బాగా రాసారు అనే విషయం కన్నా రాసింది వారికి ఎంతవరకు అర్థమైందన్న విషయానికి చాలా ప్రాధాన్యత ఉంది. రాసిన విషయం విద్యార్థిని ఎంతవరకు ప్రభావితం చేసి, ఏవిధమైన జ్ఞానాన్ని అందించిందనే విషయమే అందమైన దస్తూరి అసలైన నిర్వచనం. చదవటానికి అతి తేలికగా ఉండటం, స్పష్టంగా ఉండటం వల్ల గుండ్రని దస్తూరి అందరి మన్నన పొందుతుంది. ఒక వ్యక్తి దస్తూరి చాలా గుండ్రంగా, పొందికగా, అందంగా ఉన్నంతమాత్రాన అతడు చాలా ఎక్కువ గ్రహణశక్తి కలిగినవాడుగా అంచనా వెయ్యలేము. దస్తూరికి, గ్రహణశక్తికి ఏమాత్రం సంబంధం లేదు. అలాగే భాషా గ్రహణశక్తికి, దస్తూరికి ఏవిధమైన సంబంధం లేదు. ఇవన్నీ విభిన్న / స్వతంత్ర అంశాలు. అందమైన దస్తూరి కలిగిన వ్యక్తికి భాషా గ్రహణశక్తి / భాషాజ్ఞానం ఎక్కువగా ఉంటుందని గాని, దస్తూరి అందంగా లేని వ్యక్తి భాషా గ్రహణశక్తి / భాషాజ్ఞానం తక్కువగా ఉంటుందని గానీ చెప్పలేం. తాను చెప్పినవిధంగా లేదా తరగతిలోని పిల్లలందరూ ఒకేవిధంగా (అందమైన దస్తూరి) రాయాలని ఉపాధ్యాయుడు భావించకూడదు. ప్రతి విద్యార్థికి అతనికి అనుగుణమైన సొంత దస్తూరి విధానం ఉంటుంది. ఇది అతడికి సహజాతంగా వస్తుంది. కాబట్టి, అక్షరాల ఆకృతుల కన్నా అవి అందించే జ్ఞానం మీద ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి. అలాగని, మంచి దస్తూరి కోసం ప్రయత్నించవద్దని కాదు. విద్యార్థులకు చక్కటి దస్తూరిని అలవాటు చేస్తూనే, విషయ గ్రహణం, జ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వైయుక్తిక భేదాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల చేత లేఖన సాధన చేయించాలి.

### 6.4.2 విద్యార్థులు మంచి దస్తూరి అలవాటు చేసుకునేందుకు సహకరించటం

మంచి చాలక నైపుణ్యాలు, నడుము నిటారుగా నిలిపే విధానం, కూర్చునే భంగిమ, పెన్సిల్‌ను పట్టుకునే విధానం, భుజాలను స్థిరంగా ఉంచే విధానం మొదలైన ప్రాథమిక అంశాల్లో తగిన శిక్షణ, సూచనలు చెయ్యటం ద్వారా విద్యార్థులు మంచి దస్తూరిని అలవాటు చేసుకునేందుకు సహకరించవచ్చు. సందర్భాన్ని బట్టి ఉపాధ్యాయుడు కొన్ని ప్రత్యేక ఆసక్తికర, సృజనాత్మక వ్యూహాలు, పద్ధతులను అమలుచెయ్యటం ద్వారా కొన్ని అక్షరాలు రాసేవిధానాన్ని ఉపాధ్యాయుడు విద్యార్థులకు నేర్పించవచ్చు. పదక్రీడల ద్వారా విద్యార్థుల లేఖనంలోని దోషాలు సరిచేయవచ్చు. ఉదాహరణకు అక్షరాల పరిమాణం, పదానికి పదానికి మధ్యలో ఇచ్చే ఖాళీ మొదలైన అంశాల్లో వచ్చే దోషాలను పదక్రీడల ద్వారా సరిచేయవచ్చు. ఉదాహరణకు ఒక విద్యార్థి ఒక్కో అక్షరాన్ని ఒక్కో పరిమాణంలో రాస్తున్నాడని అనుకుందాం. చిన్న చిన్న వృత్తాలు గీచి, అందులోనే అక్షరాలు రాయమనటం ద్వారా ఉపాధ్యాయుడు విద్యార్థుల లేఖనంలో ఉండే దోషాలను సరిచేయవచ్చు. అలాగే, విద్యార్థులకు అర్థమయ్యే చిన్న చిన్న పదాలను మాత్రమే లేఖన అభ్యాసాలుగా ఇవ్వాలి. ఇలా చేసినప్పుడు మాత్రమే విద్యార్థులు తాము రాస్తున్న పదాల పరిమాణం, ఆకృతి మొదలైన విషయాల కన్నా వారు రాస్తున్న పదానికి అర్థాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తారు.

నోట్స్

### 6.4.3 మంచి దస్తూరి - మూర్తిమత్వం

దస్తూరి అందంగా (కుదురుగా) లేని విద్యార్థుల మూర్తిమత్వం కూడా సరిగ్గా ఉండదని కొందరు ఉపాధ్యాయులు భావిస్తుంటారు. ఈ భావనతోనే మంచి దస్తూరీ లేని విద్యార్థుల చేత అదేపనిగా పదాలు / అక్షరాలను రాయిస్తుంటారు. కానీ, ఈ సందర్భంలో ఉపాధ్యాయులు ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాల్సి ఉంటుంది. ఎటువంటి అవగాహన లేకుండా, కేవలం రాసిన దాని మీదే రాసే విధానం చాలా కష్టంతో కూడుకుని ఉంటుంది. ఈ విధానం విద్యార్థులకు విసుగు పుట్టిస్తుంది. అంతేకాదు... ఏవిధమైన ప్రయోజనాన్ని ఇవ్వదుకూడా. దస్తూరి ఏవిధంగానూ మూర్తిమత్వాన్ని ప్రభావితం చెయ్యదు కాబట్టి మూర్తిమత్వాన్ని అభివృద్ధి చెయ్యాలనే ఆశయంతో దస్తూరిని తీర్చిదిద్దాలని ప్రయత్నించటం వల్ల ప్రయోజనం ఉండదు. దస్తూరీలో వచ్చే ఆశించదగిన మార్పు మూర్తిమత్వాన్ని అభివృద్ధి చెయ్యదు. మంచి దస్తూరి వల్ల పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయి. ఇది లేఖనం పట్ల ఆసక్తిలేని విద్యార్థులకు స్ఫూర్తి కలిగిస్తుంది. కాబట్టి, లేఖనాన్ని ఆసక్తికరంగా, అర్థవంతంగా చేసే కృత్యాలు నిర్వహించటానికే ఉపాధ్యాయులు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి.

### 6.4.4 డిస్‌లెక్సియా, ఇతర సామర్థ్యలోపాలకు సూచికగా దస్తూరి

పఠనంలో ఉండే అసంబద్ధత, లోపాలను డిస్‌లెక్సియాగా వ్యవహరిస్తారు. నిజానికి ప్రతి వ్యక్తీ పఠనంలో ఎంతో కొంత తడబడుతూనే ఉంటాడు. ఏవో కొన్ని తప్పులు చదువుతాడు. కాబట్టి, ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ డిస్‌లెక్సియా ఉన్న వ్యక్తే అవుతాడు. అయితే, కొందరు విద్యార్థులు మాత్రం మరింత ఎక్కువగా పఠన సమస్యలతో బాధపడుతుంటారు. రాసేందుకు అన్ని వనరులు అందుబాటులో ఉన్నప్పుడు కూడా లేఖనంలో ఇబ్బందులు ఎదుర్కొనే విద్యార్థులను కూడా డిస్‌లెక్సియాతో బాధపడే విద్యార్థులుగా గుర్తించటం జరుగుతుంది. ఉదాహరణకు ఉపాధ్యాయుడు ఒక చిత్రాన్ని చూపించి, ఆ చిత్రం గురించి రాయమని అడిగాడనుకుందాం. డిస్‌లెక్సియాతో బాధపడే విద్యార్థులు మొత్తం చిత్రాన్ని గమనిస్తారు కానీ అందులోని భాగాలను గుర్తించలేరు. దీనివల్ల వారికి లేఖనంలో సమస్యలు ఏర్పడతాయి. డిస్‌లెక్సియాతో బాధపడే విద్యార్థుల చేతిరాత సరిగ్గా ఉండదు. వారు రాసే అక్షరాలు ఒక తీరుగా ఉండవు. వివిధ ఆకృతుల్లో, పరిమాణాల్లో ఉంటాయి. స్పష్టత ఉండదు. కాబట్టి, ఈ విద్యార్థులు రాసిన విషయాన్ని అర్థం చేసుకోవటం చాలా కష్టమవుతుంది. అలాగే, ఈ విద్యార్థులు కూడా రాత (లేఖన) పరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటారు. అక్షరాలను చూసి కూడా రాయలేకపోతారు. ఒక్కోసారి విద్యార్థులు రాసే (లేఖన) సమయంలో వారు కూర్చునే భంగిమ కూడా దస్తూరీ మీద ప్రభావం చూపిస్తుంది.

డిస్‌లెక్సియా ఒక్కోసారి దాని లక్షణాలను కొన్ని ఇతర లక్షణాలతో పంచుకుంటుంది. డిస్‌ప్రాక్సియా, దృష్టి- అవగాహన నైపుణ్యంలో లోపాలు వంటివి కూడా డిస్‌లెక్సియా కారణంగా ఏర్పడే అవకాశం ఉంది. ఈ ఇతర లక్షణాలను గుర్తించినంత మాత్రాన విద్యార్థికి డిస్‌లెక్సియా సమస్య ఉందని భావించకూడదు. తరగతిలోని ఏ విద్యార్థికైనా ప్రత్యేక అవసరం లేదా సహాయం కావలసిన పరిస్థితి ఏర్పడితే, వెంటనే నిర్ణయాలు తీసుకోకుండా, వృత్తి చికిత్సకులను సంప్రదించాలి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 3**

1. డిస్‌లెక్సియా కలిగిన వ్యక్తి

   ఎ) పూర్తి చిత్రాన్ని అన్ని సందర్భాల్లోనూ చూడగలుగుతాడు   బి) చిత్రాలను చూడలేడు

   సి) చిన్న చిన్న భాగాలను చూసి పూర్తి చిత్రాన్ని అవగాహన చేసుకుంటాడు

   డి) చిత్రాలను గీయలేడు.

2. రాసే సందర్భంలో కాగితం మీద చెయ్యి ఉంచిన భంగిమ, పెన్సిల్‌ను పట్టుకునే తీరు దస్తూరీపై చూపించే ప్రభావాన్ని విశ్లేషించండి.

3. ప్రత్యేక / విభిన్న పద్ధతుల్లో అక్షరాలను నేర్పించటం ద్వారా లేఖనాన్ని ఆసక్తికరంగా తీర్చిదిద్దే విధానాల గురించి విశ్లేషించండి. అలాంటి కృత్యాలను మీరూ తయారుచేయండి. విద్యార్థుల్లో లేఖన దోషాలు సవరించేందుకు తగిన అభ్యాసాలను తయారుచేయండి.

4. అసంబద్ధంగా, అక్రమాకారంలో, స్పష్టమైన దస్తూరీ లేని విద్యార్థి నీ తరగతి ఉన్నాడనుకుందాం. ఉపాధ్యాయుడిగా నీవు ఏవిధమైన చర్యలు తీసుకుంటావు? వివరించండి.

## 6.5 మంచి దస్తూరి : లక్షణాలు

లిఖిత రూపంలో ఉండే భాష కొన్ని భాషా సూత్రాలు, వ్యాకరణ నియమాలకు అనుగుణంగా ఉంటుంది. ఉండాలి కూడా. మాట్లాడే సందర్భంలో మనం మాట్లాడిన విషయంలో శ్రోతకు ఏవైనా సందేహాలు వస్తే వాటిని తీర్చేందుకు అవకాశం ఉంటుంది. లిఖితరూపంలో ఈవిధమైన అవకాశం ఉండదు. మాట్లాడే భాష, లిఖిత భాష - ఈ రెండు భాషా రూపాల నిర్మాణంలో అనేక తేడాలు ఉంటాయి. ఈ తేడాలు విద్యార్థుల లేఖనం మీద ప్రభావం చూపిస్తాయి. వాక్కు లేఖనానికి ప్రాతిపదికగా

ఉంటుంది. కాబట్టి, వాక్కు యొక్క ప్రభావం లేఖనం మీద ఉంటుంది. విరామచిహ్నాలు, స్పెల్లింగ్ వంటి కొన్ని భాషా లక్షణాలు లేఖనానికి సంబంధించినవి. ఒకవేళ ఉపాధ్యాయుడు విద్యార్థులు భాషణం చేస్తున్నప్పుడు ఈ విషయాల మీద ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తే, ఆ ప్రభావం విద్యార్థి లేఖనం మీద పడే అవకాశం ఉంది. వీటివల్ల ఒక్కోసారి విద్యార్థి లేఖనం పట్ల నిరుత్సాహం ప్రకటించే అవకాశం కూడా ఉంది. కాబట్టి, ప్రాథమిక దశల్లో విద్యార్థులు ఏవిధంగా రాయాలని అనుకుంటున్నారో వారిని ఆవిధంగానే రాసేందుకు అనుమతించాలి. తర్వాతి దశల్లో లేఖనంలో కచ్చితత్వాన్ని తీసుకురావచ్చు.

చతుర్విధ భాషా నైపుణ్యాల్లో లేఖనం చాలా క్లిష్టమైన ప్రక్రియ. లేఖన నైపుణ్యంలో సాధికారత సాధించాలంటే పద సంపద, వ్యాకరణం, వాక్యనిర్మాణం వంటి విషయాల్లో మంచి పట్టు ఉండాలి. విద్యార్థులు చిన్న పేరాగ్రాఫ్‌లు రాయాలన్నా, ఆ పేరాగ్రాఫ్‌ల్లోని వివిధ వాక్యాల మధ్య అనుసంధానం ఉండేలా జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. మరోవిధంగా చెప్పాలంటే, ఒక విద్యార్థి ఒక పేరాగ్రాఫ్ రాసే నైపుణ్యాన్ని సాధించాడంటే, వివిధ వాక్యాల మధ్య అనుసంధానం చెయ్యగలిగిన సామర్థ్యం అతనికి వచ్చిందని భావించవచ్చు. ఇవన్నీ విద్యార్థిలో ఏర్పడే భావప్రకటన సామర్థ్యాన్ని సూచిస్తాయి. 'అర్థం' భాషలో అంతర్భాగంగా ఉంటుంది. కాబట్టి, లేఖనం విషయంలో విద్యార్థి మరింత ఎక్కువ శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే, రాసిన విషయంలో ఏవైనా భావదోషాలు ఉన్నా, లేక లేఖకుడు చెప్పదలచుకున్న భావం పూర్తిగా రాసిన పంక్తుల్లో లేకపోయినా, ఆ దోషాన్ని సవరించుకునే అవకాశం లేఖకుడికి ఉండదు. లేఖకుడు, పాఠకుడు ఎదురెదురుగా ఉండే అవకాశం లేదు కాబట్టి లేఖకుడు భాష విషయంలో మరింత ఎక్కువ శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. చిందరవందరగా ఉన్న ఆలోచనలకు సరైన ఆకృతి కల్పించి, వాటిని అర్థవంతమైన భాషను ఉపయోగించటం ద్వారా పాఠకుడికి అందజేయటం లేఖనంలో ప్రధానాంశంగా ఉంటుంది. అర్థవంతమైన భావ వ్యక్తీకరణ, సమాచార ప్రసారం లేఖనంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అయితే, తప్పులు లేకుండా రాయాలనే ఆలోచన / లక్ష్యం కారణంగా ఒక్కోసారి పైన పేర్కొన్న ప్రధానాంశాలు మరుగునపడే అవకాశం ఉంది.

## 6.5.1 వ్యాకరణబద్ధమైన భాష

పిల్లల లేఖనం విషయంలో సాధారణంగా ఉపాధ్యాయులు స్పెల్లింగ్, వ్యాకరణ తప్పులపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తారు. భాషణ, లేఖన విషయాల్లో పిల్లలు ఎక్కువగా ఈ తరహా తప్పులు చేస్తుంటారని ఉపాధ్యాయులు భావిస్తారు. నిజానికి, బాలలే కాదు పెద్దల్లో కూడా ఏ ఒక్కరూ ఏ ఒక్క తప్పు లేకుండా మాట్లాడలేరు. రాయలేరు కూడా. సంక్లిష్ట వాక్యాలు మాట్లాడేటప్పుడు, రాసేటప్పుడు తప్పులు దొర్లే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది.

సాధారణంగా అన్ని సందర్భాల్లోనూ మన నోటి నుంచే వెలువడే ధ్వనికి, రాసే అక్షరాకృతికి ఏవిధమైన సంబంధం ఉండదని గుర్తించాలి. ఈ లక్షణం కారణంగా బాలలు విభిన్నమైన ఆకృతుల్లో అక్షరాలు రాస్తుంటారు. భాషకు సంబంధించి మరొక ముఖ్యమైన లక్షణం ఏమిటంటే సామాజిక పరంగా, ప్రాంతపరంగా భాషలో అనేకమైన మార్పులు ఉంటాయి. ఒకే పదాన్ని ఒక్కో సామాజిక

నేపథ్యం నుంచి వచ్చిన పిల్లలు ఒక్కో రకంగా పలుకుతారు. ఉదాహరణకు గోదావరి జిల్లాలో 'సర్పవరం' పేరుతో ప్రసిద్ధ క్షేత్రం ఉంది. గ్రామీణులు ఈ పేరును 'సర్పారం' అంటారు. పట్టణ ప్రజలు ఆ పదాన్ని పూర్తిగా 'సర్పవరం' అని పలుకుతారు. మరో ఉదాహరణ ఏమిటంటే 'శనగపప్పు' అనే పదాన్ని కొన్ని వర్గాల ప్రజలు 'చనగపప్పు' అని పలుకుతారు. ఈ భేదాలను దోషాలుగా గుర్తించకూడదు. విద్యార్థులు నేర్చుకునే క్రమంలో బహిర్గతమైన ప్రాంత, సామాజిక భేదాలుగా వీటిని గుర్తించి, విద్యార్థులకు సహకరించాలి.

అలాగే, మరికొన్ని ఉదాహరణలు కూడా చెప్పుకోవచ్చు. నెల్లూరు ప్రాంతంలో పెద్దలను కూడా 'నువ్వు' అని పిలుస్తారు. అదే కృష్ణా, గుంటూరు ప్రాంతాల్లో 'మీరు' అంటారు. నెల్లూరు వ్యక్తి గుంటూరు వచ్చినప్పుడు ఎవరైనా పెద్దవారితో మాట్లాడుతూ ఆయన్ను 'నువ్వు' అని సంబోధించాడనుకుందాం. అప్పుడావ్యక్తి తనను నెల్లూరు వ్యక్తి కించపరిచాడని భావించకూడదు. అలాగే, సొరకాయను కొన్ని ప్రాంతాల్లో ఆనపకాయ అంటారు. గోధుమరవ్వను దుడ్డు రవ్వ అంటారు. ఇవన్నీ ప్రాంత, కాల, ఆచార, వృత్తి భేదాల కారణంగా ఏర్పడినవే తప్ప విద్యార్థులు చేసే దోషాలు కావు. పిల్లల్లో ఉండే ఈ విధమైన భేదాలను గుర్తించి ప్రోత్సహించవలసిన బాధ్యత ఉపాధ్యాయుడి మీద ఉంది. ఇలా చేయకపోగా, విద్యార్థుల భాషలో తప్పులు వెదుకుతూ, వారి భాషా వైవిధ్యాన్ని అవహేళన చేస్తే, వారు చదువుకు దూరంగా వెళ్ళిపోతారు.

విద్యార్థులకు సరైన స్పెల్లింగ్, వ్యాకరణ నియమాలు నేర్పించటానికి వారికి ఆసక్తి కలిగించేలా లేఖన అభ్యాసాలు / కృత్యాలు ఇవ్వాలి. విభిన్నమైన సందర్భాల్లో రాసే కృత్యాలు కూడా వారితో చేయించాలి. ఏవిధమైన అక్షర దోషాలు లేకుండా, వ్యాకరణ నియమాలకు అనుగుణంగా రాసే భాష పిల్లలకు ఆసక్తి కలిగించకపోవచ్చు. వారి దృష్టిలో మంచి భాష అంటే ఆసక్తికరంగా ఉండి, సంతృప్తికరంగా భావప్రసారం చేసేది మాత్రమే.

## 6.5.2 పాఠకుడిని దృష్టిలో ఉంచుకోవాలి

మనం రాసే ప్రతి విషయం చదవటానికి వీలుగా ఉండాలి. లేదా, చదవటానికి వీలుగా ఉండేవిధంగానే రాస్తాము. ఇతరులు కాకపోయినా, కనీసం మనం రాసిన విషయం మనమైనా చదివేందుకు వీలుగా ఉండాలి. మనం రాసిన విషయాన్ని ఏ వ్యక్తి చదువుతాడో, ఆ వ్యక్తిని దృష్టిలో ఉంచుకుని కూడా ఒక్కోసారి మనం రాస్తుంటాం. అదేవిధంగా, మనం రాసే విషయాన్ని చదివే పాఠకుడి స్థాయి (లేదా అతడి మీద మనకున్న అభిప్రాయం ఆధారంగా) మనం రాసే విషయంలో వ్యాకరణం, పదాల ఎంపిక, కూర్పు, రాసే శైలి మొదలైన విషయాలను ప్రభావితం చేస్తుంది. ఉపాధ్యాయుడు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని విభిన్నమైన లేఖన అభ్యాసాలను ఎంపిక చెయ్యాలి. రాయటానికి ముందుగానే తన పాఠకుడి గురించి విద్యార్థి ఆలోచించేలా ఉపాధ్యాయుడు వారికి తర్ఫీదు ఇవ్వాలి. లేదా ఈ తరహా కృత్యాలను తయారుచేసి విద్యార్థులకు లేఖన అభ్యాసాలుగా ఇవ్వాలి. ఇలాచెయ్యటం వల్ల విభిన్న పాఠకుల కోసం విభిన్న శైలులతో రాయటం, లేదా, పాఠకులందరినీ

ఆకట్టుకునేలా రాయటం పిల్లలకు అలవాటు అవుతుంది. ఉదాహరణకు పిల్లలు తల్లిదండ్రులకు రాసే లేఖను తీసుకుందాం. తమ చదువు గురించి, పరీక్షల గురించి హాస్టల్‌లో ఉన్న ఓ విద్యార్థి తన తల్లిదండ్రులకు ఉత్తరం రాశాడనుకుందాం. ఇదే విషయంతో తన మిత్రులకు కూడా ఉత్తరం రాశాడనుకుందాం. ఈ రెండు ఉత్తరాలను పరిశీలించితే మనకు ఒక విషయం బోధపడుతుంది. అదేమిటంటే... రాసిన రెండు ఉత్తరాల్లో ప్రధానాంశం ఒకటే. ఒకే విషయం మీద ఒకే వ్యక్తి ఇద్దరు విభిన్న వ్యక్తులకు లేఖ రాశాడు. నిశితంగా పరిశీలిస్తే, ఈ రెండు లేఖల్లో ఉపయోగించిన భాష, శైలి వేర్వేరుగా ఉంటాయి.

## సరళత, సంక్షిప్తత

తేటతనం (సరళత), స్పష్టంగా రాయటం అనే రెండు లక్షణాలు లేఖనానికి తప్పనిసరిగా ఉండాలి. ఎందుకంటే, ఏ రచయిత అయినా పాఠకుడి మనస్సుకు, ఆలోచనలకు, చదవటానికి ఇబ్బందిలేకుండా ఉండేలా రచన చెయ్యాలని కోరుకుంటాడు. ఈ క్రమంలో పైన పేర్కొన్న రెండు లక్షణాలు లేఖనానికి ఉండి తీరాలి. స్పష్టంగా, సుందరంగా, సంక్షిప్తంగా రాయాలంటే, విద్యార్థులు తగిన అవగాహన కలిగిఉండాలి. కేవలం పాఠకులుగా మిగిలిపోకుండా రాసిన విషయంలోని అంతరార్థాన్ని తెలుసుకోవటం వల్ల విద్యార్థులు ఉత్తమ పాఠకులుగా ఎదుగుతారు.

మనం చెప్పదలచుకున్న విషయాలు, వాటిని ఏవిధంగా చెప్పదలచుకున్నాం, ఏవిధంగా రాయాలనుకున్నాం ... వీటన్నిటి కన్నా ముందుగా రాయదలచుకున్న అంశం మీద ఉన్న ప్రణాళిక, మన ఆలోచనల మధ్య ఉన్న పరస్పర సంబంధం మొదలైన విషయాల మీద ఆధారపడి మనం రాసిన విషయానికి సంక్షిప్తత, సరళత వస్తాయి. పిల్లలు కూడా తాము రాసిన విషయాన్ని ఒకసారి తిరిగి పరిశీలన చేసుకుంటాం అంటుంటారు. అలాగే, ఇంతకుముందు రాసిన విషయంలో తగిన కొన్ని మార్పులు కూడా చెయ్యాలని వారు భావిస్తుంటారు. ఇందుకోసం కొంత సమయం కావాలని వారు ఉపాధ్యాయులను అడుగుతుంటారు. ఈ చర్చ వల్ల తేలిందేమిటంటే, విద్యార్థులు రాసుకోవటానికి, అలాగే ఇంతకుముందు రాసిన విషయంలో కొన్ని మార్పులు చెయ్యటానికి కూడా తగినంత సమయం ఇచ్చినట్లైతే, వారు తమ లేఖన, భాషణ నైపుణ్యాలను క్రమంగా పెంపొందించుకుంటారు. అలాగే, విద్యార్థులు రాసిన అంశాల్లోని దోషాలను ఎర్రకలంతో మరీ ఎక్కువగా గుర్తించటం వల్ల కూడా విద్యార్థులు నిరుత్సాహానికి గురై, లేఖనం పట్ల ఇష్టత చూపించరు.

## 6.5.3 సరళ భాష – సాహిత్య భాష

పెద్ద పెద్ద పదబంధాలు, విశేషణాలు, వాక్య నిర్మాణాలతో రాస్తే అది చాలా గొప్పభాష అని సాధారణంగా అనుకుంటారు. ఒక్కోసారి ఈ తరహా భాష పాఠకులకు కొంత ఆనందం, ఆశ్చర్యం కలిగించి, ఔరా! అనిపించవచ్చు. కానీ, చాలా సందర్భాల్లో ఈ తరహా భాష వల్ల పాఠకులు తాము ఏం చదువుతున్నారో అర్థం చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. పాఠకులకు అర్థాన్ని ఇవ్వకపోగా

అనేక సందేహాలకు ఈ తరహా భాష ఆస్కారం కలిగిస్తుంది. అనేక అపోహలు, వ్యతిరేక అర్థాలు కలిగించే అవకాశం ఉంటుంది. ఈ తరహా రచన వల్ల ఏవిధమైన ప్రయోజనం సిద్ధించదు. పాఠకులకు పూర్తి భావాన్ని (లేదా లేఖకుడు ఊహించిన భావాన్ని) అందించే భాషే ఉత్తమ భాష లేదా ఉత్తమ లేఖనం అవుతుంది. కాబట్టి, విద్యార్థులు అర్థవంతమైన భాషను తమ రచనల్లో వినియోగించేలా వారిని ప్రోత్సహించాలి.

భాషలో ప్రధానమైన అంశం భావ వ్యక్తీకరణ. లేఖకుడు తాను అనుకున్న విషయాన్ని పాఠకుడికి చేరేలా రాయగలగటం గొప్ప నైపుణ్యం. కాబట్టి, తేలికైన పదాలతో, సరళభాషలో రాసినంత మాత్రాన అది మంచి రచన అనిపించుకోదు. కేవలం విస్తృతమైన పఠనం, ఇతర భాషా సంబంధమైన కృత్యాల వల్లనే విద్యార్థులకు పదసంపద పెరుగుతుంది. చక్కటి పదసంపద ఉన్నప్పుడు సాధారణంగా ఇతరులు ఉపయోగించే పదాలకు భిన్నంగా కొత్త పదాలను విద్యార్థులు ఉపయోగించగలుగుతారు. ఈవిధంగా సందర్భానికి తగిన నూతన పదాలు ఉపయోగించే విద్యార్థులను ఉపాధ్యాయుడు ప్రోత్సహించాలి. విస్తృతమైన పదసంపద వల్ల విద్యార్థికి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఎక్కువగా కలుగుతుంది. ఇదొక మంచి లక్షణం. ఏదిఏమైనప్పటికీ, ప్రభావవంతమైన, అర్థవంతమైన సమాచార ప్రసారానికే రచనలో ప్రాధాన్యత ఇవ్వాలి. పాఠకులను గౌరవించటం, వారికి అర్థమయ్యేరీతిలో రాయటం వంటి లక్షణాలను బాలలకు అలవాటు చేయాలి. పాఠకుల అవసరాలు తీర్చే రచనలు చేసే దిశగా వారిని ప్రోత్సహించాలి. సరళమైన పదాలు ఉపయోగిస్తూ రాసేలా వారికి అనేక ఉదాహరణలు ఇవ్వాలి. కొన్ని అభ్యాసాలు కూడా వారిచేత చేయించాలి. ఈ క్రింది ఉదాహణ పరిశీలించండి.

సాహిత్యభాష : తమరికి అనేకానేక విన్నపములు చేయుచూ, నా యొక్క అభ్యర్థనను తమరు సహృదయముతో పరిశీలించి, నా పరిస్థితిని అర్థం చేసుకుని, దొడ్డ మనసుతో అంగీకరించి, రెండు రోజులు నాకు శెలవు మంజూరు చేయించవలసిందిగా దొరతనము వారిని అనేకవిధములుగా అభ్యర్థిస్తున్నాను. ఇందులకు గాను తమరికి నేను అనేకవిధములుగా రుణపడి ఉండగలవాడను.

సరళ భాష : దయచేసి నాకు రెండు రోజులు శెలవు మంజూరు చెయ్యండి. ధన్యవాదాలు.

పై రెండు భాషా రూపాలను పరిశీలించారు కదా? రెండింలో ఏ భాషా రూపం ప్రభావవంతమైనదో ఆలోచించండి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 4**

1. లేఖన లక్ష్యం ఏమిటి?

   ఎ) సాహిత్య భాషను వినియోగించటం

   బి) వ్యాకరణపరంగా దోషరహితమైన భాషను వినియోగించటం

   సి) తప్పులు లేకుండా సరిగ్గా రాయటం

డి) అర్థవంతంగా భావవ్యక్తీకరణ, సమాచార నిర్వహణ

2. మంచి దస్తూరీకి ఉండాల్సిన లక్షణాలేవి?

3. అర్థవంతంగా రాయటం, సరిగ్గా రాయటం – ఈ రెండింటిలో ఏది ప్రాధాన్యత కలిగింది? మీ సమాధానాన్ని విశ్లేషణాత్మకంగా రాయండి.

4. లేఖనం నేర్చుకునే సందర్భంలో పిల్లలు స్పెల్లింగ్ పరంగా, వ్యాకరణపరంగా తప్పులు ఎందుకు రాస్తారు?

5. విద్యార్థుల లేఖన సామర్థ్యాన్ని అభివృద్ధి చెయ్యటానికి వారు ఎక్కువగా ఇష్టపడే పుస్తకం ద్వారా నిర్వహించదగిన ఏవైనా రెండు కృత్యాలను రాయండి.

6. 'తిరిగి రాయటం' – లేఖన నైపుణ్యాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తుంది?

## 6.6 ప్రాథమిక తరగతుల్లో లేఖన నైపుణ్యాన్ని అభివృద్ధి చేయటం

నోట్స్

క్రింది తరగతుల్లో శ్రవణం, భాషణం, పఠనం వంటి ఇతర భాషా నైపుణ్యాల్లో ఏర్పరచుకున్న సాధికారత, పునాదుల మీద లేఖన నైపుణ్యాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఈ నైపుణ్యాలతో పాటు లేఖనం కూడా ఆసక్తిదాయకంగా, ప్రయోజనకరంగా ఉంటూ, విద్యార్థుల స్థాయికి తగినట్లుగా ఉంటే వారు లేఖనంలో ఆసక్తిగా పాల్గొంటారు. లేఖన కృత్యాల్లో బాలలు ఆసక్తిగా పాల్గొనేందుకు వారి స్థాయికి తగినట్లు బృంద, సమూహ, వ్యక్తిగత కృత్యాలను రూపొందించి, వారి చేత చేయించాలి. ఈ తరహా కృత్యాలు కొన్ని ఈ దిగువన ఇవ్వబడ్డాయి. ఇవి కొన్ని సూచనలు మాత్రమే. వీటి ఆధారంగా ఉపాధ్యాయుడు మరికొన్ని కృత్యాలు రూపొందించి, విద్యార్థుల చేత చేయించవచ్చు.

చిత్రాల ఆధారంగా లేఖనం : విద్యార్థులకు చిత్రాన్ని చూపించి, దాని ఆధారంగా విద్యార్థుల ఊహను రాయించటం ఇందులో ప్రధానంగా ఉంటుంది. ఒక వస్తువు, సన్నివేశం లేదా కొన్ని దృశ్యాల సమాహారంగా ఉంచే చిత్రాలను పిల్లలకు చూపించి, ఆ చిత్రాలు చూడటం ద్వారా వారిలో కలిగిన భావాలను రాయించాలి. ఇందులో విభిన్నమైన కృత్యాలు ఉంటాయి. చిత్రం ఆధారంగా కథ రాయటం, చిత్రాన్ని వర్ణించటం, చిత్రంలో వ్యక్తుల సంభాషణలు ఊహించి రాయటం, చిత్రంలో లోపించిన భాగాన్ని పూరిస్తూ రాయటం వంటి కృత్యాలు చిత్రాల ఆధారంగా బాలలతో చేయించాలి. ఏదైనా కథను ప్రకటించే చిత్రాలు ఉన్నట్లయితే, వాటి ఆధారంగా విద్యార్థులతో కథ రాయించాలి.

ఆధారాలతో కథ రాయటం : విద్యార్థులకు ఏవైనా కొన్ని పదాలు లేదా వాక్యాలు ఇవ్వాలి. ఇవన్నీ ఏదైనా ఒక ఇతివృత్తంతో కూడిన కథను రాయటానికి వీలుగా ఉండాలి. వీటి ఆధారంగా విద్యార్థుల చేత కథ రాయించాలి.

స్వతంత్ర రచన : విద్యార్థులకు ఆసక్తికరమైన అంశం మీద లేదా వారు ఎక్కువగా మాట్లాడే విషయం మీద ఏదైనా వ్యాసం రాయించాలి. ఇలా చేయటం వల్ల లేఖన నైపుణ్యాలతో పాటు అభ్యసనానికి సంబంధించి మరెన్నో నైపుణ్యాలు విద్యార్థుల్లో అభివృద్ధి చెందుతాయి.

కథను కొనసాగించటం : ఏదైనా కథ ప్రారంభాన్ని విద్యార్థులకు చెప్పి, మిగిలిన కథను కొనసాగించమని వారికి చెప్పాలి. ఆ కథలో తర్వాత ఏమైందో ఊహించి చెప్పించటం, ఆ కథలోని పాత్రలో నువ్వే ఉంటే ఎలా ప్రతిస్పందిస్తావు వంటి కృత్యాలు పిల్లలతో చేయించాలి.

ఉక్తలేఖనం : ఉపాధ్యాయుడు తరగతి కృత్యాల్లో భాగంగా కొన్ని పదాలు చెప్పి, వాటిని విద్యార్థుల చేత రాయించాలి. దీన్నే ఉక్తలేఖనం అంటారు. ఈవిధంగా చేయటం ద్వారా విద్యార్థులను ధ్వనులను ఏవిధంగా వింటున్నారు? విన్న ధ్వనిని ఏవిధంగా అక్షరరూపంలోకి మార్చి రాయగలుగుతున్నారు వంటి అంశాలను గమనించవచ్చు.

అంత్యాక్షరి : ఇది బాలలకు చాలా ఆసక్తి కలిగించే క్రీడ. వ్యక్తిగత కృత్యంగా లేదా సమూహాలుగా దీన్ని నిర్వహించవచ్చు. తరగతిలోని విద్యార్థులను కొన్ని జట్లుగా విభజించాలి. మొదటి జట్టు ఒక

కాగితం మీద ఒక పదాన్ని రాస్తుంది. ఆ పదంలోని చివరి అక్షరం మొదటి అక్షరంగా ఉండేలా రెండో జట్టు ఇంకో పదాన్ని రాయాలి. ఇలా ఎంతసేపైనా కొనసాగించవచ్చు. ఏ జట్టు చివరి వరకు పదాలు రాస్తూనే ఉంటుందో ఆ జట్టు గెలిచినట్లు ప్రకటించాలి. ఇలాచేయటం వల్ల భాషణం, లేఖనాల్లో విద్యార్థులు ఎక్కడెక్కడ సమస్యలు ఎదుర్కొంటున్నారో గుర్తించి, వాటిని సరిచేసే అవకాశం కలుగుతుంది.

చెప్పింది రాయటం : ఉపాధ్యాయుడు విద్యార్థుల చేత వారికి ఇష్టమైన ఏదైనా ఒక విషయం గురించి మాట్లాడించాలి. ఇలా వారు మాట్లాడిన అంశాన్ని రాయమని వారికి చెప్పాలి. ఇలా చెయ్యటం వల్ల భాషణానికి లేఖనానికి మధ్య ఉండే ఆంతరిక సంబంధాన్ని సాధించటం సాధ్యపడుతుంది. అలాగే, విద్యార్థులు చేసే భాషణ దోషాలను సరిచేసే అవకాశం కలుగుతుంది.

లయాత్మక పదాలు : ఇచ్చిన పదంతో లయాత్మకంగా ఉండే పదాలను విద్యార్థుల చేత రాయించాలి. సందర్భాన్ని బట్టి ఇచ్చి పదం తీరులోనే ధ్వనించే పదాలను కూడా రాయించాలి.

ఉపాధ్యాయుడు లేఖన నైపుణ్యాన్ని బోధించేటప్పుడు విద్యార్థులు వారి భావాలు స్వేచ్ఛగా చెప్పే అవకాశం ఇవ్వాలి. ఏవో కొన్ని వ్యాసాలు ఇచ్చి, విద్యార్థుల చేత వాటిని బట్టీపట్టించే అలవాటు చాలామంది ఉపాధ్యాయులకు ఉంటుంది. ఈవిధానం పూర్తిగా లోపభూయిష్టమైంది. ఈ తరహా కృత్యాలు ఎట్టిపరిస్థితుల్లో నిర్వహించకూడదు. బట్టీపట్టించటం వల్ల విద్యార్థుల్లో స్వేచ్ఛగా ఆలోచించి, రాసే నైపుణ్యం తగ్గిపోతుంది. చక్కగా ఆలోచించి, భావాలు, ఊహలను వ్యక్తీకరించే అవకాశం విద్యార్థులకు కల్పిస్తే, వారు మరింత ఎక్కువగా, నేర్పుగా రాయగలుగుతారు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి – 5**

1. విద్యార్థులకు లేఖన నైపుణ్యాన్ని బోధించేటప్పుడు తీసుకోదగిన చర్యలేవి?

ఎ) నిర్దిష్ట అంశాలను గుర్తుపెట్టుకుని, వాటిని రాయమని అడగాలి.

బి) విద్యార్థుల చేత వర్ణమాల రాయించాలి.

సి) వారి ఆలోచనలు ఏమిటో విద్యార్థుల చేత రాయించాలి.

డి) పిల్లల చేత అవే పదాలను తిరిగి రాయించాలి.

2. లయాత్మక పదాలు విద్యార్థుల్లో లేఖన నైపుణ్యాన్ని ఏవిధంగా పెంచుతాయి? వివరించండి.

---------------------------------------------------

---------------------------------------------------

---------------------------------------------------

3. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు నిర్వహించదగిన కొన్ని లేఖన కృత్యాలను వివరించండి.

---------------------------------------------------

నోట్స్

4. విద్యార్థులకు లేఖన నైపుణ్యాన్ని బోధించటానికి కథలతో కూడి ఉండే కొన్ని కృత్యాలను తయారుచెయ్యండి.

## 6.7 లేఖన నైపుణ్యం - ఉన్నతస్థాయి రూపాలు

విద్యార్థుల్లో సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ, సమాచార ప్రసార నైపుణ్యాలను వృద్ధి చెయ్యటానికి లేఖనంలోఉన్నతస్థాయి రూపాలైన కథలు రాయటం, కవిత్వం రాయటం, లేఖా రచన, పేరాగ్రాఫ్‌లు రాయటం, వ్యాస రచన వంటి కృత్యాలను వారితో చేయించాలి.

పేరాగ్రాఫ్ : ఏదైనా ఎన్నుకున్న విషయం కేంద్రంగా ఆలోచించి, రాసే నైపుణ్యం పేరాగ్రాఫ్‌లు రాయించటం ద్వారా విద్యార్థులకు అలవడుతుంది. విద్యార్థుల్లో స్వంత ఆలోచనలు కలిగించి, వారిచేత ఆలోచింపజేసి, భావాలను అక్షరాల్లో వ్యక్తీకరించే సామర్థ్యం ఈ కృత్యం వల్ల పెరుగుతుంది. వ్యాసరచనకు ఇది పునాదిగా నిలుస్తుంది. దైనందిన జీవితంలో విద్యార్థులు గమనించిన అంశాలను వివరిస్తూ రాయమని వారిని అడగాలి. విద్యార్థుల వయస్సు, లేఖన సామర్థ్యం, అవగాహన సామర్థ్యాల ఆధారంగా పేరాగ్రాఫ్ పరిమాణాల్లో తేడా ఉండవచ్చు. ఇక్కడ పరిమాణం కన్నా విద్యార్థి నేర్చుకుంటున్న నైపుణ్య స్థాయి చాలా ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

వ్యాస రచన : ఏదైనా ఒక విషయానికి సంబంధించి విభిన్న ఆలోచనల సమాహారమే వ్యాసం అవుతుంది. ఇదొక క్రమానుగత కృత్యం. ఉద్వేగాత్మక వ్యాసాలు, ప్రతీకాత్మక వ్యాసాలు అని వ్యాసాల్లో సాధారణంగా రెండు రకాలు ఉంటాయి. అలాగే, ప్రతి వ్యాసంలో ఉపోద్ఘాతం, ప్రధాన అంశం, ముగింపు అనే మూడు ప్రధాన భాగాలు ఉంటాయి. ఇవన్నీ వ్యాసంలో ఉండే ధారాళతను సూచిస్తాయి. మనలో కలిగే ఆలోచనల్ని ఒక క్రమాకృతిలోకి మార్చుకుని, తార్కికత ఉండేలా వాటిని విభాగాలుగా చేస్తూ, మొత్తంగా చెప్పదలచుకున్న అంశం ప్రతిబింబించేలా వ్యాసం రాయాల్సి ఉంటుంది. వ్యాసంలో తప్పనిసరిగా స్పష్టత ఉండాలి. పేరాగ్రాఫ్‌ల కన్నా వ్యాసాలు మరింత ఎక్కువ వివరణాత్మకంగా ఉంటాయి.

విద్యార్థులు రాసే వ్యాసాలు నాణ్యంగా ఉండవనే భావనతో ఉపాధ్యాయులు ఒక్కోసారి తామే వ్యాసాలను చెబుతూ, విద్యార్థుల చేత రాయిస్తారు. ఈ వ్యాసాన్ని విద్యార్థులు బట్టీపట్టటం ద్వారా గుర్తుపెట్టుకుని, అడిగినప్పుడు రాయాల్సి ఉంటుంది. ఇలాచెయ్యటం వల్ల విద్యార్థులకు సొంతంగా

ఆలోచించే సామర్థ్యం, వ్యక్తీకరణ నైపుణ్యం, లేఖన నైపుణ్యం వంటివి పూర్తిగా నశించి పోతాయి. ఎప్పుడూ విద్యార్థుల స్వీయ ఆలోచనలు, అభిప్రాయాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యాసరచనలో ఇది చాలా ముఖ్యమైన అంశం.

లేఖా రచన : లేఖారచనకు ఓ సంప్రదాయ విధానం ఉంది. సాధారణంగా దూర ప్రాంతాల్లో ఉన్న వారికి రాసేదే ఉత్తరం అనే భావన కొద్దికాలం క్రితం వరకు ఉండేది. నిజానికి, వ్యాసాని కన్నా భిన్నంగా లేఖలు ప్రత్యేకమైన భావ ప్రకటన ప్రయోజనాన్ని కలిగిస్తాయి. అందువల్ల, వ్యాసాల్లో ఒక విషయాన్ని వివరించినంత ఎక్కువగా లేఖలో విషయాన్ని వివరించాల్సిన అవసరం ఉండదు. అయితే, లేఖకు కొన్ని ప్రత్యేక నియమాలు, ప్రయోజనాలు ఉంటాయి. గ్రహీతతో లేఖకుడికి ఉండే అనుబంధం మీద లేఖలోని అంశాన్ని వివరించే తీరు ఆధారపడి ఉంటుంది. గ్రహీత లేఖను చదివిన తర్వాత ఎలా స్పందిస్తాడనే విషయాన్ని లేఖకుడు ముందుగానే ఊహించి, అందుకు అనుగుణంగా లేఖ రాయాల్సి ఉంటుంది.

కథా రచన : విద్యార్థుల్లో ఆలోచన, లేఖన నైపుణ్యాలను వృద్ధిచేయటంలో కథా రచన ముఖ్యపాత్ర పోషిస్తుంది. అన్ని వయస్సుల విద్యార్థుల చేతా ఈ కృత్యాన్ని నిర్వహింపజేయవచ్చు. విద్యార్థులు లేఖనాన్ని ప్రారంభించినప్పుడే వారి చేత ఈ కృత్యాన్ని చేయించవచ్చు. కథా రచనల వల్ల విద్యార్థుల్లో ఊహాత్మక సామర్థ్యం, వ్యక్తీకరణ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి. వయసు పెరిగే కొద్దీ విద్యార్థుల్లో సమస్యా పరిష్కారం వంటి అనేక ఇతర నైపుణ్యాలు పెరుగుతుంటాయి. ఇవన్నీ కూడా వారి కథల్లో ప్రతిబింబిస్తుంటాయి. అలాగే, వివిధ సాహితీరూపాల్ని అధ్యయనం చెయ్యటం వల్ల విద్యార్థుల్లో విశ్లేషణ, ఆలోచన, వ్యక్తీకరణ, అవగాహన సామర్థ్యాలు పెరుగుతాయి. ఇవన్నీ లేఖనంలో ప్రతిఫలిస్తాయి.

సాధారణ కథలతో పాటు విద్యార్థుల చేత విషయకేంద్రంగా ఉండే కథలు కూడా రాయించాలి. ఏదైనా ఒక సంఘటన ఆధారం చేసుకుని కథ అల్లటం, ఏదైనా ఒక పాత్ర ఆధారంగా కథ రాయటం వంటి కృత్యాలు కూడా వారితో చేయించాలి.

కవిత్వ రచన : ప్రాథమిక తరగతుల విద్యార్థులకు కవిత్వం, గేయాలు అంటే తెలియవు. వారు కేవలం లయాత్మకంగా ఉండే పదాల గురించిన అవగాహన మాత్రమే కలిగిఉంటారు. కొద్దిగా పెద్దతరగతులకు వచ్చేసరికి విద్యార్థులు కవిత్వంలో ఉండే తూగు, లయాత్మకతను అర్థం చేసుకుని, ఆస్వాదిస్తారు. లయాత్మకంగా ఉండే పదాలు వారిలో కొత్త ఆసక్తి, ఉత్సాహాన్ని కలిగిస్తాయి. లయాత్మక పదాలు విద్యార్థులకు రాయటం పట్ల ఆసక్తి కలిగిస్తాయి. వారిని ఆనందంగా రాసేలా ప్రోత్సహిస్తాయి. కాబట్టి, ఉన్నతదశ విద్యార్థుల చేత చిన్నపాటి కవిత్వ రచనను ఒక కృత్యంగా నిర్వహింపజేయవచ్చు. వ్యక్తిగతంగా, బృందాలుగా లేదా తోటి మిత్రులతో కలిసి కవిత్వరచన చేయించవచ్చు. తొమ్మిది, పది తరగతులకు వచ్చేసరికి మరింత ఉన్నతస్థాయి కవిత్వాన్ని విద్యార్థులతో రాయించవచ్చు. కవిత్వంలో ఉండే సౌందర్యాన్ని ఆస్వాదించే లక్షణం వీరిలో ఉంటుంది. భావాత్మకత, వ్యక్తీకరణ కూడా వీరిలో హెచ్చుస్థాయిలో ఉంటాయి. కాబట్టి, వీరిచేత కొద్దిగా ఎక్కువస్థాయి పదాలు ఉపయోగించేలా, భావాత్మకత ఎక్కువగా ఉండేలా కవిత్వం రాయించాలి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి - 6**

1. ప్రాథమిక తరగతుల్లో విద్యార్థులు ఏ తరహా గేయాల గురించి అవగాహన కలిగిఉంటారు?

   ఎ) విభిన్న పదాలతో కూడి ఉండే గేయాలు      బి) ప్రతీకాత్మక గేయాలు

   సి) లయాత్మక పదాలతో ఉండే గేయాలు      డి) చిన్న గేయాలు

2. వ్యాస రచన కన్నా లేఖా రచన భిన్నంగా ఉంటుంది. ఎందుకు?

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

3. 'విద్యార్థుల ఉత్సుకత' - ఈ అంశం మీద ఒక పేరాగ్రాఫ్, ఒక వ్యాసం రాయండి.

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

4. పాఠశాలల్లో ఒక్కోసారి ఉపాధ్యాయులే వ్యాసాలు, లేఖలు రాసి, విద్యార్థుల చేత బట్టీపట్టిస్తారు. అవసరమైనప్పుడు విద్యార్థులు వాటిని తిరిగి రాయాల్సి ఉంటుంది. - ఈవిధంగా చెయ్యటం సరైనదేనా? మీ సమాధానాన్ని తగిన ఉదాహరణలతో సమర్థించండి.

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

   ---------------------------------------------------------------

## 6.8 సారాంశం

లేఖనం ఒక భాషా నైపుణ్యం. ఏదైనా ఒక అంశం మీద విద్యార్థి తన భావాన్ని లిఖిత రూపంలో వ్యక్తీకరించటం, దాన్ని చదివిన పాఠకుడు అందులోని సారాంశాన్ని అవగాహన చేసుకోవటం అనే అంశాలు ఇందులో ప్రధానంగా ఉంటాయి. పాఠశాలలో లేఖన నైపుణ్యాన్ని బోధించటానికి ముందుగా వారిలో లేఖన పూర్వ నైపుణ్యాలు వారిలో అభివృద్ధి చెందేలా చూడాలి. అవసరమైతే అందుకోసం కొన్ని కృత్యాలు చేయించాలి. చాలక నైపుణ్యాలు, కూర్చునే భంగిమ మొదలైనవన్నీ ఇందులో అంశాలుగా ఉంటాయి. మౌఖిక భాషను లిఖితరూపంలోకి మార్చే నైపుణ్యం కూడా లేఖనంలో ఇమిడి ఉంటుంది. వీటన్నిటికన్నా లేఖనానికి విద్యార్థిని సన్నద్ధుడిని చేయటం అత్యంత ప్రాథమిక అంశంగా ఉంటుంది.

లేఖనం పూర్తిగా అర్థవంతంగా ఉండాలి. ప్రత్యేకించి, లేఖనం ప్రారంభదశలో ఉన్న విద్యార్థుల విషయంలో ఈ అంశానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. మౌఖిక, లిఖిత భాషారూపాలకు ఉండే భేదాల వల్ల లేఖన ప్రారంభదశలో విద్యార్థులు కొన్ని దోషాలు చేస్తారు. భాషణం, పఠనం, శ్రవణం వంటి ఇతర భాషా నైపుణ్యాలు కూడా లేఖనంలో ఇమిడి ఉంటాయి కాబట్టి లేఖనానికి పూర్వమే ఆయా నైపుణ్యాలలో విద్యార్థి పూర్తి సామర్థ్యం సంపాదించేలా చూడాలి.

విద్యార్థి దస్తూరీ ఆధారంగా అతని మూర్తిమత్వాన్ని నిర్ణయించలేము. నిర్ణయించకూడదు కూడా. దస్తూరీ మంచిగా ఉంటే మంచి మూర్తిమత్వం కలిగిన వ్యక్తి అనీ, దస్తూరి సరిగ్గా లేనంత మాత్రాన ఆ వ్యక్తి సరైన మూర్తిమత్వం లేనివాడని నిర్ణయం చెయ్యకూడదు. సరళత, స్పష్టత, సంక్షిప్తత వంటి లక్షణాలకు లేఖనంలో ప్రాధాన్యత ఇవ్వాలి. మౌఖిక భాషకు లేఖన భాష పూర్తిగా భిన్నంగా ఉంటుంది. కాబట్టి, లేఖనం ప్రారంభించటానికి పూర్వమే కొన్ని లిఖిత అంశాలను విద్యార్థుల చేత చదివింపజేయాలి. దీనివల్ల విద్యార్థులకు వాక్యనిర్మాణం పట్ల అవగాహన, వ్యాకరణ నియమాలు తెలుస్తాయి.

విద్యార్థి పెరుగుతున్న కొద్దీ అతడిలో లేఖన నైపుణ్యాలు పెరుగుతాయి. తరగతులు పెరుగుతున్న కొద్దీ విద్యార్థుల చేత ఉన్నత లేఖన రూపాలైన వ్యాసం, కవిత్వం, గేయం వంటి రూపాలను పరిచయం చేసి, వాటిని కూడా విద్యార్థుల చేత రాయించాలి.

## 6.9 సంప్రదింపు గ్రంథాలు


- Trask, R.L. (1995). *Language: the Basics*. London: Routledge
- Kroll, Barbara (2003). *Exploring the Dynamics of Second Language Writing*. London: Cambridge University Press.
- Yule, George (1985). *The Study of Language*. London: Cambridge University Press.


## 6.10 భాగాంత అభ్యాసం

1. లేఖన నైపుణ్యం సాధించటానికి చాలక నైపుణ్యాల్లో సాధికారత ఏర్పరచుకోవాలి. ఎందుకు?
2. పాఠశాలకు రావటానికి పూర్వమే విద్యార్థులకు లేఖన సామర్థ్యం ఉంటుంది.' – మీ నివాస ప్రాంతంలో ఉండే 4 – 5 సంవత్సరాల బాలల్ని పరిశీలించి, పై వాక్యాన్ని సమర్థిస్తూ వ్యాఖ్య రాయండి.
3. మౌఖిక భాష వేగంగా మారుతుంది. కానీ లిఖిత భాష నెమ్మదిగా మారుతుంది. – ఉదాహరణలతో వివరించండి.
4. మౌఖిక, లిఖిత భాషా రూపాల మధ్య ఉండే భేదాలను విశ్లేషించండి.

5. లేఖనంలో సరళత, స్పష్టత, సంక్షిప్తత అవసరం. ఎందుకు? వివరించండి.

6. డిస్‌లెక్సియాతో బాధపడే విద్యార్థులు ఎదుర్కొనే లేఖన సమస్యలేవి?

7. భాషాధ్యయనంలో కవిత్వ రచన, కథా రచన ఏవిధమైన పాత్ర పోషిస్తాయి?

నోట్స్

## కృత్యాలు

- విద్యార్థుల్లో చాలక నైపుణ్యాలను వృద్ధి చేసే కృత్యాలు తయారుచేయండి.
- తరగతిలో మరింత ఉత్తమంగా సమాచార ప్రసారం చేసేలా విద్యార్థిలోని నైపుణ్యాలను వృద్ధి చేసే కృత్యాలను తయారుచేయండి. ఇందుకోసం మీరు ఉపయోగించే విభిన్నమైన విధానాలు, వస్తువులను పేర్కొనండి. వాటిని ఏవిధంగా ఉపయోగిస్తారో కూడా వివరించండి.